VISALAANDHRA VIJAYAWADA, PHONE : NO. 376

ఉదయం

** 6 పేజీలు 6 నయాపైసలు రిజిస్టర్డు నెం. A-193

706200

విశాలాంధ్ర

సంపుటి 9] విజయవాడ * 11 మే 1960 * బుధవారం [సంచిక 43

తన ఉపగ్రహ రాజ్యాలకు అమెరికా అభయహస్తం

వాషింగ్టన్, మే 10

సోవియట్ ప్రధాని క్రుశ్చేవ్ బెదిరింపులకు గురియైన తన మిత్ర దేశాలకు అండగా నిలుస్తామని అమెరికా విదేశాంగశాఖ నేడు ప్రకటన చేసింది.

మీకిష్టమైన నూనెలోనాన బెట్టుడు
కాష్మీర్-కుసుమం
కేశములను పెరిగించును. అకాలనెరసును హరించును.
చర్మము ఉపద్రవములకు సాంటలక్స్ ముల్లాము చర్మము అపాయములకు
"క్లోడి" శ్రేష్టమైన ఉదువత్తులు & సువాసనలు & ఫ్లవర్ డస్ట్ పౌడర్లకు
సంజీవగుణ పండ్ల పొడి & అపూర్వ ఔషధములు ••
సోల్ ఏజంట్లు: యునైటెడ్ కమర్షియల్ కార్పొరేషన్, మదరాసు.
మా స్టాకిస్టులుగా వుండుటకు మీ కిష్టమేనా

"దురాక్రమణకు సాయపడే స్థావరాలను ధ్వంసం చేస్తాం"

పశ్చిమదేశాల రాయబారులకు సోవియట్ ప్రధాని క్రుశ్చేవ్ హెచ్చరిక

సోవియట్ రాకెట్ల శక్తి అద్భుతమైనదని వివరణ

మాస్కో, మే 9

"సోవియట్ భూభాగంపైకి ఇకముందు రహస్యంగా దొంగ విమానాలు పంపినట్లయితే, సోవియట్ వాటిని ప్రేల్చివేయడమే గాదు, అసలా విమానాలు బయలుదేరి వచ్చిన స్థావరాలను విధ్వంసం చేయడానికి రాకెట్లనే ఉపయోగిస్తుంది" అని ప్రధాని క్రుశ్చేవ్ నేడిక్కడ పశ్చిమరాజ్యాల రాయబారులను హెచ్చరించారు.

నేడు జెకొస్లొవేకియా రాయబార కార్యాలయంలో జరిగిన విందు సందర్భంలో రాయబారులనుద్దేశించి మాట్లాడుతూ ప్రధాని క్రుశ్చేవ్ పై విధంగా అన్నారు.

విందుకు పశ్చిమదేశాల పత్రికా విలేకరులు హాజరు కాలేదు. అయితే పశ్చిమదేశాల దౌత్య ప్రతినిధులు మాత్రం హాజరైనారు. క్రుశ్చేవ్ చాల గంభీర ముద్రలో వున్నారని ఈ ప్రతినిధులంటున్నారు.

సోవియట్ యూనియన్ పై ఎగరడానికి గాను అమెరికా విమానాలకు తమ భూభాగాలను స్థావరాలుగా వినియోగించుకోవడానికి అంగీకరిస్తున్న దేశాలకు వ్యతిరేకంగా సోవియట్ ప్రభుత్వం సత్వర ప్రతీకారచర్యలు తీసుకొంటుందని క్రుశ్చేవ్ హెచ్చరించారు.

క్రుశ్చేవ్ తన ప్రసంగం పూర్తయిన తరువాత, పాకిస్తాన్, నార్వే ప్రతినిధులను కలుసుకోగోరారు. మేదినోత్సవం నాడు సోవియట్ భూభాగంపై తిరుగుతున్న అమెరికన్ విమాన గస్తీచర్యలను గూర్చి ప్రశ్నించేందుకే క్రుశ్చేవ్ ఆ ప్రతినిధులను కలుసుకోగోరారు.

అమెరికన్ విమానం పాకిస్తాన్ నుండి నార్వే వెళ్తూ రష్యా భూభాగంపై గస్తీతిరుగుతుండగా కూల్చివేయబడిందని క్రుశ్చేవ్ ప్రకటించిన విషయం పాఠకులకు విదితమే.

క్రుశ్చేవ్ నేడు తన ప్రసంగంలో యింకా యిలా అన్నారు: "ఉద్రిక్తతలను రెచ్చగొట్టాలన్నది నా ఉద్దేశం కాదు. దేశాల మధ్య సంబంధాలను ఉద్రిక్తపర్చే నిర్ణయాలను, అలాగే దేశాలమధ్య చివరకు అమెరికాతో సహా ముమ్ముందు మంచి సంబంధాలు ఏర్పడకుండ అడ్డుకునే చర్యలను, నిర్ణయాలను మనం చేయకూడదనే నా కోరిక.

"నేను మరోసారి చెప్తున్నాను: అమెరికాతో శాంతియుత సహజీవనం గడపాలన్నదే గాదు, దానితో స్నేహపూర్వకంగా జీవించాలనికూడా మేము కోరుకుంటున్నాం.

"సోవియట్ భూభాగంలోకి చొచ్చుకురావడానికి అమెరికా విమానాలకు తమ భూభాగాలను స్థావరాలుగా అనుమతించిన దేశాలలోని రాకెట్ స్థావరాలమైన ఎదురుదెబ్బ తీయగలమన్న సంగతి గుర్తించుకోవాలని కోరుతున్నాను.

"గూఢచారి చర్యలకు వచ్చిన విమానాన్ని ప్రేల్చివేసిన తరువాత అమెరికా నేడొక విచిత్ర పరిస్థితిలో చిక్కుకున్నది. ఈ పరిస్థితిని వారు (అమెరికా) గుర్తించనూ లేకుండా వున్నారు తిరస్కరించ లేకుండానూ వున్నారు. ఒక పెళ్ళికాని కన్నె పిల్లవుంది. కాని నిజంగా ఆవిడ కన్య గాదు. ఆవిడకు బిడ్డ పుట్టాకేగాని ఆవిడకు పెళ్ళి, పెటాకులూ లేవు! నేడు అమెరికా పరిస్థితికూడా సరిగ్గా ఇలానేవుంది!! కాబట్టి ఒక విధంగా చూస్తే ఆవిడ కన్య. మరో విధంగా చూస్తే ఆమె కన్నెరికం కాలిపోయింది.

"కాని జీవిత సత్యం అలా వుంటుందా? లేదు". మీ విమానం మా భూభాగంపైన గస్తీచర్యలకోసం ఎగిరింది" అని అమెరికన్లకు మేము స్పష్టంగా చెపుతున్నాం.

"ఆ విమానం పోయిన జాడనే మేమూ వెళ్ళాం. అది స్వెర్డ్లోవ్స్క్ ప్రాంతం చేరుకోగానే దాన్ని ప్రేల్చివేసి కూల్చాం. సరిగ్గా మీరక్కడే పిట్టగా చిక్కారు. అక్కడే కూరుకుపోయారు అని మేము చెప్తున్నాం.

"ఇక ముందెన్నడైనా సోవియట్ భూభాగంపై గస్తీ చర్యలకోసం విమానాలు పంపడానికి ప్రయత్నాలు జరిగినట్లయితే, అందుకు ప్రతీకార చర్య తీసుకోవడానికి సోవియట్ సర్వసిద్ధంగావుంది.

"మాభూభాగంమీదికి ఎగిరి గస్తీ తిరుగుతూ, రహస్యాలను సేకరించడానికి ప్రయత్నించినట్లయితే, అటువంటి విమానాలను ప్రేల్చి అవతల పారేస్తాం.

"తమ భూభాగాలపై మిలటరీ స్థావరాలున్న దేశాలు ఒక్క విషయాన్ని బాగా బుర్రల్లోకి ఎక్కించుకోండి: మీ దేశాలలోని స్థావరాల నుండి మా భూభాగంపైకి ఎగరడానికి యితరులకు అవకాశం యిస్తే, మీ దేశాలలోని స్థావరాలకు రాకెట్లు పంపి ధ్వంసం చేయగలం.

"మీ దేశాలను యితరులకు కౌలుకిచ్చినట్లయితే, అందుకు మే మవలం

(మిగతా 2 వ పేజీలో)

"విశ్వాసంలేని జంతువు"

మాస్కో, మే 9

మే 1 వ తేదీనాటి అమెరికా విమాన ఉదంతంకాక అంతకు ముందు కూడా అమెరికా విమానమొకటి సోవియట్ భూభాగంపై ఎగిరిందని సోవియట్ ప్రధాని క్రుశ్చేవ్ నేడు జెకొస్లొవేకియా రాయబార కార్యాలయంలో జరిగిన విందులో వెల్లడించారు. ఈ రెండో ఉదంతాన్ని గూర్చి ఆయన యిలా చెప్పారు:

"1959 జూన్‌లో అప్పటి అమెరికా విమానశాఖాధిపతియైన జనరల్ నాథాన్ ట్విన్నింగ్ మాస్కో వచ్చాడు. ఆ సందర్భంలో మేమిచ్చిన అతిథి సత్కారాలన్నీ అందుకున్నాడు. విందుగుడిచి రెండురోజులయిందో లేదో, ట్విన్నింగ్ సోవియట్ భూభాగంపైకి పెద్దఎత్తుల్లో ఒక అమెరికా విమానాన్ని పంపించాడు. ఈ విమానం "కీవ్" వరకు వెళ్ళింది.

"ఇకప్పుడు మేం ఏంచేయాలి? నిరసన తెలుపవామా? వద్దనుకున్నాం. తిన్నయింటి వాసాలు లెక్కపెట్టిన చందంగా వుంది ట్విన్నింగ్ వ్యవహారం. విశ్వాసం లేని జంతువుమాత్రమే ట్విన్నింగ్‌లా ప్రవర్తించగలదు".



దొంగతనంగా రష్యా భూభాగంపై ఎగిరి, సోవియట్ రాకెట్ చే కూల్చబడిన అమెరికా విమానం

క్రుశ్చేవ్ నుండి డిగాల్, ఐక్, మాక్ మిలన్‌లకు లేఖలు

పారిస్, మే 9

సోవియట్ ప్రధాని నికిటా క్రుశ్చేవ్ వద్దనుండి ఒక వ్యక్తిగత లేఖ ఫ్రాన్సు అధ్యక్షుడు డీగాల్‌కు నేడందిందనీ, వచ్చే సోమవారంనాడిక్కడ ఆరంభం కాబోయే ప్రాక్పశ్చిమరాజ్యాల శిఖరాగ్ర సమావేశానికి అది "దుశ్శకునం" మాత్రంకాదనీ ఇక్కడ అభిజ్ఞవర్గాల వారంటున్నారు.

ఈ జాబును ఫ్రాన్సులోని సోవియట్ రాయబారి అధ్యక్షుడు డీగాల్‌కు ఎలీసీ పాలెస్‌లో అందించి, ఒక అరగంటసేపు సంభాషించారు.

ఈ సమావేశంలో శిఖరాగ్ర సమావేశానికి సంబంధించిన అనేక విషయాలను గురించి మాట్లాడ్డం జరిగిందని అధికార వార్త. అయితే, క్రుశ్చేవ్ వ్రాసిన లేఖలోని విషయాలను వెల్లడించడానికి అధికారులు నిరాకరించారు.

ఇటీవల ప్రధాని క్రుశ్చేవ్ పారిస్ వెళ్ళినప్పుడు, అధ్యక్షుడు డీగాల్‌తో ఏర్పరచుకున్న మంచి సంబంధాలను పెంపొందించుకోవాలని, ఆ సంబంధాలవల్ల శిఖరాగ్ర సమావేశం సత్ఫలితాల నివ్వగలదని ఆశిస్తూను ప్రధాని క్రుశ్చేవ్ తమ లేఖలో వ్రాసినట్లు అభిజ్ఞవర్గాలవారు తెలుపుతున్నారు

మాక్మిలన్‌కు లేఖ

లండన్, మే 9

శిఖరాగ్ర సమావేశం ఏర్పాట్లను గురించి క్రుశ్చేవ్ నుండి బ్రిటిష్ ప్రధాని హెరాల్డ్ మాక్‌మిలన్‌కు నేడొక లేఖ వచ్చిందని బ్రిటిష్ అధికారవర్గాల ద్వారా తెలిసింది. దీనికి సమాధానం పంపించవలసిన అవసరంలేదనికూడా వారన్నారు.

శిఖరాగ్ర సమావేశానికి ఏర్పాట్లు చేసేది ఫ్రాన్స్ ప్రభుత్వం కాబట్టి ఆ ప్రభుత్వం క్రుశ్చేవ్‌కు ఆ ఏర్పాట్లను గురించి లోగడ లేఖవ్రాసింది ఈ లేఖకు క్రుశ్చేవ్ జవాబు పంపించారనీ, దాని నకళ్లను లండన్, వాషింగ్‌టన్‌లకు కూడ పంపించారనీ బ్రిటిష్ అధికారులన్నారు.

ఈ లేఖను గురించి వివరించమని విలేఖరులడగ్గా వ్యక్తిగతంగా వచ్చిన లేఖలపై వ్యాఖ్యానించడం సబబు కాదని విదేశాంగశాఖ ప్రతినిధి అన్నారు.

"శిఖరాగ్ర సమావేశం వచ్చే సోమవారం ప్రారంభమవుతుందని మీరు నమ్ముతున్నారా?" అనే ప్రశ్నకు ఆయన ఇలా సమాధానమిచ్చారు:

"శిఖరాగ్ర సమావేశానికి చేయవలసిన ఏర్పాట్లు జరుగుతూనే వున్నాయి. ఇందుకు కావలసిన సాంకేతిక సన్నాహాలు పూర్తి అయ్యాయి. సమావేశం ఇన్నాళ్లు జరగాలని నిర్ణయమేమీ లేదు. ఇంచుమించు వారంరోజులు జరుగుతుందని అనుకొంటాను."

కామన్‌వెల్తు ప్రధానులకు ఎరుకచేయవచ్చు

క్రుశ్చేవ్ మాక్‌మిలన్‌కు పంపిన లేఖను గురించి మాక్‌మిలన్ కామన్‌వెల్తు ప్రధానులకు తెలియజేయవచ్చు ననుకొంటున్నారు.

నేడు బ్రిటిష్ మంత్రివర్గ సమావేశంలో మాక్‌మిలన్ ఈ లేఖలోని అంశాలను తోటి మంత్రులకు తెలియజేశారు. ఇది సోమవారంనాడు పారిస్‌లో ప్రారంభం కానున్న శిఖరాగ్ర సమావేశాన్ని గురించినదని తెలుస్తున్నది.

కామన్‌వెల్తు ప్రధానులు అమెరికా గూఢచారి వుదంతాన్ని గూర్చి ఇంకా చర్చించలేదని అధికార వర్గాల ద్వారా తెలుస్తున్నది. బ్రిటిష్ మంత్రివర్గ సమావేశం జరుగుతున్నందువల్ల కామన్‌వెల్తు ప్రధానుల విస్తృత సమావేశం నేడు జరగలేదు.

వడదెబ్బకు పడిపోయిన పోస్టుమన్ వద్ద చోరీ

విజయవాడ, మే 10

బకింగుహాంపేట పోస్టాఫీసులో పని చేస్తున్న అమిరాలీ అనే పోస్టుమన్ నేటి మధ్యాహ్నం డ్యూటీలో వుండగా ధనలక్ష్మి రైస్ మిల్లు ప్రాంతంలో వడగొట్టి పడిపోయాడు అచ్చట అతనివద్ద వున్న రు 500 లు ఎవరో కాజేశారు చిల్లర సంచీ మాత్రం వుంచారు. తెలిసిన వ్యక్తి అతనిని రిక్షాపై పోస్టాఫీసుకు చేర్చాడు. అక్కడ అమిరాలీకి చికిత్స చేస్తున్నారు

అమెరికాకు సోవియట్ రక్షణ మంత్రి హెచ్చరిక

నాజీ జర్మనీపై విజయోత్సవ సభలో ప్రసంగిస్తూ

మాస్కో, మే 9

అమెరికా విమానాలు బందిపోటు దొంగల్లాగ రష్యా మీదికి ఎగిరి రావడం ప్రచ్ఛన్నయుద్ధాన్ని పునరుద్ధరించడం కోసమేనని రష్యా రక్షణమంత్రి మార్షల్ మాలినోవ్‌స్కీ నేడిక్కడ చెప్పారు.

(ఈ వార్త అందినంతవరకు నిన్న ఇచ్చాము. మిగతా వివరాలివి. —సం॥)

నాజీ జర్మనీపైసాధించినవిజయాన్ని పురస్కరించుకొని ఇక్కడ జరిగిన 15వ వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తూ మార్షల్ మాలినోవ్‌స్కీ పైవిధంగా హెచ్చరించారు. వారి ప్రసంగాన్ని మాస్కో రేడియో సరాసరి ప్రసారం చేసింది. మార్షల్ మాలినోవ్‌స్కీ ఇంకా ఇలా అన్నారు:

"మీరు మా దేశంమీద ఎగరజాలరు. మా దేశం గౌతెమాలగాని, దక్షిణ కొరియాగాని, పాకిస్తాన్‌గాని కాదు. మా ఆకాశ సరిహద్దులను కాపాడుకొని తీరుతాం. మా సమైక్యతనురక్షించుకోడానికి సకలచర్యలూ తీసుకొంటాం

"పిలవాపెట్టని పేరంటంగా వచ్చే అతిథి ఎంతఎత్తున ఎగిరినా అతన్ని కాకకల శక్తి మా సోవియట్ బలగాలకున్న సంగతి గుర్తుంచుకోవడం మంచిది. మా దేశంలో కూలిన అమెరికా విమానం వాషింగ్టన్ అధికారుల ప్రమేయం లేకుండా జరిగిందని అమెరికా విదేశాంగ శాఖ చేసిన ప్రకటన హాస్యాస్పదం. అంతేగాక అంతబాగా ప్రస్తుతించబడే దేశంలో క్రమపద్ధతి ఎంతగా కొరవడిపోయి వున్నదో కూడ దీనినిబట్టి స్పష్టమవుతోంది.

"ఈ బందిపోటు దొంగలు ఉపయోగించుకోడానికి తమ భూభాగాలను అప్పగించేవారందరికీ ఒక హెచ్చరిక: మీరుచేస్తున్న దేమిటో కొంచెం లోతుగా ఆలోచించుకు చూడండి!

"మీతో తగినట్టు వ్యవహరించే హక్కు మాకుంది. అవసరమైతే మీ విమానాశ్రయాలన్నీ అదృశ్యమైపోయే చర్యలన్నింటినీ తీసుకొంటాం" అన్నారు.

ఈ సభకు పదివేలమంది ప్రజలు వచ్చారు. ప్రధాని క్రుశ్చేవ్ కూడ వున్నారు.

"మమ్మల్ని భయపెట్టడం అసంభవం. అడిగాపెట్టని వియ్యమంద దానికి ఎవరెంత ఎత్తున ఎగిరివచ్చినా తగు 'సత్కారం' చేయడానికి మా సోవియట్ యోధులకు సాంకేతిక సంపత్తి సరిపడా వుంది" అని హెచ్చరించారు.

ఈ అమెరికా విమానం ఎగిరి రావడాన్ని గురించి చెప్పే "అసంబద్ధమైన వివరణలను" ప్రస్తావించి మాలినోవ్‌స్కీ ఇలా అన్నారు:

"అంత బ్రహ్మాండంగా పొగడ్తలందుకొనే దేశంలోను, దాని సైనిక బలగాలలోను క్రమబద్ధంగా వ్యవహరించడం ఈ మాత్రంకూడ లేదనే దీనినిబట్టి తెలుస్తోంది. ఎందుకంటే అక్కడ విషం కక్కుతూ చిందులు తొక్కే సైనికాధికారులు, అణ్వస్త్రాలతో మారణహోమం జరపాలని కలలుకనే వున్మాదులు ఎలాంటి అదుపాజ్ఞలులేకుండా ప్రవర్తిస్తున్నారు

"సర్వశ్రీ అమెరికన్ సామ్రాజ్యవాదులారా! ఖబడ్దార్!! మీకిచ్చే సమాధానం ఒక్కటే: మీరు మా దేశంమీద ఎగరజాలరు.... మా ఆకాశవీధులను ఉల్లంఘించిన వాడెవడైనాసరే కూలగూల్చుతాం; ఇప్పుడొకడికి అదేగతి పట్టింది. మాదేశ సరిహద్దులను రక్షించుకోడానికి అవసరమయ్యే సకలచర్యలను తీసుకొంటాం.

"ఆకాశంలో ఎంతో ఎత్తున ఎగిరి, గస్తీచర్యలు జరిపి అమెరికా రక్షణకోసం సమాచారం సేకరించడం న్యాయసమ్మతమైన పద్ధతేనని అమెరికా వాదిస్తోంది.

"చూడండి, మనపవిత్రభూమిలోకి ఎంత దూరం చొచ్చుకొని రావడానికైనా తమకు హక్కున్నదని అమెరి

(మిగతా 3 వ పేజీలో)

పాకిస్తాన్‌కు క్రుశ్చేవ్ హెచ్చరిక

ఇకముందు పెషావర్ ను ఇలా ఉపయోగిస్తే ప్రతీకార చర్య తప్పదని స్పష్టీకరణ

మాస్కో, మే 10

సోవియట్‌పై చర్యలు తీసుకోవడానికి ఇక ముందు పెషావర్ వేదికగా ఉపయోగింపబడినట్లయితే, సోవియట్ ప్రభుత్వం వెంటనే ప్రతీకార చర్య తీసుకొంటుందని క్రుశ్చేవ్ పాకిస్తాన్ రాయబారికి హెచ్చరిక చేశారు.

నిన్నరాత్రి జెక్ రాయబారి కార్యాలయపు విందు సందర్భంలో క్రుశ్చేవ్, పాకిస్తాన్ నార్వేజియన్ రాయబారులను పిలిచి అమెరికా గూఢచారి విమానాన్ని గూర్చి వారిని ప్రశ్నించిన తరువాత పైవిధంగా హెచ్చరించారు. ఈ విమానం పాకిస్తాన్‌నుండి సోవియట్ భూభాగంగుండా నార్వేకు వెళ్ళాలని కార్యక్రమం వేసుకున్న విషయం పాఠకులకు విదితమే.

పాకిస్తాన్ రాయబారి సాల్మన్అలీ వైపు తిరిగి ఇలా అన్నారు:

"అమెరికా విమానం పెషావర్‌నుండి బయలుదేరింది. పెషావర్‌ను సోవియట్ సైనిక దళాలు తమ మ్యాపులపై బాగా గుర్తుపెట్టుకొని వున్నాయి.

అమెరికా విమాన చోదకునివద్ద ఒక మ్యాపు దొరికింది. అందులో పెషావరునుండి స్వెర్డ్లోవ్స్క్ మీదుగా నార్వేకువెళ్లే ఒక ఆకాశమార్గం గుర్తు లున్నాయి.

దానిపై నార్వే రాయబారి, తాను పవర్స్ (అమెరికావిమాన చోదకుడు) చూడడానికి వీలుంటుందా అని అడిగారు.

క్రుశ్చేవ్ "అది సాధ్యంకాదు బయటివారు అతనిపై ఒత్తిడి తెచ్చే అవకాశం మేము ఇవ్వదలచుకోలేదు" అని అన్నారు

బ్రిటన్ పై అమెరికా గస్తీ విమానాలు

లండన్, మే 9

సోవియట్ దేశంలో కూల్చివేయబడిన అమెరికావిమానంలాంటి యు-2 విమానాలు "అప్పుడప్పుడు బ్రిటన్ మీద కూడా ఎగురుతున్నాయని" నేడిక్కడ విలేఖరులతో మాట్లాడుతూ బ్రిటిష్ విమాన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు.

అయితే అవి అలా ఎగిరే కారణం మాత్రం వాతావరణ పరిశోధనకు సంబంధించిన పనికోసమే నన్నారు.

మీ పట్టణాలపై మా విమానంఎగిరితేనో?

అమెరికాకు మాస్కో రేడియో ప్రశ్న

లండన్, మే 10

సోవియట్‌పై అమెరికా గూఢచారి విమానం ఎగిరినట్లుగా, సోవియట్ విమానమే అమెరికాలోని చికాగో మొదలగు పట్టణాలపై ఎగిరితే ఏమిజరిగి వుండేది? అని మాస్కో రేడియో నేడు అమెరికాను ఉద్దేశించిన ప్రసారంలో ప్రశ్నించింది.

"అమెరికాపై రష్యా దాడిచేసే సూచనలు కనపడ్డాయా వెంటనే రష్యాపై పెద్ద ఎత్తున దండయాత్ర

(మిగతా 3 వ పేజీలో)

రష్యా సాయానికి నాజర్ ప్రశంస

అభిప్రాయభేదాలున్నప్పటికీ సోవియట్ విశ్వాసవంతంగా వ్యవహరించినదని వెల్లడి

లండన్, మే 9

అభిప్రాయభేదాలతో నిమిత్తం లేకుండా తమ దేశానికి ఆర్థికసహాయం చేసినందుకు సోవియట్ యూనియన్‌ను ఐక్య అరబ్బు రిపబ్లిక్ అధ్యక్షుడు నాజర్ నిన్న ఎంతగానో మెచ్చుకొన్నారు.

సోవియట్ సాయంతో డామిట్టాలో నిర్మించబడిన నూతన జౌళి మిల్లుకు ప్రారంభోత్సవం జరుపుతున్న సందర్భంలో నాజర్ ప్రసంగించారు.

సాంఘిక సూత్రాలకు తదితరవిషయాలకు సంబంధించిన అభిప్రాయభేదాల కారణంగా సోవియట్ యూనియన్ యింతవరకూ ఐక్య అరబ్ రిపబ్లిక్‌ను గురించి ఒక్క చెడు మాటను కూడా ప్రయోగించలేదని శ్రీ నాజర్ అన్నారు. సోవియట్ యూనియన్ తాను యిచ్చిన మాటకు నిలబడి తన సహాయాన్ని కొనసాగించిందని ఆయనశ్లాఘించారు

జనరల్ కె. యస్. తిమ్మయ్య 9 వ తేదీ సాయంత్రం సైకోక్‌పూర్ వచ్చారు. ఆరుకోట్ల రూపాయలతో కడుతున్న జ్యోతిభవన ప్రాజెక్టును పరిశీలించారు.

పళ్లు, పత్రికలు మొదలగువాటి రవాణా

విజయవాడ, మే 10

వార్తాపత్రికల కట్టలు, పళ్లూ, కూరగాయలు, నెయ్యి మొదలగువాటి రవాణాకై రైల్వేవారు కొన్ని ప్రత్యేక సౌకర్యాలు చేయనున్నారని రైల్వేబోర్డు సభ్యుడు యల్.ఆర్. కళ్యాణరామన్ నేడు విలేఖరులతో అన్నారు. ఇందుకై కొన్ని ప్రత్యేక లోహపు పెట్టెలను ఆయా సరుకుల రవాణాచేసే వారికి రైల్వేవారు సరఫరా చేస్తారని అన్నారు.

ఈ పద్ధతి ప్రస్తుతం మధ్యరైల్వేలో అసలు జరుగుతోంది.

ఈ పద్ధతివల్ల రైల్వే గార్డులు పార్సిళ్ళను దింపించేటప్పుడు ప్రతి పార్సిల్‌ను ఎంచవలసిన అగత్యం లేదు. సరుకులు కూడ తప్పనిసరిగా ఆయా స్టేషనులలో జాగ్రత్తగా దింపడానికి వీలుంటుంది. సరుకులు రవాణాచేసేవారు ప్యాకింగు ఛార్జీలు పెట్టుకోనవసరంలేదు

ప్రత్యేక సంమిశ్రమ కర్తలు
గోల్డెన్ టొబాకో కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ బొంబాయి 21
భారతదేశమందు సిగరెట్ పరిశ్రమల్లో గొప్ప జాతీయ సంస్థ

శార్వరినామ సంవత్సర
వైశాఖ పూర్ణిమ ప. 11-30
విశాఖ రా. 9-56

విశాలాంధ్ర

బుధవారం 11-5-1960

రచయితల కర్తవ్యం

విశ్వ మానవ కల్యాణానికీ, సామాజిక వికాసానికీ సాహిత్యం అత్యుత్తమమైన సాధనం. అట్టి సాహిత్యాన్ని సృష్టించువారు రచయితలు.

రచయితలో గర్భితమైవున్న శక్తి అద్భుతమైనది. సుప్రసిద్ధ రచయిత ఎహ్రెన్‌బర్గ్ అన్నట్లు "రచయిత వ్రాసేమాటలు ఒక వ్యక్తిని మహావీరుడుగా తయారుచేయగలవు; అతనిచే మహోత్కృష్టమైన పనులు చేయించగలవు. అతని హృదయంలో ప్రేమజ్యోతిని వెలిగించగలవు. ఆ మాటలే వరస తప్పితే, ఒకవ్యక్తిని పశువుగా మార్చగలవు. మూర్ఖుడుగా చేయగలవు; చైతన్యాన్ని కుంటుపర్చగలవు; క్రూరకృత్యాలకు ఒడిగట్టేలా ప్రోత్సహించగలవు."

కనుక ఏ దేశంలోనైనా, ఏ భాషలోనైనా ఆ మాటల శక్తి సద్వినియోగమయ్యేట్లు చూడటం సాంఘిక శ్రేయస్సుకవసరం.

లోక కల్యాణమే సాహిత్యానికి పరమ ప్రయోజనమని ప్రాచీన కాలంనుంచీ భారతీయ సంస్కృతి వేనోళ్ళచాటుతున్నా, కాలమాన పరిస్థితులు మారి మధ్యలో కొన్ని పెడదారులు ప్రవేశించటంతో సాహితీ వీధుల్ని కారుమబ్బులలముకొని, మన ఆంధ్ర సాహిత్యంకూడా కుంఠితం కాజొచ్చింది.

ఆ పరిస్థితులలో సమాజంపట్ల, సాహిత్యంపట్ల రచయితల విధుల్ని గురించి సమిష్టిగా సమాలోచించటంకోసం మన తెలుగునాట మూడుదశాబ్దాల క్రితమే ఒక మహాప్రయత్నం ప్రారంభమైందని చెప్పవచ్చు. తత్ఫలితంగానే సాహితీ సమితి, నవ్యసాహిత్య పరిషత్తు, అభ్యుదయ రచయితలసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలంగాణా రచయితలసంఘం మున్నగునవి ఏర్పడి తెలుగు సాహిత్య పునరుజ్జీవనానికి ప్రశంసనీయమైన కృషి చేశాయి. అయితే క్రమేపీ అందులో కొన్ని అడుగంటగా, మరికొన్నిటి పని మందగించింది.

అటువంటి సందర్భంలో నవ్యసాహితీ సమితివారు అఖిల భారత ప్రాతిపదికపై తెలుగు రచయితల ఈతిబాధలు, అవరోధాలు, అవకాశాలు చర్చించటంకోసం మహాసభ జరపటం సంతోషకరమైన సంగతి.

ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య చెప్పినట్లు ఇటీవల మన తెలుగు సాహిత్యం ప్రజల పఠనాసక్తిని వికసింప జేయలేక పోయినమాట వాస్తవం. దాంతో గ్రంథప్రచురణ, అమ్మకమూ సన్నగిల్లాయి. ప్రజా సహకారం లోపించింది. రచయిత ఏకాకియైనాడు.

ఈ దుస్థితి పోవాలంటే తెలుగు రచయిత నూతన దృక్పథం అలవర్చుకోవాలి. చిత్తశుద్ధితో వాస్తవిక విషయాలపై ఆధారపడి సత్యాన్వేషణ చేయాలి. సమాజ పరిణామాన్ని తీర్చిదిద్దే సూత్రాలేమిటో అవగతం చేసుకోవాలి. హేతుబద్ధమైన ఆలోచన సాగించాలి. ప్రజల కుపయోగపడే సాహిత్యం సృష్టించాలి.

కొత్తకూ పాతకూ సంఘర్షణ జరుగుతున్న సంధిసమయమిది. ఈ సంఘర్షణలో రచయిత పాత్ర విశిష్టమైనది. "పాతదంతా బంగారం - కొత్తది కొరగానిది" అనే ఆలోచనగానీ, "కొత్తొక వింత పాతొక రోత" అనే తత్వం గానీ అలవర్చుకోగూడదు. మంచి ఎక్కడున్నా తీసుకోవాలి. పాతకొత్తల మేలు కలయికగా ప్రజలకుపయోగపడేట్లు కాలానికితగ్గ సాహిత్యాన్ని వికసింపజేయాలి. భావమే కాదు; భాషకూడా అలాగే ప్రజల కర్థమయ్యేటట్లు సరళంగా ఉండాలి. అప్పుడే రచయితకు ప్రజాదరణ లభ్యమౌతుంది.

అట్టి సాహిత్యమూ భాషా చేబట్టిననాడు ప్రజాదరణపొందవచ్చుననటానికి తెలుగునాట వేమన మహాకవే మంచి తార్కాణం. మానవతా దృక్పథంతో సౌభ్రాతృత్వ, సమానత్వ సందేశాలను మానవాళి కందజేయడంవల్లనే నేటికీ ఆయన ఇంటింటా సజీవంగా వెలుగొందుతున్నాడు. వేమన మహాపండితుడేమీ కాదు. సామాన్య పరిజ్ఞానంతోనే సమాజజీవనంలోని సత్యాన్ని పరికించాడు. జీవితానుభవంనుంచి ప్రజాభాషలో ఆణిముత్యాలను ప్రసాదించాడు. మోడుపోయిన జీవితాల్లో మోసులెత్తించాడు. ప్రజాదరణ పొందాడు. ఇట్టి ఉదాహరణలు మన తెలుగు సాహిత్య చరిత్రలో కొల్లలుగా వున్నాయి.

వాటినన్నిటినీ మన రచయితలు మననంచేసుకొని, సమాజ శ్రేయస్సుకోసం ప్రజలకర్థమయ్యే భాషలో వాస్తవిక ప్రజాజీవితాన్ని ప్రతిబింబించే ఉత్తమ సాహిత్యం సృష్టిస్తే, నేడైనా ప్రజాదరణకు కరువుండదని మా విశ్వాసం.

పరపీడన అధర్మం

— డాక్టర్ రాధాకృష్ణ

బొంబాయి, మే 9

"సామాజిక న్యాయం, ఆర్థికపురోభివృద్ధి తన రెండులక్ష్యాలుగా మనదేశం నిర్ణయించుకుంది. ఈలక్ష్యాలు సాధించడానికి ప్రతివ్యక్తీ తన శాయశక్తులా కృషి చేయాలి" అని ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ నేడిక్కడ అన్నారు.

ప్రకటనదారుల అఖిలభారతసంఘ వార్షికోత్సవసభలో డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ, ఈ లక్ష్యాల సాధనకు కృషిచేస్తున్న ప్రజల పరస్పర సహనం, భ్రాతృత్వం, గౌరవమర్యాదలు పెంపొందింపజేసుకోవాలని అన్నారు. భారతదేశంలో సహనభావం, భ్రాతృత్వం విఖ్యాతి చెందినవన్నారు. "భారతదేశానికి ఎవరువచ్చినా వారిపై భారతదేశం తన సంప్రదాయాలను రుద్దలేదు. అందుచేతనే ఈ దేశం సంస్కృతి ఏకధాటిగా ఇన్నాళ్ళనుంచీ జీవం మనుతూ వుంది. ఈనాడు మనసంస్కృతి శేషించి వున్నదంటే ఈసంప్రదాయాలే కారణం.

ధర్మం అంటే, అదేదో భగవదంశ అని కొందరు చెప్పజూస్తారు. కాని, అది వాస్తవం కాదు. పరోపకారం ధర్మం; పరపీడన అధర్మం. ప్రజలందరినీ ఐక్యపరచేది ధర్మం, అనైక్యపరచేది అధర్మం అని రాధాకృష్ణ అన్నారు.

విజయవాడలో టెన్నిస్ పోటీలు

విజయవాడ, మే 10

ఆంధ్రరాష్ట్ర టేబుల్ టెన్నిస్ పోటీలు సింగిల్స్, డబుల్స్ సౌత్ ఇండియన్ అసోసియేషన్ విజయవాడవారి ఆధ్వర్యమున మే 27వ తేదీనుండి విజయవాడలో నిర్వహింపబడతాయి. పోటీలో పాల్గొనగోరువారు వివరములకు: "చలసానిమాధవరావు, కార్యదర్శి, (పోటీ నిర్వాహక సంఘము), బందరురోడ్డు, విజయవాడ"కు వ్రాయాలి.

* * *

బొంబాయిలో ఒక రోజు వుండి ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ 10వ తేదీ ఉదయం తిరిగి ఢిల్లీ వెళ్లారు.

కుంటల జలపాతం విద్యుచ్ఛక్తి పథకం

కడెంపై రెండు ఆనకట్టల నిర్మాణానికి ప్రభుత్వ యత్నం

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్, మే 9

ఆదిలాబాద్ జిల్లాలోని కుంటల జలపాతంనుంచి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడానికై రెండు ఆనకట్టల నిర్మాణం తలపెట్టబడింది. ఇందువల్ల కడెం జలాశయానికి ఎడతెగకుండా నీటిసరఫరా కాగలదుకూడా.

ఇక్కడ ఉత్పత్తిఅయిన విద్యుచ్ఛక్తి నిర్మల, బోథ్, ఉట్నూర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లకు సరఫరా చేయబడుతుంది.

ఈ రెండు ఆనకట్టలలోనూ ఒకటి కడెంనదిపై కుంటల జలపాతానికి పైన వున్న కుంటలగ్రామ సమీపంలోనూ, రెండవది గుండివాగు (కడెం నది ఉపనది)పై అది కడెంలో కలసిన ప్రదేశానికి దాదాపు నాలుగు మైళ్ళ ఎగువన నిర్మించబడతాయి.

ఈ స్థలం ఆదిలాబాద్ జిల్లాలో హైద్రాబాద్ - నాగపూర్ రోడ్డుపై గల నేరడుగొండ గ్రామానికి నాలుగు మైళ్ళ ఆవలవున్నది.

కుంటలవద్ద ప్రధాన జలపాతం 150 అడుగులు. ఇది కుంటల గ్రామానికి మూడు మైళ్ళ దిగువన వుంది. ఇది యిక్కడగల సోమన్న స్వామిపేర సోమగూడెం జలపాతమని వ్యవహరించబడుతున్నది. కాబట్టి దీనికి సోమేశ్వరం ప్రాజెక్టు అని పేరుపెట్టాలని సంకల్పం.

ఈప్రాజెక్టు అయ్యేంబాపతు పనులకు 180 లక్షలరూపాయలు ఖర్చు కాగలదని అంచనా. ఇది నిరంతరాయంగా 3,380 కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని 60 శాతం లోడ్ ఫాక్టర్ చొప్పున 5,630 కిలోవాట్ల శక్తిని ఉత్పత్తి చేస్తుంది.

ఈ పథకంవల్ల అదనపు ఖర్చు లేకుండా కడెం ప్రాజెక్టు క్రింద గల 6,500 ఎకరాలకు రబీ పంటకు నీరుకూడా లభిస్తుంది. కడెం జలాశయం వరదలను కూడా ఇది నిరోధిస్తుంది. చౌకగా లభించే విద్యుచ్ఛక్తి చిన్న పరిశ్రమలను ప్రోత్సహించగలదు.

ఇది తృతీయ ప్రణాళికలో చేపట్టబడవచ్చు.

ఈ జిల్లాలో గల పోచేరం జలపాతాన్ని కూడా విద్యుచ్ఛక్తికివినియోగించాలని సంకల్పించబడింది.

ఒంగోలులో నీటి ఎద్దడి

మున్సిపాలిటీ కృషి

ఒంగోలు, మే 8

ఒంగోలులో నీటి సరఫరాకోసం మున్సిపాలిటీ చాలా ధనాన్ని వెచ్చించింది. చివరకు ఉద్యోగులకు జీతాలు యివ్వాలంటే ప్రభుత్వం డబ్బుయిస్తేగాని గడవని పరిస్థితి ఏర్పడింది. క్వారీ బావినుండి గొట్టం వేయడానికి లక్ష రూపాయలు ఖర్చుపెట్టింది. ఇది నెలకు 7 వేలు మొదలుకొని 8 వేల వరకు అత్యవసరంగా నీటి సరఫరానిమిత్తం ఖర్చుపెడుతూంది. రోజూ లారీలతో నీరును అందించడానికి చేసినయత్నం పట్టణంలో ఒక భాగానికి మాత్రమే ఉపయోగపడుతూంది అదనంగా లారీలను తీసుకొనివచ్చి వినియోగించాలంటే రు 25 వేలు కావాలి. అందుచేత ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వం సహాయపడాలని మున్సిపల్ కమిటీ, ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిని, పరిశ్రమల మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డిని కలుసుకున్నారు. హైద్రాబాద్ వచ్చి అన్ని వివరాలను మాట్లాడవలసిందిగా మంత్రులు కమిషనర్‌కు తెలియజేశారు.

దేశ స్వాతంత్ర్యం: జనసంఘ వైఖరి

వరంగల్, మే 9

దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొనేందుకు యువజనులంతా సిద్ధంగా వుండాలని ఆంధ్రప్రదేశ్ జనసంఘ అధ్యక్షుడు శ్రీ జూపూడి యజ్ఞనారాయణ పార్టీ మహాసభ రెండవరోజు సమావేశంలో మాట్లాడుతూ అన్నారు.

రాష్ట్ర మహాసభ రెండు రోజులుగా జరిగింది. నేటితో ముగిసింది. మొత్తం 350 మంది ప్రతినిధులు హాజరైనారు.

భారత భూభాగంపై చైనా దురాక్రమణ జరిపిందనీ, ఇది దేశ స్వాతంత్ర్యానికి చెప్పరానంత ప్రమాదమనీ ఆరోపించారు.

మైనర్ ఇర్రిగేషన్ అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలన్నారు. గ్రామీణ నిరుద్యోగ పరిష్కారానికి గృహ, లఘుపరిశ్రమల నిర్మాణం అవసరమని సూచించారు.

కావలి ఉపఎన్నిక

కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీ దశరథరామిరెడ్డి

హైద్రాబాద్, మే 9

రాష్ట్ర శాసనసభకు కావలి నియోజకవర్గంనుండి జరుగనున్న ఉపఎన్నికకు కాంగ్రెస్‌పార్టీ శ్రీ రేబాల దశరథరామిరెడ్డిని తన అభ్యర్థిగా నిలబెట్టింది. శ్రీ రామిరెడ్డి 1952 ఎన్నికల్లో ఓడిపోయిన విషయం పాఠకులకు విదితమే. (వి. వి.)

ప్రాగాటూల్సు కార్మికులపై కేసులు

హైద్రాబాద్, మే 9

ప్రాగాటూల్సు కార్పొరేషన్ కార్మికులు 18 మందిని అరెస్టుచేసి, మే 4వ తేదీన ఫ్యాక్టరీ ఆవరణలో ఉద్యోగులను కొట్టారనే ఆరోపణతో కేసు పెట్టారు.

మేనేజిమెంటు ఫ్యాక్టరీని లాకౌటు చేసి ఈ వేళతో అయిదురోజులు కావస్తుంది.

మైకా ఎగుమతులు

హెచ్చించడానికి నూతన మార్గాల అన్వేషణ: ఎగుమతి పెంపుదల సమితి చర్చ

కలకత్తా, మే 9

మైకా ఎగుమతులను హెచ్చించడానికి తీసుకోదగు చర్యలు గురించి నిన్న యిక్కడ జరిగిన మైకా ఎగుమతి పెంపుదల సమితి సమావేశంలో నిర్ణయించారు.

ఎగుమతి, దిగుమతి చీఫ్ కంట్రోలరు శ్రీ ఎస్. క. సేన్ సమావేశానికి అధ్యక్షత వహించారు. పరిశ్రమలు, వాణిజ్యశాఖ అదనపు కార్యదర్శి శ్రీ క. బి. లాల్ కూడా హాజరయ్యారు. మైకా ఎగుమతి దారులలో పోటీ ఉన్నందున విదేశీయ దిగుమతిదారులు ఈపోటీని వినియోగించుకొని చాలా కిఫాయితీగా సరుకును కట్టుకొనిపోతున్నారు. విదేశమార్కెట్లలో ప్రామాణికంగా ఉండే సరుకు నమూనాలు పెట్టకపోవటం భారతదేశ వ్యాపారస్తులు అవలంబిస్తున్న అరువు వ్యాపారంవలన మన ఎగుమతి వ్యాపారం చాలా మందకొడిగాసాగుతున్నది. దీనిని అరికట్టడానికిగాను అరువు అమ్మకం పద్ధతిని క్రమబద్ధం చేయాలి.

శ్రీ సేన్ మాట్లాడుతూ ఎగుమతులను హెచ్చించవలసిన అవసరం ఉందన్నారు. ఎగుమతిదారులందరిని ఒకసంస్థ క్రిందకు తేవాలని తాము ప్రయత్నిస్తున్నట్లు తెలియజేశారు. అమెరికాలో సరుకు నిల్వచేయడం తగ్గించారు గనుక అమెరికాకు మైకా ఎగుమతులు తగ్గవచ్చునన్నారు. అయితే ఇది రెండుకోట్లవుతుందన్నారు. మైకా ఎగుమతులు 1958 లో 10 కోట్ల 20 లక్షలు ఉంటే 1959 లో 11 కోట్ల 14 లక్షలకు పెరిగిందన్నారు. అమెరికా, బ్రిటన్, జపాన్, పశ్చిమ జర్మనీ, రష్యాలు భారతదేశపు మైకాను ఖరీదు చేస్తున్నాయని అన్నారు.

ఫెర్రో మాంగనీస్ ఉత్పత్తి

న్యూఢిల్లీ, మే 9

భారతదేశంలో మొత్తం 2 లక్షల 83 వేల 700 టన్నుల ఫెర్రోమాంగనీస్ తయారు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది.

ద్వితీయ ప్రణాళిక ఆఖరుకు 1 లక్ష 60 వేలటన్నుల ఉత్పత్తి అంచనా వేశారు. ఇందులో 60 వేల టన్నులు దేశంలో వాడకానికి, మరో 1 లక్ష టన్నులు ఎగుమతికి కేటాయించారు.

మొత్తం 93 వేల టన్నులు ఉత్పత్తి చేయగల ఆరు ఫ్యాక్టరీలను నిర్మించారు. ఇందులో అయిదు పనిప్రారంభించాయి. 1,40,000 టన్నులు ఉత్పత్తిచేయగల మరో మూడు ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నారు. ఇవి కాక ప్రస్తుతంఉన్న రెండు ఫ్యాక్టరీలను విస్తృతపరుస్తున్నారు.

నిర్బంధోచిత ప్రాథమిక విద్య

ప్రాంతీయగోష్ఠుల ఏర్పాటు

న్యూఢిల్లీ, మే 9

తృతీయ ప్రణాళికాలో నిర్బంధోచిత ప్రాథమిక విద్యను అమలు జేయడానికి రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్ర విద్యాశాఖవారు నాలుగు ప్రాంతీయ గోష్ఠులను ఏర్పాటు చేస్తున్నారు.

దక్షిణ భారతంలో జూన్ 1 తేదీ నుండి బెంగుళూరులో ఇటువంటి గోష్ఠి జరుగుతుంది.

చైనా ప్రజల ఆగ్రహం

అమెరికా విమానోదంతంపై

పెకింగ్, మే 8

సోవియట్ యూనియన్ భూభాగాన్ని అమెరికా విమానాలు పదే పదే అతిక్రమించి రావడంపట్ల చైనాప్రజలు ఆగ్రహావేశాపూరితులవుతున్నారని నవచైనా రిపబ్లిక్ ఉపప్రధాని హోలుంగ్ నేటి రాత్రి యిక్కడ అన్నారు.

ఆయనయింకా యిలా అన్నారు: "సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అమెరికా దురాక్రమణవాదులు జరిపే కవ్వింపు చర్యలను చైనావారూ, మొత్తం సోషలిస్టు శిబిరానికి వ్యతిరేకంగా జరిపే చర్యలుగానే మేము భావిస్తాం"

జకోస్లోవేకియా 15వ విముక్తి వార్షికోత్సవ సందర్భంలో జరిగిన సభలో ప్రసంగిస్తూ మార్షల్ హోలుంగ్ పై విధంగా అన్నారు.

* * *

భారతప్రభుత్వ ఆహ్వానంపై వి. ఎ. సార్జెంట్స్ తన బృందంతో మే 9వ తేదీన న్యూఢిల్లీ వచ్చారు. బ్రిటన్‌లోని సైనిక సమితికి ఈయన సైన్య విషయాలలో సలహాదారు.

◆ ◆ ◆

సింగపూర్‌లో ఠాగూర్ సమితి ఠాగూర్ 99వ జన్మదినోత్సవాన్ని జరిపారు.

అఖిలభారత తెలుగు రచయితల మహాసభ సమాప్తి

[విశాలాంధ్ర విలేకరి]

హైద్రాబాద్, మే 9

తెలుగు సాహిత్యం, కళ, సంస్కృతులకు చెందిన పుట్టు-పూర్వోత్తరాలను వివరిస్తూ చరిత్ర వ్రాసే పనిని అఖిల భారత తెలుగు రచయితల మహాసభవారు "నవ్యసాహితీ సమితికి" అప్పగించారు.

మహాసభ నేటిసాయంత్రంతో ముగిసింది. మహాసభకు మొత్తం 400 మంది ప్రతినిధులు హాజరైనారు.

ఈ సందర్భంలో మహాసభ ఒక తీర్మానాన్ని ఆమోదిస్తూ, రచయితల సహకారసంస్థ" నొకదాన్ని ఏర్పాటు చేసే పథకాన్నిగూర్చి పరిశీలించే బాధ్యతను నవ్యసాహితీ సమితికి అప్పగించింది. రచయితల సహకారసంస్థ ఒక్కసంవత్సరంలోనే ఏర్పడవచ్చునని సమితి కార్యదర్శి నేడిక్కడ పత్రికలవారితో చెప్పారు.

ఆచార్య కురుగంటి సీతారామయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, స్వామి సీతారాంగార్ల మరణానికి సభవారు సానుతాపం తెలుపుతూ తీర్మానించారు.

ఆంధ్ర రాష్ట్రానికి వెలుపల నివసిస్తున్న ఆంధ్ర రచయితలకు కూడా ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీలో స్థానం కల్పించాలని మరో తీర్మానంలో కోరారు.

ప్రభుత్వోద్యోగాలలో వున్న అనేకమంది రచయితలు తమ సాహిత్య సాంస్కృతిక వ్యాపకాలను కొనసాగనివ్వకుండా ప్రభుత్వం నిర్బంధాలు పెడుతున్నందుకు మరో తీర్మానంలో విమర్శించారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య రచయితల, సాంస్కృతిక ప్రతినిధి వర్గాలను పంపుకొనే ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేయాలని మహాసభ వారు కోరారు.

హైద్రాబాద్‌లోని స్టేట్ లైబ్రరీని మద్రాసులోని కన్నెమరా లైబ్రరీ పద్ధతిలో జాతీయ లైబ్రరీగా మార్చాలని సూచించారు.

నేటి తుదిసమావేశానికి శ్రీ బోయి భీమన్న అధ్యక్షత వహించారు. రచయితల సంఘాన్ని ఒక వేదికపైకి తీసుకురావడానికి తోడ్పడ్డ ఈ మహాసభ ఉపయోగాన్ని గూర్చి అనేకమంది రచయితలు ప్రసంగించారు.

భవిష్యత్తులో రెండు సంవత్సరాల కొకపర్యాయం ఇటువంటి మహాసభలు జరపాలని మహాసభ మరో తీర్మానాన్ని ఆమోదించింది.

రచయితలకు కన్సెషన్స్ యివ్వడంలో రైల్వే అధికారులు చూపుతున్న వైఖరిని విమర్శిస్తూ మరో తీర్మానాన్ని ఆమోదించారు.

క్రుశ్చేవ్ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఎంచవలసిన విధాన మేమిటో మాకు తెలుసు. అని మిలిటరీ స్థావరాలున్న దేశాలను హెచ్చరిస్తున్నాం. మీ దేశాలను కౌలుకు తీసుకున్నవారు మా భూభాగంనుండి మా దేశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. మీదేశాలను మాపై శత్రుచర్యలకు వినియోగించుకుంటున్న దేశం మాకు చాల దూరాన వుంది. కాని మీదేశాలు మాత్రం మాకు చాల దగ్గరలో వున్నాయన్న సంగతి గుర్తుంచుకోవాలని చెపుతున్నాం.

"ఎంత దూరాన వున్న లక్ష్యాన్నయినా చేరుకోగల సాధనాలు మా దగ్గర వున్నాయి. అందుచేత దగ్గరలోవున్న స్థావరాలపైన కూడ మేము కన్ను వేసే వుంచుతాం. యింక దీనిప్రభావం ఎలా వుండగలదో ఆదేశాలు తెలుసుకోగలవు.

"అయితే ఉద్రేకాలు రెచ్చగొట్టడం నా ఉద్దేశంకాదు. ఎందుచేతనంటే, ఒకవేళ యుద్ధమనే భయం వున్నప్పటికీ, ప్రజలు శాంతికోసం తపిస్తున్నారు. కుమ్ములాటలకు స్వస్తిచెప్పాలని పరితపిస్తున్నారు. శాంతికోసం కలలుకంటున్నారు. ప్రస్తుతానికియుద్ధంఅనేదిలేదు. కాని మా బలంఎంతో వారు పట్టి చూస్తున్నారు.

బుద్ధిపూర్వక చర్య

"అమెరికన్ విమానం మా భూభాగంపై ఎగరడం కవ్వింపు చర్యకు పైగా కొలదిరోజులలో శిఖరాగ్ర సమావేశం జరుగబోయే ముందు ఇటువంటి చర్యకు దొరకొనడం బుద్ధిపూర్వకంగా జరిగినదే.

"మా భూభాగంపై అమెరికన్ విమానం ఎగరడం ఆ ప్రభుత్వానికి సంబంధంలేకుండా జరిగిన చర్యగా చిత్రిస్తున్నారు కొంతమంది. "ఇదేమి భాగోతం? మిలిటరీవాళ్ళే ఆ పనిచేస్తే, మరి అమెరికా ప్రభుత్వం యింక వ్యతిరేకించేది దేన్ని?

"మా సైన్యంలోనే గనుక ఎవడన్నా స్వతంత్రించి అటువంటిపనికే దొరకొంటే, వెంటనే వాడిపని పడ్తాం. (నవ్వు) ప్రభుత్వానికే సర్వాధికారాలుండాలి. దానికి తెలియకుండా ఏ పని జరగరాదు.

"అలాకాకుండా అమెరికా విమాన ఉదంతంలా, ఎవరికివారే యమునా తీరే అయితే ఆ ప్రభుత్వం ఏం ప్రభుత్వమో దేవుడికే తెలియాలి. అసలు అటువంటి ప్రభుత్వ విధానంలో ఎవరికైనా ఏమి నమ్మకం వుంటుంది? చెప్పండి!

ఎలెన్ డల్లెస్ పాత్ర

"ఈవిషయాన్ని (విమాన వుదంతం) అమెరికా కేంద్ర గూఢచారి ఏజన్సీ డైరెక్టర్ ఎలెన్ డల్లెస్‌కు తెలుసు. పైగా ఈ పెద్దమనిషి అమెరికా ప్రభుత్వ సభ్యుడుకూడా. దీనినిబట్టి అమెరికా ప్రభుత్వ విదేశాంగశాఖ యిచ్చిన సమాధానం చేవగలదిగా లేదు.

"అమెరికా విమాన గస్తీనిగూర్చి అమెరికా ప్రభుత్వానికి తెలిసేవుండవచ్చు. అయితే నేనావిషయాన్ని ఖచ్చితంగా చెప్పలేనుగాని తెలియకుండా వుండకపోదనే నా భావన.

"ఏప్రిల్ 9వ తేదీన కూడా ఒక అమెరికన్ విమానం సోవియట్ భూభాగంపై ఎగిరింది. దాన్నికూడా ప్రేల్చి కూల్చాల్సింది. కాని మా సైన్యాధికారులు ఛాన్సు పోగొట్టుకున్నారు. అయితే మే 1వ తేదీనమాత్రం మా అధికారులు తెలివితేటలతో అమెరికా విమానాన్ని నేల కూల్చివేశారు.

బాంబర్లు - రాకెట్లు

"నేడున్న బాంబర్లు రాకెట్లముందు దిగదుడుపే. సోవియట్ రాకెట్ల పాటవం అద్భుతమైనది. ఎంతదూరాన వున్న లక్ష్యాన్నైనా చేరుకోగలవు. ఇటువంటి రాకెట్లనే అమెరికా విమానాన్ని కూల్చడానికి వినియోగించాం.

"కాబట్టి నేనొకటి చెప్పదలచాను: బాంబర్ల మీద ఆధారపడి మాకు సమాధానం చెప్పదలచుకున్న రాజకీయవేత్తలెవరైనఉంటే, వారు సాధించగలిగేదేమీ వుండదన్న సంగతి గుర్తుంచుకోవాలి. విఫలమవడం ఖాయం. నేడు మా కున్న అత్యంత అధునాతనాయుధాలు, బాంబర్లు తమ లక్ష్యాన్ని చేరకు నేలోగానే విధ్వంసం చేసివేయగలవు."

ప్రసంగం మధ్యలో క్రుశ్చేవ్ విందుకు హాజరయిన అమెరికా రాయబారి థాంప్సన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ యిలా అన్నారు:

థాంప్సన్ అంటే నా కెంతో గౌరవం వుంది. అమెరికా విమానం మా భూభాగంలోకి చొచ్చుకు వచ్చిన ఉదంతంలో ఆయనకేమీ సంబంధం లేదని నాకు బాగా తెలుసు. ఒకవేళ ఆయన సంబంధం ఏర్పర్చుకుందామనుకున్నా అటువంటి అవకాశం వుండేదికాదన్న విషయమూ నాకు తెలుసు. థాంప్సన్ సైనిక గుణం నాకు నచ్చింది. నాకు తెలిసినంతవరకూ, థాంప్సన్ అటువంటి పనికి పూనుకోగల సమర్థుడని నేననుకోను. ఈ విమానోదంతం తన దేశానికి (అమెరికాకు) రాయబారిగా తనకూ ఒక పెద్ద దురదృష్టకరఘటనగా ఆయన భావిస్తున్నట్లు కనబడుతుంది. ఈ బాధను మేము గుర్తిస్తాం." అని క్రుశ్చేవ్ అన్నారు.

బెర్లిన్ సమస్య

తర్వాత బెర్లిన్ సమస్యపై మాట్లాడుతూ క్రుశ్చేవ్ యిలా అన్నారు:

"పశ్చిమబెర్లిన్ అవసరం తమకు లేకపోయినా, అదే కావాలని బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్‌లు ప్రేలాడుతున్నాయి. జర్మనీతో శాంతి సంధిని కుదుర్చుకోవడం పశ్చిమరాజ్యాలకు యిష్టం లేకపోతే మా అంతట మేమే ఏకపక్షంగా జర్మనీ ప్రజా రిపబ్లిక్‌తో శాంతి సంధి కుదుర్చుకోవాల్సి వస్తుంది. ఇది తప్పనిసరి.

పశ్చిమ బెర్లిన్ నిస్సైనిక స్వేచ్ఛాప్రాంతంగా ఉండాలని మా కోరిక. శాంతిసంధి కుదుర్చుకున్న తరువాత, ఒకవేళ ఎవరైనా పశ్చిమ బెర్లిన్‌లోకి చొచ్చుకురావడానికి ప్రయత్నిస్తే, దాన్ని మా బలం ఎదుర్కొని తీరుతుంది.

"పశ్చిమరాజ్యాలలో యింకా బాంబర్ల ప్రదక్షిణలు జరుపుతూనే వున్నాయి. అందుచేతనే వారు సోవియట్‌నే బెదరించడానికి యింకా ప్రయత్నాలు చేస్తూనే వున్నారు.

"ఇటువంటివారికి నా దొక్కటే హెచ్చరిక: ఓ పెద్ద మనుషుల్లారా కాస్త ఇటు వినండి! మాకూ బాంబర్లు వున్నాయి. కాని అవి నిద్రావస్థలో వున్నాయి. మా దేశంలో ఈనాడు జాగరూకమై శత్రుగుండెల్లో సింహస్వప్నంగావున్నవి రాకెట్లు!

"మే 1న మా భూభాగంలోకి చొచ్చుకువచ్చిన అమెరికన్ విమానం భూమికి దాదాపు 65 వేల 600 అడుగుల ఎత్తున ఎగిరింది. కాని మా విమానాలు 91,800 అడుగుల ఎత్తువరకూ వెళ్ళగలవు. ఈ రోజుల్లో బాంబర్లను కూలగొట్టడం కష్టమైన పనేమీ కాదు. అమెరికన్లుకూడా వీటినికూలగొట్టగలరు. కాని ఆకాశద్రోహడం అనే కళలో మాది అందెవేసినచేయి".

అమెరికా విమాన ఉదంత నాటకం

వాషింగ్టన్, మే 10

సోవియట్ భూభాగంలో అమెరికా విమానం కూల్చివేతకు సంబంధించిన నాటకంలో తరువాయి చర్యలను గూర్చి చర్చించే నిమిత్తం అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ నేడు జాతీయసైనిక భద్రతాసమితితో సమాలోచనలు జరుపుతున్నారు.

మామూలుగా ఐతే ఈసమావేశం మూడురోజులతరువాత జరగాల్సివుంది. కాని ప్రస్తుత విమానోదంతం దృష్ట్యా మూడురోజులు ముందుగానే భద్రతా సమితిని సమావేశపర్చారు. విమాన కూల్చివేత ఘటనను గూర్చి, శిఖరాగ్ర సమావేశంపై దాని ప్రభావాన్నిగూర్చి ఏవైఖరి అవలంబించాలన్న విషయమై ఐసెన్‌హోవర్ చర్చించనున్నారు.

విమాన ఘటనపై వ్యాఖ్యానించడానికి అమెరికా సమాచార శాఖ మంత్రి జేమ్స్ హాగర్టీ నేడు పత్రికా గోష్ఠిలో నిరాకరించారు.

జాతీయ భద్రతా సమితి ఇంతకు ముందుగానే సమావేశపడడానికీ, విమాన కూల్చివేత ఘటనకూ సంబంధం లేదని మాత్రం ఆయన చెప్పారు. ఐసెన్‌హోవర్ రేపు శనివారంనాడు పారిస్ వెళ్ళనున్నందువల్లనే ఇంత త్వరలో సమితిని సమావేశపర్చవల్సి వచ్చిందన్నారు.

విదేశాంగమంత్రి హెర్టర్ నేడు అమెరికా పార్లమెంటులోని రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల నాయకులతో సంభాషణలు జరుపుతున్నారు.

విమానోదంతంపై వివరమైన సమాచారాన్ని అందించవలసిందిగా తాను విదేశాంగశాఖను కోరానని ప్రతినిధుల సభా స్పీకర్ శామ్ రేబర్న్ చెప్పారు.

అమెరికా విమానం నార్వేలో దిగాలని ఉద్దేశించినట్లు సోవియట్ చేసిన ప్రకటననుగూర్చి చర్చించడానికి విదేశాంగమంత్రి హెర్టర్‌ను కలుసుకోవాలని అమెరికాలోని నార్వే రాయబారి పాల్ కోట్ అన్నారు.

విదేశాంగశాఖ ప్రతినిధి లింకన్ వైట్ ఒక ప్రకటనచేస్తూ, మాస్కోలోని అమెరికా రాయబారి థాంప్సన్‌కు, రష్యన్ల కస్టడీలోవున్న అమెరికా విమాన పైలట్‌కు మధ్య సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తూందన్నారు.

"పాకిస్తాన్‌నుండి ఇంతవరకూ ఎవరూ యిక్కడికి రాలేదని వైట్ మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కమ్యూనిస్టు దేశాల భూభాగంపైగాని లేదా వాటి సమీప భూభాగాలపైగాని అమెరికా విమానాలు ఎగరరాదని ఐసెన్‌హోవర్ నిషేధం విధించినట్లు వెలువడ్డవార్త అబద్ధమని అధ్యక్షకార్యాలయ సమాచార ప్రతినిధి తెలిపారు.

దేశవ్యాపిత రేడియో, టెలివిజన్ ప్రసంగం దృష్ట్యా రేపు జరగాల్సివున్న పత్రికా గోష్ఠిని ఐసెన్‌హోవర్ రద్దు చేసుకోవచ్చునని తెలుస్తోంది.

విమానోదంతంపై క్రుశ్చేవ్ గత వారం సుప్రీం సోవియట్‌లో చేసిన ప్రసంగపాఠం ప్రతులను ఐరాసలోని సోవియట్ ప్రతినిధి వర్గంవారు భద్రతా సమితికి అందజేశారు.

నేడు ఐరాసలాబీవర్గాల్లో అమెరికా విమానోదంతమే పెద్దచర్చనీయాంశంగా వుంది.

"చాలా తీవ్రమైన సంఘటన"

కెనడా విదేశాంగ మంత్రి

అట్టావా, మే 9

రష్యాలో గూఢచారి పనికోసం పోయి కూలిపోయిన అమెరికావిమానోదంతంపై కెనడా విదేశాంగ మంత్రి హోవార్డ్ గ్రీన్ వ్యాఖ్యానిస్తూ, ఆ సంఘటన చాలా తీవ్రమైనదనీ, అలాంటి సంఘటనలు యింక జరగడం సంభవిస్తే అది అణ్వాయుధ యుద్ధానికి దారితీయవచ్చుననీ చెప్పారు.

ఈసంఘటననుబట్టి నిరాయుధీకరణ సమస్యపై ఒడంబడిక కుదుర్చుకోవడం ఎంత అవసరమో తెలుస్తున్నది. అంతర్జాతీయంగా అజమాయిషీ జరిగే పద్ధతొకటి సరైనదివుంటే ఇలాంటి సంఘటన లుండవన్నారు.

రష్యా తన ఆకాశ సరిహద్దులను తనిఖీకోసం తెరచి ఉంచడానికి అంగీకరిస్తే కెనడాకూడ అలా చేయడానికి సిద్ధంగా ఉన్నదని తెలియజేశారు.

ఈ విషయంపై కెనడా పార్లమెంటులో ఒక ప్రకటనచేస్తూ పై విధంగా తెలిపారు.

ఈ అమెరికా విమానోదంతాన్ని గురించి కెనడా పొందిన ఆందోళనను అమెరికాకు తెలియజేశామన్నారు. ఒక ప్రశ్నకు జవాబిస్తూ మామూలుగా పంపే నిరసన ఏదీ వుండదన్నారు.

"కామన్వెల్తు నుండి వైదొలగం"

టుంకుఅబ్దుల్ రహ్మాన్ ప్రకటన

లండన్, మే 9

జాత్యహంకార సమస్యమీద దక్షిణాఫ్రికా తన వైఖరిని మార్చుకోకపోయినట్లయితే కామన్వెల్తునుండి మలయా తప్పుకొంటుందని తానను కొనడంలేదని మలయా ప్రధాని టుంకు అబ్దుల్ రహ్మాన్ నేడొక టెలివిజన్ గోష్ఠిలో చెప్పారు.

"మలయా స్వాతంత్ర్యానికి పూర్వమూ, ఆ తర్వాతకూడ కామన్వెల్తుతో మలయా ముడిపడివుంటుందనే నేను చెప్పాను.

"ప్రస్తుతం కామన్వెల్తు దేశాలలో అత్యధికంగా డాలర్లు సంపాదిస్తున్నది మలయాదేశమే అలాగే కామన్వెల్తు రక్షణకోసం మా దేశంలో ఒకముక్కను యిచ్చాం కూడాను. అంతేగాక మాదొక చిన్నదేశం. ఏదో ఒక పెద్ద శక్తితో ముడిపడి వుండాలి. అందుకని కామన్వెల్తు అనే పెద్దశక్తితో కలిసివుండడానికే నిశ్చయించుకొన్నాం" అన్నారు.

దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రితో సంభాషణలు జరిపే సమయంలో తాను బాకాట్ చేసినందువల్ల ఏమి సత్ఫలితం కలుగుతుందని ఆశించారని అడుగగా ఏదో ఒకటి చేసి ప్రపంచ దృష్టికి దానిని తేవాలనే అలా చేశాననీ, లేకపోతే దక్షిణాఫ్రికా అనుసరించే జాతివివక్షణా విధానం ఇంకా అలాగే కొనసాగడం జరుగుతుందని అన్నారు.

వాడపల్లిలో సిమెంట్ ఫ్యాక్టరీ

జిల్లా పరిషత్, పంచాయతీ సమితుల తీర్మానం

నల్లగొండ, మే 9

మిరియాలగూడెం తాలూకా వాడపల్లిలో సిమెంటు ఫ్యాక్టరీ నొకదాన్ని నెలకొల్పాలని నిన్న యిక్కడ సమావేశమైన నల్లగొండ జిల్లా పరిషత్, పంచాయతీ సమితుల పరిశ్రమల స్థాయి సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి.

ఈ సమావేశానికి జిల్లా కలెక్టరు శ్రీ శ్రవన్‌కుమార్ అధ్యక్షత వహించారు. మూడవ ప్రణాళికలో నల్లగొండ జిల్లాలో ఒక పారిశ్రామిక కేంద్రాన్ని నెలకొల్పాలనికూడా మరో తీర్మానంలో ప్రభుత్వాన్ని కోరారు. సమావేశానికి లఘు పరిశ్రమల మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ హాజరైనారు.

* * *

శుక్రవారం రాత్రి ఫ్రెంచిసైనికులు 120 మంది అల్జీరియా తిరుగుబాటుదార్లను కాల్చివేశారు.

భారత వ్యవసాయోత్పత్తికి రు. 42 కోట్ల ఫోర్డు నిధి

దేశంలోని ఏడు జిల్లాల్లో ఒకటిగా పశ్చిమ గోదావరికి ప్రయోగాత్మక పథకం

హైద్రాబాద్, మే 10

ఫోర్డునిధి సంస్థ సిఫారసు ప్రకారం, ఆసంస్థ సహాయంతో దేశంలోని ఏడు జిల్లాల్లో వ్యవసాయోత్పత్తి పెంపుదలకు 42 కోట్ల 51 లక్షల రూపాయలను అయిదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం వ్యయంచేయడానికి నిశ్చయించింది. మనరాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లాను ఇందుకు ఎన్నుకొన్నారు.

శాస్త్రీయమైన పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి ఎక్కువ పంట పండించడం ఏవిధంగానో, ప్రయోగాత్మకచర్యగా చూపడానికి ఈ పథకాన్ని తయారుచేశారు.

ఈ పథకం అమలు జరపడానికి అనువైన ప్రాంతాన్ని ఎన్నుకొనడానికి కేంద్రప్రభుత్వం చెప్పినవసతులు పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండటంవలన ఈ పథకాన్ని ఆ జిల్లాలో అమలు జరుపడానికి నిశ్చయించారు. ఆ వసతులు ఇవి: సారవంతమైన భూమి, ఎడ తెగకుండా లభ్యమయ్యే నీరు, అభివృద్ధికర ధోరణిగల వ్యవసాయదారులు, అభివృద్ధి పొందిన సహకార సంఘాలు ఉండాలి. ముంపు భయం, భూసార నష్టంమొదలగు సమస్యలు లేకుండా ఉండాలి.

పరపతి సౌకర్యం ప్రధానాంశం

అప్పు తెచ్చుకొనే స్తోమతు లేని వ్యవసాయదారులకు అప్పు యివ్వడం ఈ పథకంలోని అత్యంత ముఖ్యమైన విషయం. అయితే వీరు ఉత్పత్తిని అధికం చేయడానికి తగిన హామీలను కల్గి ఉండాలి.

ధనరూపంలోగాని, వస్తురూపంలోగాని వ్యవసాయదారులకు యిచ్చే రుణాలు వారికి కావలసినంతవరకూ పుష్కలంగాయిస్తారు. అనగా విత్తనాలు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, చీడ నివారణ మందులు ఇంకా ఉత్పత్తిని అధికంచేసే అన్ని రకాల పరికరాలు సరాఫరా చేస్తారు.

ప్రతీ కుటుంబం ఎంత ఉత్పత్తి పెంచాలో ముందు నిర్ణయిస్తారు. ఆ ప్రాతిపదికపై అప్పులు యిస్తారు. నిర్ణీత ప్రాంతాలను ఎన్నుకుని ఇటువంటి కుటుంబం వారీ ఉత్పత్తి పథకాలను తయారు చేస్తారు.

ఉత్పత్తిని అధికం చేయడానికి అవసరమైన అన్ని సహాయాలనూ సహకార సంఘాలద్వారా యిస్తారు.

శాస్త్రీయ పరిశోధనలద్వారా, ప్రయోగాలద్వారా ఉత్పత్తిని అధికం చేయడంకోసం యత్నిస్తారు గనుక ఈ పద్ధతులను అవలంబించినందున ఒకవేళ పంటలు మామూలుకంటే తక్కువ పండితే అందుకు నష్టపరిహారం యిస్తారు. ఇందుకు కనీస ధరలు ముందే నిర్ణయిస్తారు.

ఈ పథకాన్ని ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసేలోగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక సన్నాహాలను చేస్తున్నది.

కెనడా మంత్రితో శ్రీ పాటిల్ భేటీ

అట్టావా, మే 9

భారతదేశానికి చాలా తక్కువయి పోయిన విదేశ మారకపు వనరులను సంరక్షించుకోడానికోసం కెనడానుంచి కొనే గోధుమలలో కొంత మొత్తాన్ని తగ్గించుకోడానికి అనుమతించాలనే ప్రతిపాదనను చర్చించడానికి నేడు భారత ఆహారమంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్ కెనడా వాణిజ్యమంత్రి గోర్డన్ చర్చిల్‌ను కలుసుకొన్నారు.

ఈ సమావేశానికి పూర్వం పత్రికల వారితో శ్రీ పాటిల్ మాట్లాడుతూ, ఇలాంటి అభ్యర్థననే ఆస్ట్రేలియాకు కూడ పంపామని తెలిపారు.

ఏటేటా కెనడా, ఆస్ట్రేలియాల నుండి నాలుగు లక్షల టన్నుల గోధుమలను భారతదేశం కొంటున్న దన్నారు.

ప్రస్తుతం భారతదేశాని కున్న విదేశ మారకపు నిల్వలన్నీ ఇటీవల అమెరికాతో కుదుర్చుకొన్న ఆహార ఒడంబడిక క్రింద చేసుకొనే దిగుమతులతో ముడిపడి వున్నాయనీ, అందుచేత యిప్పుడీ అభ్యర్థన చేయవలసి వచ్చిందనీ శ్రీ పాటిల్ తెలిపారు.

ఢిల్లీలో సోషలిస్టుల అరెస్టులు

న్యూఢిల్లీ, మే 9

సోషలిస్టు కార్యకర్తలు శ్రీ ఓం ప్రకాశ్ దీక్షిత్, శ్రీ రామసహాయ్ గార్లు నేడిక్కడసత్యాగ్రహం చేశారు. పోలీసులు వారిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపర్చారు. మేజిస్ట్రేట్ వారికి ఆరు నెలలు శిక్షవిధించారు.

ఇంతవరకూ దేశమంతటా దాదాపు 700 మంది సోషలిస్టు సత్యాగ్రహులు అరెస్టయినట్లు తెలుస్తోంది.

ఒరిస్సా కాంగ్రెస్‌లో ముసలం

దర్యాప్తుకు శ్రీ సంజీవరెడ్డిగారి పయనం

న్యూఢిల్లీ, మే 10

ఒరిస్సా కాంగ్రెసులో వివిధవర్గాల మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాలు గురించి నేడిక్కడ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి ఒరిస్సా ముఖ్యమంత్రి డాక్టర్ హరేకృష్ణ మెహతాబ్‌తో ఇష్టాగోష్ఠిగా చర్చలు జరిపారు.

ఒరిస్సాలో కాంగ్రెసుపార్టీ సమస్యలను గురించి పరిశీలించేందుకు శ్రీ సంజీవరెడ్డి మే 16 వ తేదీన ఒరిస్సాకు బయలుదేరి వెళుతున్నారు. ఆయనఅక్కడ మూడు రోజులపాటు ఉంటారు. తిరిగి వచ్చిన తరువాత మే 25వ తేదీన సమావేశం కాబోతున్న కాంగ్రెసు వర్కింగ్ కమిటీకి తన నివేదికనుసమర్పించుతారు.

గణతంత్ర పరిషత్‌తో మిశ్రమ మంత్రివర్గాన్ని కొనసాగించాలాలేదా అన్న సమస్యపైనే ఒరిస్సా కాంగ్రెసు పార్టీలో ముసలం బయలు దేరింది. గణతంత్ర పరిషత్‌తో కాంగ్రెసు మిశ్రమ మంత్రివర్గాన్ని కొనసాగించడం సుతరాం పనికిరాదని ఒక వర్గం గట్టిగా వాదించుతోంది.

జౌళి వేతనాలబోర్డు సిఫారసులు

అమలు జేయడానికి అహమ్మదాబాద్ యజమానుల అంగీకారం

అహమ్మదాబాద్, మే 9

జౌళి వేతనాలబోర్డు సిఫారసులను అమలుజేయడానికి అహమ్మదాబాద్ మిల్లుయజమానుల సంఘం ఏకగ్రీవంగా ఆమోదించింది.

త్వరలో అహమ్మదాబాద్ జౌళి కార్మిక సంఘంలో ఈ విషయమై ఒప్పందం కుదురుతుందని యజమానుల సంఘాధ్యక్షుడు శ్రీ జై కృష్ణ హరి వల్లభదాస్ అన్నారు. ఉభయులు చేసుకొనేఒప్పందం వివరాలను వెల్లడించడానికి కార్మికసంఘ ప్రతినిధి యజమానుల సంఘ ప్రతినిధి నిరాకరించారు. ఒప్పందం రేపు జరుగబోతున్నది.

ఈ ఒప్పందం గతవారం బొంబాయిలో జరిగినదానినే పోలిఉంటుందని తెలుస్తున్నది.

సాంఘిక సేవాశిబిరం

గుంటూరు, మే 8

భారతసేవక సమాజ్ ఆధ్వర్యాన గుంటూరుజిల్లా నిడుబ్రోలులో మే 17వ తేదీనుండి మూడువారాల వరకు సాంఘిక సేవాశిబిరం నిర్వహింపబడుతుంది. ఎస్. ఎస్. ఎల్. సి, కళాశాల విద్యనభ్యసించిన బాలికలు ఇందులో చేరవచ్చు. నివాసం భోజన సౌకర్యాలు ఉచితం. విద్యార్థినులు ఈ జిల్లాకు చెందినవారై ఉండాలి. వివరాలకు "కార్యదర్శి, రీజనల్ క్యాంప్ కమిటీ, కన్నావారితోట, గుంటూరు"కు వ్రాయవచ్చు.

నాగపూర్‌లో కర్ఫ్యూ పొడిగింపు

నాగపూర్, మే 9

నాగపూర్ కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించిన 15 ప్రాంతాలలోని 12 ప్రాంతాలలో నేడు కర్ఫ్యూ తొలగించారు. మహల్‌చౌక్ చుట్టూ ఉండే ప్రాంతాలలో మాత్రం కర్ఫ్యూను కొనసాగిస్తున్నారు.

మహారాష్ట్రమంత్రి శ్రీ ఎస్. ఎమ్. కన్నంవార్ నేడు బొంబాయినుండి ప్రత్యేకంగా నాగపూర్ వచ్చారు.

నగరంలో శాంతిభద్రతలు నెలకొల్పడానికి తీసుకోదగిన చర్యల గురించి పోలీసు అధికారులతో చర్చించారు.

బెంగాల్ శాసన మండలి ఎన్నికలు

కమ్యూనిస్టు అభ్యర్థి అబ్దుల్ రసూల్ ఎన్నిక

కలకత్తా, మే 10

పశ్చిమ బెంగాల్ శాసనసభ నుండి శాసనమండలికి రెండు సంవత్సరాలకొకసారిజరిగే ఎన్నికల్లో ఆరుస్థానాలు కాంగ్రెసుకు, ఒకస్థానం కమ్యూనిస్టులకు, ఒకటివామపక్షస్వతంత్రఅభ్యర్థికి, మరొక స్థానం పి. యస్. పి. కి లభించాయి.

ఈసారి తొమ్మిదిస్థానాలు ఖాళీ అయినాయి.

ఎన్నికైన కమ్యూనిస్టు అభ్యర్థి పేరు అబ్దుల్ రసూల్.

డాక్టర్ సురేష్ బెనర్జీ రాజీనామా

పశ్చిమ బెంగాల్ ప్ర. సో. పార్టీ అధ్యక్ష పదవికి

కలకత్తా, మే 10

పశ్చిమ బెంగాల్ ప్రజాసోషలిస్టు పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ చంద్ర బెనర్జీ అనారోగ్య కారణంగా తన పదవికి రాజీనామా యిచ్చానని నేడు ప్రకటించారు.

రాజీనామాకు కారణంరాజకీయాలేగాని అనారోగ్యంకాదనిఅభిజ్ఞవర్గాల్లో అనుకొంటున్న విషయాన్ని గురించి పత్రికా విలేఖరులు ప్రశ్నించగా డాక్టర్ బెనర్జీ దానిపై వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

కలకత్తా లోక్ సభ ఉపఎన్నికలో ప్ర. సో. పార్టీ అభ్యర్థి ఘోరపరాజయం పొందడమేగాక ధరావతును కూడాకోల్పోయినసంఘటన తరువాత డాక్టర్ బెనర్జీ రాజీనామా యివ్వడానికి కారణంరాజకీయాలేననివ్యాఖ్యానించుకున్నారు.

తెలుగు-కన్నడలకు ఏక లిపి

మైసూరు యూనివర్శిటీ ప్రొఫెసర్ సూచన

హైద్రాబాద్, మే 10

తెలుగు, కన్నడ భాషలకు ఒకే లిపిని ఏర్పాటు చేసుకొంటే ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రజలమధ్య సాంస్కృతిక సంబంధాలు బాగా బలపడగలవని నేడిక్కడ మైసూరు యూనివర్శిటీ తెలుగు డిపార్టుమెంటు అధిపతి విద్వాన్ కె. సుబ్బరామప్ప అభిప్రాయం వెలిబుచ్చారు.

ఇక్కడ జరుగుతున్న అఖిలభారత తెలుగు రచయితల మహాసభ సందర్భంలో దక్షిణ భారతీయ భాషలపై ఏర్పాటుచేయబడ్డ గోష్ఠిలో శ్రీ సుబ్బరామప్పగారు కన్నడ-తెలుగు భాషల సంబంధాలపై ఒక పరిశోధనావ్యాసాన్ని చదివారు.

ఈ గోష్ఠికి కేంద్ర సాహిత్య అకాడమీ మద్రాసు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి శ్రీ కె. యమ్. జార్జి అధ్యక్షత వహించారు.

బొంబాయిలో సోషలిస్టు వాలంటీర్లు అరెస్టు

బొంబాయి, మే 10

బొంబాయిలో ప్రభుత్వ ఆహార ధాన్యాల గోదాముల తాళాలను తెరవడానికి ప్రయత్నించినందుకుగాను సోషలిస్టుపార్టీకి చెందిన పదిమంది వాలంటీర్లను నేడు పోలీసులు అరెస్టు చేశారు.

వారిని ఆ తరువాత విడుదల చేశారు.

ఈవేళ నుండి శాసనోల్లంఘన నోద్యమాన్ని ప్రారంభించాలని సోషలిస్టు పార్టీ బొంబాయి శాఖ నిర్ణయించింది. వాలంటీర్ల మొదటి దళం నేడు ఊరేగింపులో గిర్గాంలోని పార్టీ ఆఫీసు నుండి ప్రభుత్వ గోదాము వద్దకు బయలుదేరింది. గోదాములోని తిండిగింజలను వశపరచుకొని తక్కువ ధరకు ప్రజలకు అమ్మాలని వారు నిశ్చయించుకున్నారు.

మే ఒకటవ తేదీనుండి సోషలిస్టు పార్టీ ప్రారంభించిన ఉద్యమంలో ఒక భాగమే ఈ సత్యాగ్రహం.

ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిస్థితి

యర్రగొండపాలెం, మే 10

కాంగ్రెసు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో, ఆచరణలో యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసంతృప్తిచెంది వున్నారు. చాలా వెనుకబడ్డ యీ నియోజకవర్గములో ప్రజలకు నీటివసతులుగాని, రహదారి సౌకర్యాలుగాని, తిండి, వృత్తి విద్యా, వైద్య, సెలవులుగాని ఏమీ పరిష్కారం కాలేదు. దారిద్ర్యము తాండవమాడుతూంది. అభివృద్ధి ప్రణాళికలద్వారా ప్రజలకు రావలసిన ప్రయోజనాలను కొద్దిమంది స్వార్థపరులు స్వాహాచేస్తున్నారు. దీనికితోడు స్థానిక (కొంతమంది) కాంగ్రెసు వాదులతో కలసి మంత్రివర్యులు శ్రీ పిడతల రంగారెడ్డిగారి ఉపన్యాసాలు ప్రజావ్యతిరేకులైన స్వార్థపరులను మరింత ప్రోత్సహిస్తున్నాయి, ప్రజలను దెబ్బతీస్తున్నాయి

ఈ నియోజకవర్గములో ప్రజాసేవకుడుగా గుర్తింపబడిన వృద్ధ కాంగ్రెస్ వాది శ్రీ ఎక్కలి రామయ్యగారిని కాంగ్రెసు అభ్యర్థిగా నిలబెట్టకుండా పిడతల రంగారెడ్డిగారు యిదివరకు అనేక పదవులలో మునిగి తేలుతున్న తన శిష్యవర్గము వారిని కాంగ్రెసు అభ్యర్థిగా నిలబెట్టడంలో కాంగ్రెసు ప్రజానీకములో, కాంగ్రెసులోవున్న బుద్ధిమంతులలో, తీవ్రఅసంతృప్తి చెలరేగింది. విద్యావంతులు, ప్రజాసేవకులు శ్రీ పూల సుబ్బయ్యగారినే బలపరచాలని ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు

ఈ నెల 3, 4, 5 తేదీలలో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిగావున్న శ్రీ పూల సుబ్బయ్యగారు, న్యాయవాదులు శ్రీ శాస్త్రి, సోమశేఖర శెట్టిగార్లు, రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీసభ్యులు శ్రీకడియాల గోపాలరావు, నియోజకవర్గ రైతు పెద్దలు శ్రీ మాతలూరి కోటయ్య చౌదరి, చోడియ్యచౌదరి, వెంకట సుబ్బారెడ్డి, కాండారెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీ కోటిరెడ్డి గారు (పీయు పంచాయతీ అధ్యక్షులు), శ్రీరామ లింగయ్యగారు, కమాల్ ఖాన్ గారు కలసి నియోజకవర్గములో ప్రధానకేంద్రాలలో పర్యటన చేశారు. ఈ ప్రచారములో పాల్గొన్న పెద్దలు యెక్కువగా '52, 55, 57 సంవత్సరాలలో కాంగ్రెసును బలపరచినవారే త్రిపురాంతకము దోర్నాల, ఎర్రగొండపాలెం, దూపాడు మొదలగు ఫిర్కా గ్రామాలేగాక యింకా 15 ప్రధాన కేంద్ర గ్రామాలలో రైతులను, వర్తకులను, వ్యవసాయ కార్మికులను యితర పెద్దలను కలుసుకున్నారు.

ప్రతిచోట ప్రజాసామాన్యముస్థానిక ప్రజానాయకులు కాంగ్రెసు ప్రభుత్వము, ముఖ్యంగామంత్రి శ్రీ రంగారెడ్డిగారు అవలంబించే నిరంకుశ పద్ధతులను ఖండించారు. సాంప్రదాయంగా కాంగ్రెసును బలపరచే వర్తక ప్రముఖులు చాలమంది బహిరంగంగా శ్రీ పూల సుబ్బయ్యగారినే బలపరుస్తామని ముందుకువస్తున్నారు. ప్రజానీకం పార్టీ ప్రజాతంత్ర వాదులు కాంగ్రెసు అభ్యర్థిని ఓడించడానికి యీ సందర్భములో చూపిన ఐక్యత, పట్టుదల రాజకీయ రంగములో సత్వర మార్పులకు దారితీయగలదనడములో సందేహములేదు. (వి. వి.)

కామన్వెల్తులో నైగీరియా సభ్యత్వం

లండన్, మే 9

అక్టోబరు 1 వ తేదీనుంచి స్వాతంత్ర్యం పొందనున్న పశ్చిమాఫ్రికాలోని నైగీరియా ప్రస్తుతం బ్రిటిష్ వలస ప్రాంతం. ఆనాటినుంచి కామన్వెల్తులో సభ్యత్వం పొందడానికి ఇక్కడ జరుపుతున్న ప్రధాన మంత్రుల సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఆదేవిధంగా ఐరాసలో నైగీరియాకు కూడ సభ్యత్వం వుండాలని యీ కామన్వెల్తు దేశాలన్నీ ఒక తీర్మానం ప్రతిపాదించాలని కూడ నిర్ణయించాయి. నైగీరియా వైశాల్యం మూడులక్షల 78 వేల 250 చదరపుమైళ్ళు. ఇక్కడ వంద ఏండ్లకు పైగా బ్రిటిష్ వలసాధిపత్యం సాగుతోంది.

తృతీయ ప్రణాళికలో బొగ్గు ఉత్పత్తి

న్యూఢిల్లీ, మే 10

బొగ్గుకు సంబంధించిన భారత ప్రభుత్వ సంఘంవారు తృతీయ ప్రణాళికా కాలంలో తొమ్మిదికోట్ల 50 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని ఉంచుకోవాలని తాత్కాలికంగా అంగీకరించింది.

కేంద్ర ఉక్కు, గనులు, ఇంధనాల శాఖామంత్రి సర్దార్ స్వర్ణసింగ్ అధ్యక్షతను సమావేశమైన బొగ్గు సమితి ఇందుకు సంబంధించిన వివరాలను గురించి కూడా చర్చించింది.

మారిటియస్‌లో భారతదేశ కమిషనర్‌గా ఉన్న జగన్నాథ దాల్మియా, ఆఫ్ఘనిస్తాన్‌లో భారతదేశరాయబారిగా నియమించబడ్డారు.

జాత్యహంకారంపై కామన్వెల్తు దేశాల చర్చలు

తనకు నిమిత్తంలేదని ఎరిక్‌లో ప్రకటన

లండన్, మే 10

నిన్న దక్షిణాఫ్రికా అంతరంగిక వ్యవహారాలపై కామన్వెల్తు ప్రధానులు జరిపిన చర్చలతో తనకు నిమిత్తం లేదనిదక్షిణాఫ్రికా విదేశాంగమంత్రి లో నేడొక ప్రకటన చేశారు.

లో ప్రకటన ఇలావుంది:

"నిన్న కామన్వెల్తు ప్రధానుల సమావేశాన్ని గురించి బ్రిటిష్ పత్రికలు ప్రకటించిన వార్తలు వాస్తవాన్ని చిత్రించడంలేదు. అందువల్ల నేనీప్రకటన చేయవలసి వచ్చింది.

బ్రిటన్‌తో సంబంధాలు చెడుస్తాయని లో బెదరింపు

"దక్షిణాఫ్రికా వ్యతిరేకాందోళన" ఇలానే కొనసాగినట్లయితే, దక్షిణాఫ్రికాకు, బ్రిటన్‌కు మధ్య సంబంధాలు చెడిసే అవకాశమున్నదని దక్షిణాఫ్రికా విదేశాంగమంత్రి లో నేడు బెదరించారు.

ఒక విందులో మాట్లాడుతూ లో ఇంకా ఇలా అన్నారు:

"నా ఎదుట కొందరు రాడికలు ప్రదర్శనలు జరపడమేకాదు; దక్షిణాఫ్రికా సరకులను బహిష్కరించాలనే ఉద్యమం కూడా నడుస్తున్నది. ఇంతేకాదు. పత్రికలు కూడా దక్షిణాఫ్రికా వ్యతిరేకాందోళన కొనసాగిస్తున్నాయి. మాపట్లగల ఈద్వేషం పార్లమెంటులోకూడా వ్యక్తమయింది. ఈ ఆందోళనంతా బ్రిటన్‌లో కొన్ని వర్గాలు సాగిస్తున్నాయి."

స్టేట్ బ్యాంకు మేనేజిమెంటు విచ్ఛిన్నకర చర్య

పాట్నా, మే 10

ఇటీవల 21 రోజులపాటు జరిగిన స్టేట్ బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో పాల్గొనని ఉద్యోగులకు ఒక్కొక్కరికి వందరూపాయల విలువగల వస్తువులను బహుమతిగా యిచ్చినందుకు స్టేట్ బ్యాంకు మేనేజిమెంటును ఖండిస్తూ పాట్నా స్టేట్ బ్యాంకు ఉద్యోగుల సంఘంవారు ఒక తీర్మానం చేశారు.

ఉద్యోగులలోని సంఘటిత శక్తిని దెబ్బతీసేందుకే మేనేజిమెంటు ఇలాంటి చర్యకు పూనుకొన్నదనీ, గుర్తింపబడిన ట్రేడ్‌యూనియన్ల విషయంలో యిలా వ్యవహరించడం కూడదనిపనని ఆ తీర్మానంలో ఖండించారు.

ఉద్యోగుల తరఫున బేరమాడేందుకు సమ్మెకు పిలుపునిచ్చే హక్కు న్యాయశాస్త్రరీత్యా తమకు గలదని స్పష్టం చేసింది.

చిన్న చిన్న ఉక్కు బట్టీలు

మరో ఏడు నెలకొల్పడానికి నిర్ణయం

న్యూఢిల్లీ, మే 10

మద్రాసు, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌లలో మరొక ఏడు చిన్న ఉక్కుబట్టీలను నెలకొల్పడానికి భారత ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ ఏడింటిలోనూ మద్రాసు రాష్ట్రంలో రెండూ, మహారాష్ట్రం, గుజరాత్ రాష్ట్రాల్లో మూడు, పశ్చిమ బెంగాల్‌లో ఒకటి మధ్యప్రదేశ్‌లో ఒకటి నెలకొల్పుతారు.

1959 లో చైనాను, సందర్శించి వచ్చిన భారతీయ ఉక్కు ప్రతినిధి వర్గం సిఫార్సు ననుసరించే ఈచిన్న ఉక్కుబట్టీలను నెలకొల్పుతున్నారు.

లంచగొండితనం నిర్మూలన కమిటీ

ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటు

నైనిటాల్, మే 9

ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం లంచగొండితన వ్యతిరేక కమిటీ నొకదానిని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి డాక్టర్ సంపూర్ణానంద్ కమిటీకి అధ్యక్షుడుగా వుంటారు. హోమ్ మంత్రి ఉపాధ్యక్షుడుగా వుంటారు.

ఏలూరు

ఏలూరు పట్టణ స్వతంత్ర యువజన సంఘం కార్యకర్తల సమావేశం ఈ నెల 3వ తేదీ శ్రీ ప్రత్తి శేషయ్యగారి అధ్యక్షతన జరిగింది. ఇటీవల జిల్లా సంఘ సమావేశంలో ఆమోదించినతీర్మానాలనుసభ్యులుచర్చించిఆమోదించారు.

ఈ నెల 15వ తేదీన ఏలూరులో పట్టణస్వతంత్ర యువజనసంఘసదస్సు జరపాలని నిశ్చయించారు.

రక్షణమంత్రి హెచ్చరిక

(1 వ పేజీ తరువాయి)

కాలో అధికార వర్గాలు ఎలా వాదిస్తున్నారో! మన స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం అత్యుత్తమ సోవియట్ పుత్రులంతా తమ రక్తంతో తడిపిన మన పవిత్ర భూమిపై చొచ్చుకు రావడానికి వారికి హక్కున్నదట!

"మా దేశంమీదికి బందిపోటు దొంగల్లా ఎగిరివచ్చే విమానాలకు ఆశ్రయమిచ్చి, సదుపాయాలు కలిగించే దేశాలన్నీ అంతా అయిపోకముందే ఒకటికి రెండుసార్లు బాగా ఆలోచించుకోమని మా హెచ్చరిక."

(సభలో పెద్దపెట్టున హర్షధ్వానాలు.)

"ఈ విధంగా ఉల్లంఘించి మాపైకి వచ్చేవారు ఏయే విమానాశ్రయాల నుంచి బయలుదేరివస్తున్నారో కించిత్తు పొరపాటుకూడ లేకుండా తెలుసుకోగలిగిన విధంగా మా సాంకేతిక సాధన సంపత్తి అభివృద్ధి అయింది. అలాంటి సమయాల్లో ఆయా స్థావరాలు, విమానాశ్రయాలమీద ఏలాంటి చర్యలైనా తీసుకోడానికి మాకు హక్కుంది; అలాంటి స్థావరాలు, విమానాశ్రయాలు రూపురేఖలు లేకుండా పోయేలాగ వ్యవహరించగలం" అన్నారు.

మే ఒకటవ తేదీన సోవియట్ సీమాతిక్రమణ చేసిన అమెరికా విమాన సంఘటనను ప్రస్తావించి ఇలాచెప్పారు:

"ఇక చర్యతీసుకోవాలని సోవియటు ప్రభుత్వం పంపిన ఆదేశాన్ని అందుకున్న వెంటనే ఎంత ఎత్తునుంచైనా ఎగిరివచ్చే పిలవని పేరంటాలను దెబ్బతీయగల శక్తివంతమైన ఆయుధాలుగల సోవియట్ సైనికులు మొదటి దెబ్బలోనే ఆ విమానాన్ని నేల కూల్చారు.

"సోవియట్ సైన్యానికి వున్నంత ఆయుధ సంపత్తి, కాల్చగలశక్తి మరే యితర సైన్యానికీ లేదు. మనమీదికి కత్తిదూసి తలపడడానికి ఏదురాక్రమణదారుడైనా సిద్ధపడితే వాడిని సర్వనాశనం చేస్తాం; ఇక భూమి మీద నుంచి తుడిచివేస్తాం.

"సోవియట్ ప్రజలు ధైర్యంగా, ఆత్మ విశ్వాసంతో పార్టీ దిద్దిపెట్టిన కమ్యూనిస్టు పంథాన సాగిపోగలరు" అని మార్షల్ మాలినోవస్కీ అన్నారు.

అ. భా. తెలుగు రచయితలమహాసభ

జయప్రదంగా సమాప్తం

హైద్రాబాద్, మే 10

నవ్యసాహితీ సమితి ఆధ్వర్యాన గత నాలుగు రోజులుగా యిక్కడ రెడ్డిహాస్టల్‌లో ప్రత్యేకంగా నిర్మించబడిన సరస్వతీ నగర్‌లో జరుగుతున్న ప్రథమ అఖిలభారత తెలుగు రచయితల మహాసభ గత రాత్రితో జయప్రదంగా ముగిసింది.

మొట్టమొదటిసారిగా ఆంధ్రలోని వివిధ ప్రాంతాలనుండేగాక, యావద్భారతంలోని వివిధ ప్రదేశాలనుండి దాదాపు నాలుగువందలమంది ప్రతినిధులు ఈ మహాసభకు రావడం ఒక ప్రత్యేక విషయం. నేడు రచయితలను ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై దేశంలోని తెలుగు రచయితలు ఒకరి అభిప్రాయాలను మరొకరు తెలుసుకునేందుకు ఈ మహాసభ చక్కటి అవకాశాన్ని ఇచ్చింది.

అయితే మొదటిసారిగా యింతమంది రచయితలు ఒకచోట చేరినందున కొన్ని నిర్దిష్టమైన సమస్యలపై సంపూర్ణమైన చర్చలు జరగడం సాధ్యంకాలేదు. పెద్దపెద్ద రచయితలు, కొంతమంది పండితులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చేందుకు మాత్రమే అవకాశం లభించింది.

మొత్తంమీద మహాసభ జయప్రదంగా జరిగింది. (వి. వి.)

ఐక్య అరబ్ రిపబ్లిక్ లక్ష్యంపై నాజర్

కైరో, మే 10

వర్గ పోరాటం అవసరంలేకుండా "సోషలిస్టు, ప్రజాతంత్ర, సహకార సమాజాన్ని" నిర్మించడమే ఐక్య అరబ్ రిపబ్లిక్ లక్ష్యమని అధ్యక్షుడు నాజర్ నేడిక్కడ ఒక ప్రసంగంలో అన్నారు.

ఈ ప్రసంగాన్ని కైరో రేడియో ప్రసారం చేసింది.

దేశాన్ని ఐక్యంచేయడం, వ్యక్తివాదాన్ని, దోపిడీని నిర్మూలించడం తాను స్థాపించిన నేషనల్ యూనియన్ లక్ష్యమని శ్రీ నాజర్ అన్నారు. అయితే ఈ లక్ష్యసాధనకు వర్గ పోరాటం అవసరంలేదన్నారు.

మాస్కో రేడియో ప్రశ్న

(1 వ పేజీ తరువాయి)

ప్రారంభించ వలసిందిగా అమెరికాలో మీటనొక్కుతాను" అని అమెరికాలో చేస్తున్న వ్యాఖ్యానాలకు సమాధానమిస్తూ మాస్కోరేడియో ఇలా ప్రసారం చేసింది:

"అమెరికాకే కాదు, రష్యాకు కూడ ఇలాంటి మీట ఉంది.

"విదేశ విమానం దాడిచేస్తే తాము దానికి ఏమి ప్రతీకారచర్య తీసుకొంటామో అమెరికా సైనిక కార్యాలయం చెప్తున్నది. ఆదేవిధంగా అమెరికా విమానం మాపైకి వచ్చినప్పుడు మేము అదేవైఖరి అవలంబిస్తే ఏమి జరిగి వుండేది? సోవియట్ యూనియన్‌పై ఈ విధంగా అమెరికా విమానాలు ఎగరడం న్యాయమేనని అమెరికా విదేశాంగ కార్యాలయం ప్రకటిస్తున్నది. అలాంటి వైఖరివల్ల, ఏ నేరమైనా న్యాయసమ్మత మవుతుంది. ఒక వ్యక్తి తన ఇంటికి తాళం వేసుకొంటే, తాళం పగులగొట్టి తలుపు బ్రద్దలుచేసి, అతన్ని ఖూనీ చేయడం న్యాయమే నన్నమాట. అమెరికన్ అధ్యక్షునికిగాని, కాంగ్రెసుకుగాని, ప్రజలకుగాని తెలియకుండా అమెరికాలోని శక్తులుకొన్ని యుద్ధం ప్రారంభించవచ్చే పోమి ఏముంది? డల్లెస్‌తో ప్రచ్ఛన్న యుద్ధ విధానం అంతమయిందని కొందరు అనుకొని వుండవచ్చు. అలా జరగలేదని ఇప్పుడు స్పష్టమవుతున్నది. ప్రచ్ఛన్నయుద్ధం ఒక పవిత్ర కుటుంబ సాంప్రదాయంగా ఎంచేవారున్నారు. అమెరికా కేంద్ర గూఢచారి దళాధ్యక్షుడు అలన్ డల్లెస్ తన అన్నను తలదన్నడానికి ప్రయత్నించాడు."

రష్యాలో నేలకూలిన విమానోదంతంపై హెర్టర్ ప్రకటన

వాషింగ్టన్, మే 9

చాలా సంవత్సరాలుగా సోవియట్ దేశ సరిహద్దులమీద ఆకాశమార్గాన గూఢచారి పనులను అమెరికా సాగిస్తున్నదనీ, ఒక్కొక్కసారి సోవియట్ దేశం లోపలికి చొచ్చుకుపోవడం కూడ జరిగిందనీ అమెరికా విదేశాంగ కార్యదర్శి క్రిష్టియన్ హెర్టర్ నేడొక ప్రకటనలో తెలియజేశారు.

హఠాత్తుగా జరిగే దాడినుంచి రక్షించుకొనేందుకు వీలుగా, వీలయినంత ఎక్కువ సమాచారం సేకరించాలని అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఇచ్చిన ఆదేశం ప్రకారం నిరాయుధమైన పౌర విమానాలు అలా ఎగరడం జరుగుతున్నదన్నారు.

"ఇందులో ప్రత్యేకంగా ఏ విమానం ఎప్పుడు ఎగరాలి అనే దానికి అధ్యక్షుని ఆదేశం అవసరంలేదు" అని చెప్పారు.

సోవియట్ దేశంలో మే ఒకటవ తేదీన నేలకూలిన అమెరికా విమానం ఎగిరివెళ్ళడానికి సంబంధించిన కథనానికి యీ హెర్టర్ ప్రకటనవల్ల అదనంగావివరాలేమీ తెలియడంలేదు.

ఈ విమానోదంతంగురించి ఈరోజు అపరాహ్ణం అమెరికాకాంగ్రెసు నాయకులకుతెలిపిన కార్యదర్శి హెర్టర్ వివరణకూ ఈ ప్రకటనకూ వ్యత్యాసం ఏమీ లేదని విదేశాంగశాఖ ప్రకటించింది.

ఈ విధంగా తమ విమానాలు సోవియట్ భూమిపై ఎగురుతూండడం సోవియట్ నాయకులకు తెలియని విషయమేమీ కాదనీ, కాకపోతే యీసారి మాత్రం వారు యీ సంఘటనను ప్రచ్ఛన్నయుద్ధంలో తమ ప్రచారానికి ఉపయోగించుకోవడం జరుగుతున్నదనీ హెర్టర్ అన్నారు.

ఈ సంఘటనవల్ల రాబోయే శిఖరాగ్ర సమావేశానికి భంగమేమీ వాటిల్లదనీ, పైగా "హఠాత్తుగా జరిగే దాడులు, దురాక్రమణలకు వ్యతిరేకంగా అంగీకారయోగ్యమైన, సమర్థవంతమైన రక్షణలను గురించి ఒప్పందం కుదుర్చుకోడానికి హృదయపూర్వకమైన కృషిజరగాలని" మాత్రమే స్పష్టమవుతున్నదనీ అన్నారు.

ఇలాంటి సమర్థవంతమైన చర్యలను రూపొందించడంలో పారిస్ సమావేశంలో ప్రధాని క్రుశ్చేవ్ సహకరించగలడనీ, తద్వారా ప్రజలందరిమనస్సులలోను వ్యక్తమయ్యే మూకఉమ్మడి మరణాలను గురించిన భయాన్ని పోగొట్టడానికి ఆయన తోడ్పడగలడనీ ఆశిస్తున్నాననీ హెర్టర్ తన ప్రకటనలో తెలిపారు.

హెర్టర్ ప్రకటనపై టాస్ వ్యాఖ్య

మాస్కో, మే 10

అమెరికా విదేశాంగ మంత్రి హెర్టర్, గూఢచారి విమాన సంఘటనపై చేసిన ప్రకటన ఇతర దేశాల సరిహద్దులను ఉల్లంఘించటం న్యాయసమ్మతమైన చర్యగా చేయడానికి జంకూగొంకూ లేకుండా ప్రయత్నించడమేనని సోవియట్ వార్తాసంస్థ నేడు వ్యాఖ్యానించింది.

గతరాత్రి హెర్టర్ ఒక ప్రకటన చేశారు. సోవియట్ ప్రభుత్వం సహకరించనందువల్ల తాను ఆకస్మిక దాడుల నుండి దిట్టుకొనేందుకు తమకు తాము చర్యలు తీసుకోకపోతే తమ బాధ్యతలను విస్మరించినవారవుతామని హెర్టర్ ఆ ప్రకటనలో అన్నారు.

పారిస్ శిఖరాగ్ర సమావేశం జరుగనున్న సమయానికి సరిగ్గా ఇలాంటి రెచ్చగొట్టే చర్య జరిగిందనే విషయాన్ని హెర్టర్ దాచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని టాస్ విమర్శించింది.

నేలకూలిన అమెరికా గూఢచారి విమానంలో రెండు ఫిల్ముకంటెయినర్లు దొరికాయని సోవియట్ పత్రికలు ప్రకటించాయి.

సోవియట్ సైనిక పత్రిక "అరుణతార" అమెరికా గూఢచారి పవర్స్‌ను గురించి ఇలా వ్రాసింది:

"ఇతను నీతినిజాయితీలు లేనివాడు. డబ్బు కక్కుర్తికి ఏమైనా చేయగల నీచుడు. సైనిక దుస్తులు ధరించాడు కాని, డాలర్లే అతని దేవుడు. వాటికోసం తన తల్లిదండ్రులనైనా తాకట్టు పెట్టడానికి అతడు సిద్ధమే.

గూఢచారి విమానోదంతంపై "న్యూయార్క్ టైమ్స్" వాషింగ్టన్ విలేఖరి జేమ్స్ రెస్టన్ ఇలా వ్యాఖ్యానించారు.

"ఈ సంఘటన ఫలితంగా అమెరికా విదేశాంగ విధానంపై అధ్యక్షుడు ఐసెన్‌హోవరుకు తగినంత కంట్రోలు లేదేమోననీ, ఆయనకు సమయోచితమైన నిర్ణయం చేయలేడేమోననీ, అమెరికా మిత్రదేశాలు అనుమానపడుతాయి. ఈ సంఘటనపై దౌత్యవర్గాలు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఏమీ బాగులేవు."

జపాన్ ప్రధాని ప్రకటన

జపాన్ ప్రధాని నోబుసూకేకిషి టోకియోలో ఇలా అన్నారు:

జపాన్‌లో వున్న అమెరికా యు-2 విమానాలను ఉపసంహరించు కోవల్సిందిగా జపాన్ కోరదు. వీటిని కేవలం గస్తీచర్యలకే వినియోగిస్తామని అమెరికా చెప్పినది. మేము దాన్ని నమ్మక తప్పదు.

పారిస్‌లో మితవాద పత్రిక "ల్యూరోర్" ఇలా వ్యాఖ్యానించింది: ఇదంతా సోవియట్ గూడుపుఠాణీ. దీనిలో నమ్మశక్యం కాని విషయాలెన్నో వున్నాయి.

అమెరికాకు సోవియట్ నిరసన

మాస్కో, మే 11

మే 1 వ తేదీ సోవియట్ భూభాగంపైకి అమెరికా విమానం ఎగిరి వచ్చినందుకు సోవియట్ ప్రభుత్వం నేడు అమెరికాకు లాంఛనంగా నిరసన తెలియజేసింది. ఈ నిరసన పత్రం సోవియట్ విదేశాంగమంత్రి గ్రోమికో అమెరికా దౌత్యప్రతినిధికి అందజేశారు.

ఇందుకు సమాధానంగా, తమవారు ఫ్రాన్సిస్ పవర్స్‌ను చూడ నివ్వవలసిందిగా అమెరికా కోరింది. ఇతను తమ స్వాధీనంలో వున్నాడనీ, క్షేమంగా వున్నాడనీ క్రుశ్చేవ్ ప్రకటించిన విషయం పాఠకులకు విదితమే.

నేడుదయం 11గంటలకు అమెరికా దౌత్య ప్రతినిధి ఎడ్వర్డ్ ఫ్రియర్స్ సోవియట్ విదేశాంగకార్యాలయానికి వెళ్ళి విదేశాంగమంత్రి గ్రోమికోను చూచారు.

అమెరికా రాయబారి థాంప్సన్ 30 నిమిషాల క్రితమే పారిస్‌కు బయలుదేరి వెళ్ళారు.

ఫ్రియర్స్ గ్రోమికోలలో ఎవరూ పత్రాలనుచదవడంజరగలేదు. గ్రోమికో వైఖరి తప్పుపట్టడానికి వీలులేనిదిగాను, ఆహ్లాదకరంగాను వుందని ఫ్రియర్స్ అన్నారు.

ఫ్రియర్స్, ఇంకా ఇలాఅన్నారు:

"మామధ్య చర్చలుగాని, వ్యాఖ్యానాలుచేయడంగానిజరుగలేదుమా దౌత్య కార్యాలయాధికారి పవర్సనుచూడడానికిఅనుమతి ఇవ్వవలసిందిగా కోరుతూ ఒక పత్రం ఆయన కందించాను."

విమానచోదకు డెక్కడ వుండేది, విమాన సంఘటన వివరాలు మొదలగు సమాచారమందివ్వవలసిందిగా లోగడ అమెరికా అందజేసిన పత్రానికి సోవియటు పత్రంలో సమాధానమిచ్చారని కూడ తెలుస్తున్నది.

హైద్రాబాద్, మే 10

నేటి ఉదయం యిక్కడ ఉస్మాన్ షాహీలోని ఒక బస్ డిపో సమీపంలో పెద్ద అగ్నిప్రమాదం సంభవించి 46 పాకలు దగ్ధమైపోయాయి. (వి. వి.)

నగరంలో నేటి సినిమాలు

శేష్ మహల్ :	భాయిబహెన్
విజయ :	జగన్నాటకం
మారుతి :	చెంచులక్ష్మి
దుర్గా కళామందిరం :	శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం
శ్రీనివాస్ మహల్ :	పైగాం
జైహింద్ :	అపూర్వ చింతామణి
రాజకుమారి :	మహాకవి కాళిదాసు
సరస్వతీ :	దొంగలున్నారు జాగ్రత్త
అలంకార్ :	పెళ్ళికానుక
లీలా :	LET'S ROCK
వినోదా :	ధర్మమే జయం
ఈశ్వర్ :	కులదైవం
రామా :	శాంతినివాసం
లక్ష్మీ :	రాజనందిని

రేడియో

గురువారం, మే 12

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, ప్రసారవిశేషాలు, 6-35 వాద్యసంగీతం; 6-40 భక్తిరంజని; 7-0 తె.వా; 7-15 కె. మస్తాన్ సాహెబ్: నాదస్వరం; 7-45 సంగీత శిక్షణ; 8-0 ఆం. వా; 8-15 హిం.వా; మధ్యాహ్నం: 12-30 కార్మికులకు (హై. బి); 1-0 శ్రీరంగం గోపాలరత్నం; 1-50 తె.వా; సాయంత్రము: 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 గ్రాం. వా; 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 హైద్రాబాద్ వలె; 7-45 రాగం, తానం, పల్లవి (మ.బి); 8-30 రేడియో న్యూస్ రీల్ (ఢి బి); 8-40 లలిత సంగీతం: 9-0 ఆం. వా; 9-15 ఫిల్మ్ సంగీతం; 9-30 శ్రీరంగం గోపాలరత్నం; 10-0 కె. మస్తాన్ సాహెబ్: నాదస్వరం; 10-30 సమాప్తి.

హైద్రాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాత్, కార్యక్రమ వివరణ; 6-40 భక్తిరంజని: (వి. బి); 7-0 తె. వా; 7-15 విజయవాడ వలె; 7-45 సంగీత శిక్షణ; 8-0 ఆం. వా; 8-15 హిం. వా; 8-30 హిందూస్థానీ శాస్త్రీయ సంగీతం; మధ్యాహ్నము: 12-30 కార్మికులకు; 1-0 శ్రీ సంసార్ (ఉర్దూ); 1-30 ఘజల్, కవ్వాలి, నాత్; 1-50 తె.వా; 2-0 శాస్త్రీయ సంగీత్; 2-10 ఉ.వా; సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 గ్రాం. వా; 6-15 మరాఠీ శ్రోతలకు; 7-0 తె. వా; 7-15 సాజ్ ఓ సాజ్ - రూపక కార్యక్రమం (ఉర్దూ); 7-30 విజ్ఞాన శాస్త్ర పరిశోధన - కొన్ని ప్రయోగాలు, ఉపయోగాలు, పరిశ్రమలలో ప్రసంగం - డాక్టర్ కె. వి. రావు; 7-40 విరామ సంగీతం; 7-45 రాగం, తానం, పల్లవి (మ. బి); 8-30 రేడియో న్యూస్ రీల్ (ఢి. బి); 8-40 విరామసంగీతం; 8-45 డెవలప్ మెంటు ఆఫ్ ఇండియా రైల్వేస్ - ప్రసంగం; 9-0 ఆం వా, 9-15 ఉ. వా; 9-30 బృంద, ముక్తి, 10-0 రాధికామోహన్ మైత్ర సరోద్, 10-30 సమాప్తి.

హైద్రాబాద్-బి.

42.02 మీ (7140 కిలోసై)

ఉదయం 6-30 సుప్రభాత్, కార్యక్రమవివరణ,

30.86 మీ. (9720 కిలోసై)

మధ్యాహ్నం 12-30 కార్మికులకు; 1-0 కె ఆర్ ప్రేమ, కె. ఆర్. గోదామణి, 1-30 హై. ఎ. వలె.

60 12 మీ (4990 కిలోసై)

సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-15 గ్రామస్థులకు; 7-0 తె వా, 7-15 గ్రామస్థులకు; 7-30 హై ఎ వలె, 9-15 లలిత సంగీత్; 9-30 హై ఎ వలె 10-30 సమాప్తి.

బజారు ధరలు

విజయవాడ, మే 10

(మధ్యాహ్నం గం 1 వరకు)

బంగారం ధరలు

మేలిమి పాట్లు		135 0 0
మూసి		135 0 0
నగలకు		90 0 0
వెండి 100 తులాలు		230 0 0
తులము		2 5 0

ధాన్యం ధరలు

24 నెంబరు	రు 30/-	30 8 0
బంకసన్నాలు		27 8 0
13 నెంబరు		26 12 0
అక్కుళ్ళు		26 8 0
[illegible]		26 8 0

బియ్యం ధరలు

24 నెంబరు		70 0 0
బంకసన్నాలు		64 0 0
13 నెంబరు		62 0 0
అక్కుళ్ళు	59-0-0	60 0 0
[illegible]	59-0-0	60 0 0

అపరాల ధరలు

మినుములు 240 శేర్లు		46 8 0
కందులు	42/-	46 0 0
పల్లిపెసలు (మాగాణి)		47 0 0
పచ్చపెసలు 280		45 0 0
పచ్చపెసలు (మెట్ట)		43 0 0
సెనగలు (తెల్లవి)	40/-	43 0 0
సెనగలు (పంజాబు)		37 4 0
ధనియాలు 28 కుంచాలు		45 0 0
ఉలవలు	39-8-0	47 8 0
ఆముదాలు		48 0 0
పంచదార (వుయ్యూరు)		118 2 3
కొబ్బరినూనె డబ్బా		39 0 0
[illegible] మణుగు	6-8-0	7 4 0
బెల్లం ,,	5 0-0	8 0 0
మిర్చి ,,	23 8 0	30 0 0
నీరుల్లి	1 5 0	1 7 0
చింతపండు (క్వి)	8-0-0	13 0 0
నువ్వులనూనె ,,		24 0 0
వేరుశనగపప్పు 177 శేర్లు		
[illegible]		75 12 0
[illegible]		77 0 0
[illegible] మణుగు		20 6 0
[illegible] 160 [illegible]		25 8 0
కొబ్బరికాయలు 1000		
	కొత్తవి	190 0 0
ఉండలు 100		188 0 0
,,	[illegible] (మే)	119 0 0

ఉత్తర బీహార్‌లో కరువు పరిస్థితులు

శాసనసభలో ప్రతిపక్షం తీర్మానం

పాట్నా, మే 8

ఉత్తర బీహార్‌లోని కొన్ని జిల్లాలలో వున్న కరువు పరిస్థితులను గురించి చర్చించాలని ప్రతిపక్షంవారు రాష్ట్ర శాసనసభలో గత సోమవారం నాడు ఒక తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు.

ఆ జిల్లాలను కరువు ప్రాంతంగా పరిగణించి అందుకనుగుణ్యమైన చర్యలను తీసుకోవాలని ఆ తీర్మానంలో కోరారు.

ప్రతిపక్షంవారి డిమాండునురెవిన్యూ మంత్రి శ్రీ బి. ఎన్. ఝా. తిరస్కరించుతూనే దర్భాంగా, ముజఫర్‌పూర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు తిండిగింజల కొరతతో బాధపడుతున్నాయని వొప్పుకొన్నారు.

ప్రతిపక్షాల సభ్యులేగాక, ఆ ప్రాంతాలకు చెందిన కాంగ్రెసు సభ్యులుకూడా కరువుతో బాధపడుతున్న ప్రజలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఘాటుగావిమర్శించారు.

ఆకలిచావులను బయటకు పొక్కనియ్యకుండా చేస్తున్న స్థితికూడా వారు విమర్శించారు. ఆకలితో కొంతమంది చనిపోయారన్న వార్తను అధికారులకు తెలియజేసిన పాపానికి ఒక గ్రామసేవక్‌ను సస్పెండ్ చేసిన విషయాన్ని గురించి కూడా వారు సభలో ఉదహరించారు. చౌకడిపోల్లో బియ్యమే వుండటం లేదన్నారు.

తీర్మానాన్ని సభవారు నిరాకరించినప్పటికీ కడకు ప్రభుత్వం తగు చర్యలను తీసుకోగలదని వాగ్దానం చేయక తప్పలేదు. (ఐ. పి. ఏ.)

"బీహార్ మంత్రి వర్గాన్ని బర్తరఫ్ చేయాలి"

పి. ఎస్. పి. డిమాండు

పాట్నా, మే 8

బీహారుమంత్రివర్గాన్ని బర్తరఫ్ చేయాలనీ, శాసనసభను రద్దుచేసి రాష్ట్రపతి పాలనను ప్రవేశ పెట్టాలనీ అభ్యర్థిస్తూ బీహారు శాసనసభలోని పి. ఎస్. పి. సభ్యులు రాష్ట్రపతిని కోరారు.

ఈకోర్కెను వెల్లడించిన ప్రముఖులలో శ్రీ రామకాంతి ఝా, శివమహదేవ్ ప్రసాద్, సభాపతిసింగ్ వున్నారు.

బీహారురాష్ట్ర కాంగ్రెసు వ్యవహారాలను దర్యాప్తు చేయడానికి త్వరలోనే అ. భా. కాంగ్రెస్ సంఘం నియమించిన ట్రిబ్యునల్ ఇక్కడకు రాబోతూంది. అందుచేత ఇప్పుడా విధమైన డిమాండ్ రావడానికి రాజకీయ వర్గాలు అధిక ప్రాముఖ్యాన్నిస్తున్నాయి. ఈ కోర్కెతో తిరుగుబాటు కాంగ్రెసువారికి కూడ సంబంధం లేకపోలేదని చెబుతున్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు లేకుండాపోయాయనీ, పరిపాలన అంతా పార్టీ తత్వంతోనే జరుగుతోందని పి. ఎస్. పి. ఆరోపిస్తోంది.

భారతదేశంలో ఎక్కడాలేని విధంగా ఈ ఒక్క శాసనసభలోనే ప్రతి ఒక్కరికీ వ్యక్తి రక్షణ కలుగచేయడం తమ బాధ్యతకాదని ముఖ్యమంత్రి చెప్పడం సాహసమని, అందులోను ఇటీవల బీహారులో జరిగిన ఖూనీల దృష్ట్యా ఈ ధోరణి ప్రమాదాన్ని కలుగజేస్తుందనీ, పి. ఎస్. పి. నాయకులంటున్నారు. ఈ ఖూనీలు కాంగ్రెసు పార్టీలోపల ముఠాతగాదాలవల్ల జరిగినవేనంటున్నారు.

"కేరళలో దేన్ని [illegible] పరిగణించి త్యజించాలన్నారో దానినే ఇక్కడ ప్రోత్సహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి నిజాయితీ అంటూ వుంటే బీహారు పరిపాలనను రాష్ట్రపతి చేపట్టాలని సలహానివ్వాలి. ప్రస్తుత కాంగ్రెసు మంత్రివర్గం ఇంకా పరిపాలించడం రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజాతంత్ర శ్రేయస్సుకు ప్రమాదం" అని పి. ఎస్. పి. నాయకులంటున్నారు.

కేంద్రప్రభుత్వోద్యోగుల కోర్కెలపైసంప్రతింపులు

కలకత్తా, మే 6

కేంద్ర ప్రభుత్వోద్యోగుల కోర్కెలపై సంయుక్త కార్యాచరణ సమితితో వెంటనే సంప్రతింపులు ప్రారంభించాలని భారత ప్రధాన మంత్రిని కోరుతూ సౌత్ ఈస్టర్న్ రైల్వేమెన్స్ యూనియన్, కలకత్తా ప్రధాన కార్యదర్శి శ్రీ సత్యేన్‌కర్ ఒక ప్రకటన చేశారు.

ఆంధ్ర రాష్ట్ర చదరంగ పోటీలు

అనంతపురం, మే 6

ఆంధ్రరాష్ట్ర అయిదవ చదరంగం ఛాంపియన్‌షిప్ పోటీలను మొన్న సాయంకాలం శ్రీ ఆర్. కృష్ణశాస్త్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ పోటీలు స్విస్‌పద్ధతిపై తొమ్మిది రౌండ్లలో నిర్వహిస్తున్నారు. ఇరవైమంది పోటీలలో పాల్గొంటున్నారు. ఇంతవరకు జరిగిన పోటీల ఫలితాలు ఇలా ఉన్నాయి:

మొదటి రౌండులో ఎం. హరిపురుషోత్తమ్‌ను వి. జి. కృష్ణమూర్తి, టి. నారాయణను ఎస్. వేణుగోపాల్, ఎం. డి. సంపత్‌ను సి. రాధాకృష్ణమూర్తి, జి. కుటుంబరావును ఎస్. భాస్కరరావు; డి. ఎస్. రావును ఎస్. లక్ష్మీప్రసాద్; రావు (విజయవాడ)ను పి. ఎస్. నారాయణ; ఎస్. ప్రభాకరరెడ్డిని వి. విశ్వనాథశాస్త్రి; వై. సుబ్రహ్మణ్యంను ఎస్. ఎం. భాషా, ఎం. వి. శర్మను ఎస్. ఎం. మియా ఓడించారు.

రెండవరౌండులో కె. గోవిందశెట్టిని పి. ఎస్. నారాయణ; ఎస్. వేణుగోపాల్‌ను సి రాధాకృష్ణమూర్తి; టి. నారాయణను డి. ఎస్. రావు; వై. సుబ్రహ్మణ్యంను జి. కుటుంబరావు; రావును ఎస్. ప్రభాకరరెడ్డి, కె. సంతానరావును ఎం డి. సంపత్ ఓడించారు. ఎస్. లక్ష్మీప్రసాద్, వి. విశ్వనాథశాస్త్రిగార్ల పోటీ, వి.జి. కృష్ణమూర్తి, ఎస్. భాస్కరరావుగార్ల పోటీ డ్రా అయినాయి. ఎం. వి. శర్మ, ఎ. హరిపురుషోత్తమ్‌ల పోటీనీ; ఎస్. ఎం. భాషా, ఎస్.ఎం. మియాల పోటీని వాయిదా వేశారు.

మూడో రౌండులో సి. రాధాకృష్ణమూర్తిని పి. ఎస్. నారాయణ, ఎస్. ఎం. భాషాను ఎస్. లక్ష్మీప్రసాద్; వి. విశ్వనాథశాస్త్రిని వి.జి. కృష్ణమూర్తి, ఎస్. భాస్కరరావును ఎం. గోవిందశెట్టి, డి. ఎస్. రావును జి. కుటుంబరావు, ఎం. వి. శర్మను ఎస్. వర్మను ఎస్. వేణుగోపాల్, ఎం. డి. సంపత్‌ను ఎస్. ప్రభాకరరెడ్డి, ఎ. హరిపురుషోత్తమ్‌ను వై. సుబ్రహ్మణ్యం; టి. నారాయణరావు (విజయవాడ); ఎస్. ఎం. మియాను కె. సంతానరావు ఓడించారు.

నాలుగురౌండులో ఎస్. లక్ష్మీప్రసాద్‌ను పి. ఎస్. నారాయణ; కె. గోవిందశెట్టిని వి. జి. కృష్ణమూర్తి; ఎస్. ప్రభాకరరెడ్డిని జి. కుటుంబరావు; ఎస్. ఎం. భాషాను ఎస్. వేణుగోపాల్; సి. రాధాకృష్ణమూర్తిని వి. విశ్వనాథశాస్త్రి; ఎస్. ఎం. మియాను ఎస్. భాస్కరరావు; ఎం. డి. సంపత్‌ను రావు (విజయవాడ), ఎం. సుబ్రహ్మణ్యంను కె సంతానరావు; టి. నారాయణను ఎం. హరిపురుషోత్తమ్ ఓడించారు. డి. ఎస్. రావు శర్మగార్ల పోటీని వాయిదా వేశారు.

రెండో రౌండ్‌లో వాయిదాపడిన పోటీల ఫలితాలు: హరిపురుషోత్తమ్‌ను ఎం. వి. శర్మ; ఎస్. ఎం. మియాను ఎస్. ఎం. భాషా ఓడించారు.

నాలుగో రౌండుఆఖరుకు పి.ఎస్. నారాయణ కు నాలుగుపాయింట్లు ఎక్కువ వచ్చాయి.

విద్యాధరపురం యువజన సంఘ ఆటల పోటీలు

విజయవాడ, మే 4

విద్యాధరపురం యువజనసంఘమువారిచే మే 1, 2, 3 తేదీలలో బిరుదుగడ్డ సుబ్బారావు మెమోరియల్ చెడుగుడు ఆటలపోటీలు జరుపబడినవి. ఫైనల్స్‌కు విన్నర్సుగా జగదంబ టీము, రన్నర్సుగా లేబరు వెల్‌ఫేర్ సెంటర్ వచ్చినవి. ఆసందర్భములో నిన్నరాత్రి బహిరంగసభ జరుపబడినది.

పట్టణ కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ తిమ్మిన పోతిరాజుగారు అధ్యక్షత వహించారు. శ్రీ శీరపు అప్పారావుగారు మాట్లాడుతూ,యువజనసంఘాలు యువకుల అభివృద్ధికి ఎలా కృషిచేస్తున్నదీ వివరించారు.

శ్రీ పోతిరాజుగారు మే దినోత్సవాన్నిగురించి మాట్లాడారు సోవియట్ రష్యా, చైనా మొదలగు సోషలిస్టు దేశాలలో కార్మికులు, మధ్య తరగతి ప్రజలు ఏకమై, కార్మికుల రాజ్యము ఎలా ఏర్పాటు చేసుకొన్నదీ వివరించారు.

తరువాత ఆటలలో గెలుపొందిన వారికి పట్టణ యువజనసంఘాధ్యక్షులు శ్రీ శీరపు అప్పారావుగారు కప్పులు బహూకరించారు. తదనంతరము బాలకోటేశ్వర యువజన నాట్యమండలి వారిచే "ఎవరినీ నమ్మరు", విద్యాధరపురం యువజనసంఘ నాట్యమండలి వారిచే "పెత్తందారు" నాటికలు ప్రదర్శించ బడినవి. పట్టణ యువజనసంఘానికి విరాళముగా 5-0-0 యిచ్చారు.

విశాఖ జిల్లా ఎన్. జి. ఓ. సంఘ వార్షికోత్సవం

విశాఖపట్నం, మే 8

విశాఖజిల్లా యన్. జి. ఓ. అసోసియేషన్ వార్షికోత్సవాలు ఏప్రిల్ 23, 24 తేదీలలో స్థానిక యన్. జి. ఓ క్లబ్‌లో జరిగాయి. ఆహ్వానసంఘం తరఫున శ్రీ సంపంగిరామ్ స్వాగత వచనాలు పలికారు. ఆంధ్రప్రదేశ్ ఎన్. జి. వో. ల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ శ్రీరాములు గారధ్యక్షత వహించారు. తెలంగాణా ప్రభుత్వోపాధ్యాయ సంఘ మాజీ అధ్యక్షులు, తెలంగాణా ఉపాధ్యాయ నియోజక వర్గంనుండి యిప్పుడు శాసనమండలికి పోటీచేస్తున్న శ్రీ వి. పి. రాఘవాచారి గారు ప్రారంభోపన్యాసమిచ్చారు. సంఘ కార్యదర్శి 1958-59 కార్యకలాపాలను తమ నివేదికలో సమీక్షించారు. ఇందులో సామూహిక క్యాజువల్ శెలవు, ఉద్యమం, కోర్కెల దినం; పని నిలుపుదల దినం; రూ 6, 650/- సంఘ విరాళం గా పోగుచేయడం మొదలగునవి ముఖ్యాంశాలు.

శ్రీ వి. పి. రాఘవాచారిగారు తమ ప్రారంభోపన్యాసంలో యిలా అన్నారు: "పేకమిటీ కోసమూ; దాని సిఫార్సుల అమలుకోసమూ చేసిన ఆందోళనలో అన్నిరకాలవుద్యోగులూ ఏకమయ్యారు. ఇది చరిత్రాత్మకమైన విషయం. మిగతా రాష్ట్రాలలో యిక్కడిలా సంఘటితం కాలేదు. అఖిలభారత స్థాయిలో రాష్ట్రోద్యోగుల సమాఖ్య ఏర్పాటయ్యే అవకాశం వుంది. ప్రభుత్వపు దమననీతిని తట్టుకొని నిలబడిన యన్. జి. ఓ. సంఘం అభినందనీయం.

అధ్యక్షులు శ్రీ శ్రీరాములుగారు మాట్లాడుతూ, సంఘగుర్తింపును రద్దుపరుస్తూ, గుర్తించని సంఘంలో సభ్యత్వం గురించి ప్రభుత్వం యిచ్చిన వుత్తర్వును ప్రస్తావించి, రాజ్యాంగం హామీ యిచ్చిన స్వాతంత్ర్యాలు విచక్షణాధికారాల దాక్షిణ్యాలకులోబడేలా చేయరాదన్న జస్టిస్ రాజమన్నార్ తీర్పును ఉటంకించారు.

"ప్రభుత్వోద్యోగులు ప్రజాసేవకులుగా మనడానికి ముందు పౌరులము, తర్వాత ప్రభుత్వోద్యోగులము అని భావించడానికి ప్రభుత్వం తోడ్పడాలి. క్రమశిక్షణయెడల, చిన్న వుద్యోగుల యెడ వైఖరి లోపభూయిష్టంగా వుండడంవల్లనే పరిపాలన అసమర్థంగా వుంది. మన రాజ్యాంగం యే బ్రిటన్ పద్ధతిలో రూపొందించారో అక్కడ నూటికి 60-65 మంది ప్రభుత్వోద్యోగులకు రాజకీయ స్వాతంత్ర్యం వుంటే, మనకిక్కడ ఒక విధమైన బానిసత్వం అమలులో వుంది. ఇంగ్లండులో అన్ని అంతస్తుల్లో విట్లీ కౌన్సిల్స్ వున్నాయి. ఉద్యోగుల అవసరాలని చూడడానికి ద్విపక్ష సమితులు అన్నిస్థాయిలలోనూ వున్నవి. అలాగే ఒక శాశ్వతమైన వేతన పరిశోధకసంస్థ వుంది. లంచగొండితనం నిర్మూలించడం ఐచ్ఛికంగా సంస్కరించుకోడం ద్వారానే సాధ్యమౌతుంది. త్వరలోనే నిఘా కమిటీలను నెలకొల్పే యోచన వున్నది. కాని దీనికి ప్రభుత్వం సహకరించా"లని విజ్ఞప్తి చేశారు.

పట్టణ ఎన్. జి. వోల సంఘానికి యీ దిగువవారు యెన్నుకోబడ్డారు;

అధ్యక్షులు: శ్రీ మన్మథరావు, ఉపాధ్యక్షులు: శ్రీ ఎన్. వి. రమణమూర్తి, శ్రీ సంపంగిరామ్, కార్యదర్శి: శ్రీ ఎ. సత్యనారాయణ, కోశాధికారి: శ్రీ నాగరాజు.

జిల్లా కార్యకర్తల ఎన్నికలు ఇంకా జరగలేదు.

బరంపురం మహిళా సమాజ వార్షికోత్సవం

బరంపురం, మే 8

బరంపురం ఆంధ్ర మహిళాసమాజ వార్షికోత్సవము మూడురోజులు చాల ఆకర్షణీయంగా జరిగింది. మూడు రోజులూ నృత్య ప్రదర్శనలు జరిగాయి. 'మన స్వత్వాలు' అనే నాటిక, అభ్యుదయ నాట్యమండలి వారు 'లవకుశ' అనే నాటకాన్ని మహిళా సంఘ సభ్యులు చాలచక్కగా ప్రదర్శించారు.

మూడు రోజుల కార్యక్రమాలకు వేలాది స్త్రీలు విచ్చేశారు. శ్రీమతి గాదె లక్ష్మీనరసమ్మగారు వందన సమర్పణ గావించారు.

హైద్రాబాద్ గుమాస్తాల సంఘసభ

హైద్రాబాద్, మే 7

హైద్రాబాద్ గుమాస్తాల సంఘ సర్వసభ్య సమావేశం ఈనెల 4 వ తేదీ శ్రీ బి. మహేంద్రశాస్త్రిగారి అధ్యక్షతను జరిగింది.

కనీస వేతనాల చట్టంలోని నిబంధనలను చట్ట నిర్వచనంలోనికి వచ్చే అన్ని దుకాణాలకు, సంస్థలకు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

ప్రభుత్వ కార్మిక సలహా సంఘంలో హైద్రాబాద్ గుమాస్తాల సంఘానికి తగినంత ప్రాతినిధ్యం యివ్వాలని మరొక తీర్మానం చేశారు.

పాఠశాలల వార్షికోత్సవాలు

మంగాపురం, మే 3

మంగాపురము ప్రభుత్వ బోధనాభ్యాసన పాఠశాల వార్షికోత్సవము ఏప్రిల్ 30 న జరిగింది. శ్రీ ఆర్. నాదమునిరెడ్డి, ఎం. ఎల్. ఏ. గారు సభకు అధ్యక్షత వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ స్వర్ణ ఆరోగ్యరామయ్య నివేదికను సమర్పించారు.

తర్వాత అధ్యక్షునిచే ఆటలలో, వక్తృత్వ, రచనా పోటీలలో, నాటక పోటీలలో గెల్పొందినవారికి బహుమతులు పంచబడినవి. ఉపాధ్యాయులచేతను, విద్యార్థుల చేతను "రామదాసు" నాటకము, మానోయాక్టింగు, విచిత్రవేషములు ప్రదర్శించబడినవి.

దోనేపూడి

దోనేపూడి సర్ రాధాకృష్ణ జిల్లా పరిషత్ హైస్కూలు వార్షికోత్సవము ఏప్రిల్ 30 న శ్రీ కేదారి నాగేశ్వర రావుగారి అధ్యక్షతను జరిగినది.

ఉదయం శ్రీ నిమ్మగడ్డ పిచ్చయ్య వర్మగారు స్కూలు ఆవరణలో జాతీయ పతాకమును ఎగుర వేశారు. తర్వాత శ్రీ వెల్లటూరి పూర్ణానందశర్మగారి వర్ణచిత్రముల ప్రదర్శనాన్ని ప్రఖ్యాత ఆంధ్రకళా విమర్శకులు శ్రీ సూర్యదేవర సంజీవదేవ్ గారు ప్రారంభోత్సవం జరిపి, వారి చిత్రాలలో ఉత్తమ భారతీయ చిత్రకళా లక్షణము లున్నవని ప్రశంసించారు.

సారస్వతసమితి తరఫున ప్రధానోపాధ్యాయులు వార్షికనివేదికను శ్రీ నడింపల్లి రామకృష్ణారావుగారు సమర్పించారు. డాక్టరు పి. రాజ్యలక్ష్మిగారు విద్యార్థులకు బహుమతులను పంచిపెట్టారు. పంచాయతీబోర్డు ప్రెసిడెంటు శ్రీ నారాయణగారు ఆహ్వానితులకు, అతిథులకు విందు చేశారు. విందు తర్వాత స్కూలు బాలబాలికలచే వినోద కార్యక్రమములు, పోతవర్లంక విద్యార్థులచే "బాలనాగమ్మ" నాటకము ప్రదర్శింపబడినవి.

వెల్లటూరు

వెల్లటూరు హైస్కూలు వార్షికోత్సవం ఏప్రిల్ 30 న శ్రీ గజపతి రావుగారి అధ్యక్షతను జరిగింది.

డాక్టర్ ఎ. వి. సాగరు, హెడ్మాస్టరు ప్రభల వెంకటేశ్వర్లు, తెలుగు పండితులు ఎ. వీరారెడ్డి, యస్. వి. బసవయ్యగార్లు ఉపన్యసించారు.

ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ, బహుమతిప్రదానం జరిగాయి.

విజయనగరం

విజయనగరం కంటోన్మెంటు మున్సిపల్ మిడిల్ స్కూలు వార్షికోత్సవము ఏప్రిల్ 30 న జరిగింది. సభకు పురపాలకసంఘం అధ్యక్షులు శ్రీ అప్పన్నదొర, యం.యల్.సి గారు అధ్యక్షత వహించారు. పాఠశాల నివేదికను ప్రధానోపాధ్యాయులు శ్రీ డి. రామారావుగారు సమర్పించారు. స్కూలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ తగిన భవనసదుపాయములేకనీ, పురపాలకసంఘం అధ్యక్షులు దానిని గురించి తగు చర్యలు తీసుకొని అభివృద్ధి చేయుటకు కృషిచేయాలని కోరారు.

అధ్యక్షులు సమాధానం చెపుతూ, భవన నిర్మాణము విషయంలో తగు ప్రయత్నం చేస్తానని హామీయిచ్చారు.

అనంతరం వినోద కార్యక్రమములు జరిగినవి.

ఆలమూరు

"అతిసుందరమయిన రామాయణ కావ్యం ఉండగా భారతాన్నే అనువదించమని రాజరాజు అభ్యర్థించడం నన్నయ పూనుకోవడం మనఅదృష్టం. పంచమవేదాన్ని భారత సహితంగా అందజేసిన కవిత్రయం మన జాతికి పూజార్హులయ్యారు. భారతపఠనం అందరికీ ఆవశ్యకమయినది" అంటూ శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు ఆలమూరు పోర్టింజే పరిషదున్నత పాఠశాల పూర్వవిద్యార్థి సంఘ వార్షికోత్సవ సభలో ఉపన్యసించారు. కార్యదర్శి శ్రీ మహేంద్రవాడ బ్రహ్మయ్యగారు నివేదిక సమర్పించారు. నూతన కార్యవర్గానికి శ్రీ ద్విభాష్యం వెంకట సూర్యనారాయణమూర్తిగారు అధ్యక్షులుగను, కార్యదర్శిగా శ్రీ డి. బుచ్చెయ్యపంతులుగారు ఎన్నుకోబడ్డారు.

సాయంకాలము శ్రీ జటప్రోలు బ్రహ్మానందం ఎం. ఏ. (పూర్వవిద్యార్థి) అధ్యక్షతను జరిగిన సభలో శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి మహాభారతం గురించి, శ్రీ పెద్దింటి రామమూర్తిశాస్త్రిగారు శాకుంతలం గురించి ఉపన్యసించారు.

సభానంతరం వేదుల రామారావు, సి. యస్. నారాయణ, బి. నాగేశ్వర రావుగారలు వినోద కార్యక్రమాలు నడిపించారు. పూర్వవిద్యార్థి శ్రీ పెద్దింటి నారాయణమూర్తి భరత నాట్య ప్రదర్శన మిచ్చారు. పోటీలలో పాల్గొనిన వారికి బహుమతి ప్రదానం జరిగింది.

వెంకటగిరి

నెల్లూరు జిల్లా వెంకటగిరి టవున్ ఆర్. వి. ఆర్. కె. వై. జిల్లాపరిషత్ బాలకోన్నత పాఠశాలా 10 వ వార్షికోత్సవం మే 6 న తహశీల్దారు శ్రీ వీరభద్రయ్యగారి అధ్యక్షతను జరిగింది.

చిన్న చెరుకూరు హైస్కూల్ హిందీ మాస్టరు శ్రీ ఎ. మల్లికార్జునం గారు ప్రారంభోత్సవం చేశారు.

కార్యదర్శి శ్రీ కె. ఎల్. నారాయణరావుగారు తమ నివేదికను చదివారు. అనంతరం నాటికలు, నృత్య ప్రదర్శనలు జరిగాయి. బహుమతులు పంచిపెట్టబడినవి.

హరిశ్చంద్రపురం

కృష్ణాజిల్లా ముసునూరు బ్లాకులోని హరిశ్చంద్రపురం గ్రామంలో ఈనెల 1 వ తేదీన ప్రాథమిక పాఠశాల భవనానికి ముసునూరుసమితి అధ్యక్షుడు దాసరి వెంకటసుబ్బయ్యగారు ప్రారంభోత్సవం జరిపారు.

బ్లాక్ డెవలప్ మెంటు ఆఫీసరు శ్రీ జి. సూర్యారావు జాతీయపతాకమును ఎగురవేశారు. అనంతరం బహిరంగ సభ జరిగింది.

శ్రీ దాసరి వెంకటసుబ్బయ్యగారు ఉపన్యసిస్తూ,ప్రాథమిక విద్యావ్యాప్తికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో పూర్తిగా సహకరించాలన్నారు.

పాఠశాల భవన నిర్మాణములో నిర్విరామకృషి జరిపిన శ్రీ పి. వెంకటకృష్ణయ్య, సాంబమూర్తిగారలకు అభినందనాలు తెలిపారు.

ఆంధ్ర చేనేత సొసైటీ సిబ్బంది యిబ్బందులు

ట్రిబ్యునల్‌కు నివేదించాలని చిత్తూరుబ్రాంచి తీర్మానం

చిత్తూరు, మే 8

ఆంధ్ర చేనేత సహకార సంఘ సిబ్బంది యూనియన్ చిత్తూరుబ్రాంచి సర్వసభ్య సమావేశం కైలాసనాథ కోనలో ఈ నెల 1 న జరిగింది. సమావేశానికి యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ రత్నాకరరావు, ప్రధాన కార్యదర్శి శ్రీ కె. ఎల్. ఎస్. శర్మ, కార్యదర్శులు శ్రీ ఆర్. టి. వాసన్, మస్తానయ్య జిల్లాలోని ప్రముఖ చేనేత నాయకులు హాజరయ్యారు. సమావేశానికి శ్రీ పి. కృష్ణయ్యగారు అధ్యక్షత వహించారు.

ఉద్యోగుల సాధక బాధకాలు, సాధించిన విజయాలు,ఇకముందుకూడా కలిసికట్టుగా ఉండవలసిన అవసరాన్ని గురించి శ్రీయుతులు చక్రవర్తి శర్మ, వాసన్,రత్నాకరరావు, మస్తానయ్య, మొదలియార్ ప్రభృతులు మాట్లాడారు.

యూనియన్‌కు వెయ్యిరూపాయల వరకూ సభ్యులనుండి నిధి వసూలు చేయుటకు నిశ్చయించారు. ఆ తర్వాత యూనియన్ కార్యకర్తలకు నూతన వస్త్ర బహూకరణ జరిగింది. సమావేశంలో యీ దిగువ తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

జీతాలచట్టం (బోనసు సేల్సు, కమీషను) ట్రిబ్యునల్ తీర్పును నివేదించినందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందిస్తూ, ఇంతవరకూ పరిష్కరింపబడని ఇతర విషయాలను కూడా ట్రిబ్యునల్ తీర్పుకు నివేదించాలి.

గత అయిదు సంవత్సరాలనుండి కడప రీజనల్లో చాలమంది ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న మేనేజిమెంటు ధోరణిని యీ సభవారు తీవ్రంగా నిరసిస్తున్నారు. వెంటనే యింక్రిమెంట్లు మంజూరుచేసి బకాయీలతో సహా చెల్లించవలసిందిగా కడప ఆర్. ఎం. ఓ ను, బిజినెస్ మానేజరును కోరుతున్నాము.

ప్రమోషన్ల విషయంలో అనేక సంవత్సరాలనుండి పనిచేస్తున్న సీనియరు ఉద్యోగులను నిర్లక్ష్యంచేసి, జూనియర్లకు ప్రమోషన్లు ఇవ్వటాన్ని తీవ్రంగా నిరసిస్తున్నాము. పైనా ఈ అక్రమాలను ఆపుచేయించి కోరుతున్నాము.

కందికొండ కాంగ్రెసు వారి దౌర్జన్యాలు

మానుకోట, మే 8

వరంగల్ జిల్లా మానుకోట తాలూకా కందికొండగ్రామకాంగ్రెసు వారి దౌర్జన్య చర్యలు రోజుకురోజు మితిమీరి పోవుచున్నవి. పంచాయతీ ఎన్నికల తర్వాత బండి పాపయ్య మరియు అతని అనుచరులు గ్రామంలో అశాంతి పరిస్థితులు కల్పిస్తున్నారు. "ప్రభుత్వం మా చేతిలోవుంది, యీ పంచాయతీబోర్డును కమ్యూనిస్టుల చేతిలో వుండనిస్తామా?" అని ప్రచారం చేస్తున్నారు. పంచాయతీ సభ్యులను లొంగదీయ ప్రయత్నించి విఫలులైతేకేసులు బనాయించ పూనుకున్నారు. బండి పాపయ్య తన అనుచరులతో, పంచాయతీ మెంబర్లను, కమ్యూనిస్టు కార్యకర్తలను కొడ్తామని కర్రలతో తిరిగారు.

ప్రక్కగ్రామం నూదిరేపల్లిలో కల్లు అమ్ముకునే గౌండ్లను,కల్లుకుండలు యెండలోపెట్టి అమ్ముకోండని బాధలు పెడ్తున్నారు.

బండి పాపయ్య గ్రామంలో రెండు సంవత్సరాలనుండి కమ్యూనిస్టుపార్టీపై, ప్రజలపై జరిపే చిత్రహింసల గురించి స్థానిక పోలీసులకు మరియు పై అధికారులకు మొరపెట్టుకొన్నప్పటికీ యింతవరకూ యేలాంటి చర్యలూ తీసుకోలేదు.

దామరపాకంలో ఆస్పత్రి ఆవశ్యకత

దామరపాకం, మే 3

పుత్తూరు తాలూకా నగరిపంచాయతీ సమితికిచెందిన దామరపాకం తాలూకాలోని పెద్దగ్రామాల్లో ఒకటిగా, అనేక గ్రామాలకు కేంద్రముగా, సుమారు 5000 వేల జనసంఖ్య కలిగివుంది. దీనికి అతి సమీపమున యాత్రాస్థలమైన బుగ్గ దేవాలయమున్నది. ఈ ప్రాంత సమీపంలో వైద్యసదుపాయం దొరుకుట దుర్లభం. ముఖ్యంగా బీద ప్రజానీకంకు వైద్యసహాయం లేకున్నది.

ప్రాంతీయ విజ్ఞప్తుల ఫలితంగా నగరి సమితివారిచే, యిటీవల తీర్మానింపబడి చిత్తూరు జిల్లా పరిషత్తువారి ఆమోదమునకై పంపబడిన "దామరపాకం ఆస్పత్రి నిర్మాణస్కీము"ను వెంటనే మంజూరుచేసి, స్థానిక ప్రముఖులు శ్రీ జి. చంద్రశేఖరరెడ్డిగారు ఉచితముగా యిచ్చుటకు సమ్మతించిన భవనములో ఆస్పత్రిని ప్రారంభించవలయునని యిచ్చటి ప్రజలు కోరుచున్నారు

(వి. వి.)

లేఖలు

ద్రాక్షారామ మున్సిపల్ కమిషనర్ పక్షపాతం

ఆర్యా,

రామచంద్రపురంతాలూకా ద్రాక్షారామ పట్టణాన్ని ప్రభుత్వం మున్సిపాల్టీగా ఏర్పర్చి దరిదాపు 3 సంవత్సరాలైంది. ఎన్నికలు జరిగి కౌన్సిల్ ఏర్పడి 1½ సంవత్సరాలు దాటింది. ఈ మున్సిపాల్టీలో 12, 13 వార్డులలో ప్రజలు కమ్యూనిస్టులను కౌన్సిలర్లుగా ఎన్నుకొన్నారు. 1½ సం॥రాల క్రితం ఈ రెండు వార్డులలోను ఎలక్ట్రిక్ లైట్లు వేయాలని కౌన్సిల్ తీర్మానం చేసింది. ఆ తీర్మానమును కమిషనరు యింతవరకు అమలుపర్చలేదు. ఈమధ్యనే 6 మాసముల క్రితం ఆ మున్సిపాల్టీలోనున్న నెలపర్తిపాడు గ్రామమునకు ఎలక్ట్రిసిటీ వేయించుటలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కౌన్సిల్ సమావేశంలో 1½ సంవత్సరాల క్రితం తీర్మానం చేసినా యింతవరకు 12, 13 వార్డులలో లైట్లు వేయించలేదేమనీ, ఈమధ్యనే తీర్మానం చేసిన వార్డులో వేయించారేమని అడుగగా "వారు 2, 3, వేలు ఖర్చుపెట్టుకుని వేయించుకున్నారు. మీరుకూడా అలా చేసుకోవాలి. మాకు యీ పనులన్నీ వేయుటకు తీరుబడిలే"దని కమిషనరు జవాబు చెప్పారు. అలాగే 12 వ వార్డులో 100 సం॥రాల పైనుండి ఏదారీలేని రత్నాలగరువుకు రోడ్డు వేయుటకు ప్లానువేసి కౌన్సిల్ ముందు పెట్టి ఆభూమి సేకరించవలసినదిగా కలెక్టరును కోరుతూ తీర్మానం జరిగింది. ఇంతవరకు ఆ తీర్మానం కలెక్టరుకు పంపలేదు. అలాగే యీ వార్డులలో కౌన్సిల్ చేత శాంక్షన్ చేయబడిన రోడ్లు, యితర పనులు ఏవీకూడా జరగకుండా చేస్తున్నారు. కౌన్సిల్ తీర్మానములను గౌరవించి ఆ ప్రకారం పనులు చేయించవలసిన కమిషనర్ పక్షపాతంగాను బాధ్యతా రహితంగాను ప్రవర్తించుచున్నారు.

ముఖ్యంగా యీ రెండువార్డులు పేదప్రజలునివసించేవార్డులు. కమిషనరు ఏ పనీకూడాయింతవరకుయీవార్డులలో -కౌన్సిల్ తీర్మానాలు చేసినవికూడా- చేయకపోవడమేగాక యికముందు కూడా ఆ పనులు చేసే తీరులో మాట్లాడుటలేదు. పై విషయాలన్నిటినీ ప్రభుత్వము వెంటనే విచారణచేసి కౌన్సిల్ అంగీకరించిన పనులు ఎందుకు చేయించుటకు పూనుకోలేదో పరిశీలించి యీ వార్డులలో పై పనులు జరిగేటట్లు చూడవలసినదిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇట్లు,
వాసంశెట్టి వెంకటరత్నం,
మున్సిపల్ కౌన్సిలర్, ద్రాక్షారామ.

పిఠాపురం వద్ద మెయిల్ బస్సు ఆపాలి

ఆర్యా,

పిఠాపురంవద్ద ఏప్రిల్ 1 వ తేదీ నుండి మద్రాసు-హౌరా మెయిల్ బండ్లను ఆపడంలేదు. అందువల్ల ఈ తాలూకా ప్రజలు చాలా ఇబ్బందిపడుతున్నారు. పార్సిల్ ప్యాసెంజర్ ద్వారా తపాలాను సామర్లకోటకు పంపవలసివస్తున్నది. అందువల్ల తపాలాను పంపడంలోను, పుచ్చుకోవడంలోను చాలా ఆలస్యం జరుగుతున్నది. ఈ వాస్తవాలను గుర్తించి వెంటనే పిఠాపురంవద్ద మెయిల్ బండ్లనుఆపాలని కోరుతున్నాను.

ఇట్లు
పేకేటి తమ్మిరాజు,
ఎం. ఎల్. ఏ, పిఠాపురం.

ప్రభుత్వ పక్షపాతం

ఆర్యా,

విద్యుచ్ఛక్తి, పి. డబ్ల్యు. శాఖలలో లైసెన్సియేట్లను సూపర్‌వైజర్లుగా నియమించేటప్పుడు, వారిని కంప్రెస్డు డిప్లమా హోల్డర్లతో సమానంగా పరిగణించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఒక జి. ఓ. జారీచేసింది. ఈ విధమైన నిర్ణయం చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞత తెలుపుతున్నాను.

ఈ సందర్భంలో కొన్ని విషయాలను ప్రభుత్వదృష్టికి, "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్" దృష్టికి తేదలచాను. రివైజ్డు స్కేళ్ళు రాకపూర్వం లైసెన్సియేట్లు, కంప్రెస్డు డిప్లమా హోల్డర్లు వరుసగా రు 100, రు. 120 ల జీతంపై విద్యుచ్ఛక్తి శాఖలో సూపర్‌వైజర్లుగా నియమింపబడ్డారు. రివైజ్డు స్కేళ్ళు వచ్చిన తర్వాత కంప్రెస్డు డిప్లమా హోల్డర్లకు రు. 140 యిస్తున్నారు. అయితే లైసెన్సియేట్లకు ఇప్పటికీ రు. 100 ఇస్తున్నారు. ఎందుకంటే వారి జీతాల స్కేళ్ళు ఇంకా నిర్ణయం కాలేదు.

సూపర్‌వైజర్లుగా నియమింపబడిన కంప్రెస్డు డిప్లమా హోల్డర్లు, లైసెన్సియేట్లు ఒకేవిధమైన పనిచేస్తూవుండటం చేత, జి. ఓ. ప్రకారం ఒకే విధమైన జీతాలస్కేళ్ళు అమలు జరపడం న్యాయంకాదా? ప్రభుత్వం ఇప్పటికైనా ఒకే విధమైన జీతాలస్కేళ్లునిర్ణయించి తన నిష్పాక్షికత్వాన్ని ఋజువు పరచుకోవాలని కోరుతున్నాను.

ఎ.ఎం.ఐ.ఇ. పరీక్షలో 'ఎ' భాగం కంప్రెస్డు డిప్లమా హోల్డర్లు ప్యాసు కానక్కరలేదని "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్" చెప్పినట్లు తెలిసింది. ఇది నిజంగా శుభవార్త. ఇలాంటి సౌకర్యాన్నే లైసెన్సియేట్లకు కలిగించాలని కోరుతున్నాను.

ఒక లైసెన్సియేట్ హోల్డర్,
హైద్రాబాద్.

విద్యుచ్ఛక్తిశాఖ సెక్షన్ ఆఫీసర్లకు రివైజ్డుస్కేళ్ళు

ఆర్యా,

1959 మేనెలలో జి. ఓ. జారీచేసినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి శాఖలో పనిచేసేసెక్షన్ ఆఫీసర్ల జీతాల స్కేళ్ళు ఇప్పటికీ నిర్ణయించకపోవడం చాలా శోచనీయం. సెక్షన్ ఆఫీసర్లు తప్ప, తక్కిన కేటగిరీల వారందరూ రివైజ్డుస్కేళ్లు పొందుతున్నారు.

ఈవిషయం పై అధికారుల దృష్టికి కూడ తీసుకురాబడింది. సంవత్సరమున్నర దాటిపోయినా సెక్షన్ ఆఫీసర్లకు రివైజ్డు స్కేళ్లు వర్తింపచేయలేదు. అందువల్ల మామూలుగా ఇచ్చే ఇంక్రిమెంట్లను, ప్రభుత్వం మంజూరుచేసిన "లాయల్ ఇంక్రిమెంటు"ను సెక్షన్ ఆఫీసర్లు నోచుకోలేదు.

ఈ సమస్య పెండింగ్‌లో వున్నచోట్ల ప్రభుత్వంగాని, చీఫ్ ఇంజనీరుగాని తక్షణ చర్యలు తీసుకోవాలని, సెక్షన్ ఆఫీసర్లకు రివైజ్డు స్కేళ్ళు అమలుపరచాలని కోరుతున్నాను.

ఒక సెక్షన్ ఆఫీసర్,
హైద్రాబాద్

లేఖాంశం

కృష్ణాకెనాల్ స్టేషన్‌వద్ద మధ్యాహ్నంపూట ప్రయాణికులకు మంచినీరు అందించడానికై ఒకరిని నియమించవలసిన అవసరం ఎంతైనా కలదని తాడేపల్లి పంచాయతీ సభ్యుడు శ్రీ ఎల్. కనకయ్యగారు వ్రాస్తున్నారు.

విజ్ఞప్తి

(1) పత్రిక సకాలములో చేరుట లేదనిగాని, అడ్రసు సవ్యముగా లేదనిగాని, ఉత్తరం వ్రాయునప్పుడు మీకు వచ్చు పత్రికపై వుండు చందా నెంబరు వేసి వ్రాయగోర్తాం. లేదా మీరు ఎన్ని మాసాలకు ఎంత సొమ్ము ఎప్పుడు చెల్లించినదీ తెలియజేయగోర్తాం.

(2) మీరు చెల్లించిన సొమ్ముకు మీకు పత్రిక ఎంతవరకు పంపబడునో, ఆ తేదీ మీకువచ్చు పత్రిక అడ్రసుతో పాటు వేయబడి యుంటుంది. ఆ తేదీని గమనించి తిరిగి సొమ్ము చెల్లించగోర్తాం.

(3) తిరిగి చందా సొమ్ము చెల్లించేటప్పుడు, మీ పాత నెంబరు వేస్తూ అడ్రసు వివరంగా వ్రాయగోర్తాం.

చందా వివరాలు:

1 సంవత్సర చందా రు.	26.00
6 మాసాలకు	13.00
3	6.75
2	4.60
1 మాసానికి	2.30

—మేనేజరు, "విశాలాంధ్ర"

50 వేల ప్రజలకు సందేశాన్నిచ్చిన

కడపజిల్లా కమ్యూనిస్టుపార్టీ ప్రచారయాత్రా విశేషాలు

[విశాలాంధ్ర విలేకరి]

అంకాళమ్మగూడూరు, మే 7

కడపజిల్లా కమ్యూనిస్టు సమితి ఆధ్వర్యాన జిల్లాలో 6 కేంద్రాల్లో గొప్ప బహిరంగసభలు జరిగాయి. 6 వేల నుంచి 15 వేల వరకూ ఎంతో ఉత్సాహంతో ప్రజానీకం పాల్గొన్న ఈ సభల్లో జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీయుతులు వై. ఈశ్వరరెడ్డి, గజ్జల మల్లారెడ్డిగార్లు, ఆయా తాలూకాల పార్టీ నాయకులు నేటి రాజకీయ పరిస్థితులపైన, కమ్యూనిస్టుపార్టీ విధాన కార్యక్రమాలపైన, వివిధ ప్రజా సమస్యలపైన ఉపన్యసించారు. ఉపన్యాసాల అనంతరం ప్రఖ్యాతిగాంచిన పాలకొల్లు బాలికలదళంవారు "పుల్లెడి బొమ్మ-పూర్ణమ్మ", "బొబ్బిలియుద్ధం" బుర్రకథలను చెప్పారు.

ఏప్రిల్ 25 నుంచి మే 2 వ తేదీ వరకు జరిగిన ఈ సభలకు వాతావరణం ప్రోత్సాహకరంగా లేదు. కన్ను పొడుచుకున్నా కనిపించని కటిక చీకట్లలముకున్న అమావాస్య రాత్రులు జనం రావడానికి ఎంతో ప్రతిబంధకమైనాయి. అయినప్పటికీ దగ్గర్లోలేని గ్రామాలనుంచి స్త్రీలు - పురుషులు పెట్రోమాక్సులైట్లతో నడిచి, బండ్లపైన 10 మైళ్ళ దూరం నుంచి కూడ ప్రవాహంలా కదిలివచ్చారు. పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులయిన యువకులు కాలినడకన, సైకిళ్ళపైన దళాలుగా కదిలారు. నిప్పులు చెరిగే వైశాఖమాసపు మండుటెండల్లో, వేడిగాడ్పుల్లో ఎంతో పట్టుదలతో నూటికి పైగా గ్రామాల్లో ప్రచారం సాగించారు. కొన్నివందల గ్రామాల్లో కరపత్రాలు పంచబడ్డాయి.

ఈ యాత్రలో మొదటి సభ ఏప్రిల్ 25 న జమ్ములమడుగులో జరిగింది. తాలూకా కమ్యూనిస్టు నాయకుడు, జమ్ములమడుగు పంచాయతీ సమితి ఉపాధ్యక్షులు శ్రీ శంకరరెడ్డి గారు అధ్యక్షత వహించారు. 6000 మంది ప్రజలు హాజరైనారు. జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ వై. ఈశ్వరరెడ్డి, శ్రీ గజ్జల మల్లారెడ్డిగార్లుపన్యసించారు.

10000 మంది పాల్గొన్న బొజ్జాయపల్లె సభ

పులివెందుల తాలూకాలో కమ్యూనిస్టుపార్టీ పాత కేంద్రాల్లో ఒకటయిన బొజ్జాయపల్లెలో జరిగిన బహిరంగ సభకు పదివేలమందికి పైగా ప్రజలు వచ్చారు. పరిసర గ్రామాలనుంచి తప్పెట్లు, కొమ్ములు మొదలయిన వాయిద్యాలతో బండ్లపైన, కాలినడకన ఊరేగింపులతో కుటుంబాలకు కుటుంబాలే తరలివచ్చాయి. స్థానిక ప్రజలు సంపూర్ణ సహకార, సానుభూతులతో బహిరంగసభకు చక్కటి ఏర్పాట్లు చేశారు. వెయ్యిమంది జనాభాగలచిన్న గ్రామమైన బొజ్జాయపల్లె ఎర్రజెండాలతో కళకళలాడింది. సభకు శ్రీ ఈశ్వరరెడ్డి గారు అధ్యక్షత వహించారు. తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ కె వి. నాగిరెడ్డి వివిధవిషయాలపైన విపులంగా మాట్లాడారు. శ్రీ కె రోశిరెడ్డి గారు సభకు అన్నివిధాలా సహాయం చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తర్వాత శ్రీ గజ్జలమల్లారెడ్డిగారు ఉపన్యసిస్తూ, అభ్యుదయపథకాల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలను ఖండించారు. దొంతులు, దొంతులుగా పెరిగిపోతున్న పన్నులభారం, చుక్కలంటే ధరలతో ప్రజలు పడుతున్న పాట్లను వర్ణిస్తూ, ఇవన్నీ 13 ఏండ్ల కాంగ్రెసు రాజ్యపు చల్లని పరిపాలనయొక్క విష ఫలితాలే నన్నారు. పులివెందుల తాలూకాలో 55 వేల ఎకరాలకు తుంగభద్ర ఎగువకాల్వద్వారా నీటిని సప్లయి చేస్తామని హామీయిచ్చి, చివరికి పులివెందుల కాలువనే పూర్తిగా తొలగించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తీవ్రంగా ఖండించారు.

శ్రీ ఈశ్వరరెడ్డి గారు తుంగభద్ర ఎగువకాల్వ కోసం శాసనసభల్లోనూ, పార్లమెంటులోను, ప్రజల్లోను కమ్యూనిస్టు పార్టీచేసిన కృషిని వివరించారు. 1955 ఎన్నికల్లో నీలం సంజీవరెడ్డి, పి. తిమ్మారెడ్డి గార్లు ఈ తాలూకాలో సభలు జరిపి 'ఎగువకాల్వకు కమ్యూనిస్టులు అడ్డుపడుతున్నా'రంటూ చేసిన నిందారోపణలను గుర్తుచేస్తూ, ఇప్పుడు ఎగువకాల్వను సగానికి కుదించడానికి, పులివెందుల కాల్వను ఎత్తివేయుడానికి కారకులెవ్వరు? కాంగ్రెసు ప్రభుత్వమా? కమ్యూనిస్టులా? అని ప్రశ్నించారు. ఇక్కడి పార్లమెంటు సభ్యులు, జిల్లా పరిషత్తు అధ్యక్షులు, ముగ్గురు నాయకులు యీ తాలూకా వారున్నారు. కాని, ఒకవైపున కడపజిల్లాను - ముఖ్యంగా పులివెందుల తాలూకాను యింత అన్యాయం జరుగుతూవుంటే చూస్తూ వూరుకోవడమే గాకుండా, జిల్లా కాంగ్రెసుపైకూడ పెత్తనం చలాయిస్తున్న ఈముఖ్యులు, అందులోముఖ్యంగా పార్లమెంటు సభ్యులయిన శ్రీ ఏటుకూరు రామిరెడ్డిగారు ఐక్య ఆందోళనకు వెన్నుపోటు పొడిచిన ఘటనలను వివరంగా పేర్కొన్నారు. ఐక్యఆందోళనద్వారా ఎగువ కాల్వకోసం తీవ్ర ఆందోళన సాగించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రొద్దుటూరులో 15000 మందితో సభ

జిల్లాలో రెండవ పెద్దపట్టణమైన ప్రొద్దుటూరులో చాలా పెద్దఎత్తున జనసమీకరణ జరిగింది. సుమారు 15 వేలమంది జనంతో సుందరాచార్ల క్లబ్బుప్రక్క మైదానం నిండిపోయింది. సభకు శ్రీ వి సుబ్బారెడ్డి యం. ఎ. ఎల్. ఎల్. బి. గారు అధ్యక్షత వహించారు. శ్రీయుతులు వై. ఈశ్వరరెడ్డి, గజ్జల మల్లారెడ్డి, పి. చిన్నపురెడ్డిగార్లు ప్రసంగించారు. అధ్యక్షులు తమ ఉపన్యాసంలో కాంగ్రెసు ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ అవినీతిని పెంచి పోషిస్తున్నదన్నారు.

దీనిఫలితంగా ప్రజల్లో రాజకీయాలంటేనే విసుగు, రోత కలుగుతున్నదన్నారు. రోజుకొక పార్టీ మారుస్తున్న రాజకీయ ఊసరవెల్లులను శ్రీ సుబ్బారెడ్డి నిశితంగా ఖండించారు. కమ్యూనిస్టుపార్టీ ఒక్కటే అశేష పీడిత ప్రజానీకంయొక్క ఆశలకు, వాంఛలకు ప్రతినిధిగా వుందన్నారు.

గ్రామాల్లో కొట్లాటలకు కారకులెవరు ?

కమలాపురం తాలూకా గడ్డంవారిపల్లెలో ఏప్రిల్ 29 న జరిగిన బహిరంగసభకు హాజరైన పదివేలమందిలో సగంమంది స్త్రీలున్నారు. ఈ సభకు తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ ఆర్. చిన్న చెన్నారెడ్డిగారు అధ్యక్షత వహించారు. శ్రీయుతులు వై. ఈశ్వరరెడ్డి, గజ్జల మల్లారెడ్డి, జె వెంకట్రామిరెడ్డిగార్లు ఉపన్యసించారు. శ్రీ గజ్జల మల్లారెడ్డిగారు తమ ఉపన్యాసంలో ఆ ఏరియాలో కొన్ని గ్రామాల్లో జరిగిన కొట్లాటలను, ఖూనీలను పురస్కరించుకొని కమ్యూనిస్టుపార్టీపై సాగిస్తున్న నిందా ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. గ్రామంలో అశాంతికి, అంతఃకలహాలకుమూలకారకులు పెత్తందార్లే, భూస్వామ్యవర్గాలేననీ, కమ్యూనిస్టుపార్టీ ఇక్కడ ఏర్పడక ముందునుంచీ ఎంతో కాలంగా, గ్రామాల్లో ఈ అశాంతి ప్రబలుతున్నదనీ వివరించారు. గ్రామాలలో ఏకచ్ఛత్రాధిపత్యంకోసం సంఘర్షణలు రేపుతున్న పెత్తందారీ వర్గాలకు జిల్లా కాంగ్రెస్ నాయకత్వం అండదండలు వివిధ రూపాల్లో లభ్యమవుతున్నాయన్నారు. తమ స్వార్థంకోసం పచ్చని పల్లెపట్టులను తగలబెడుతున్న పెత్తందార్లు, కొట్లపన్నులే కమ్యూనిస్టుపార్టీపై నిందలు వేయడం హాస్యాస్పదమన్నారు.

బద్వేలుతాలూకాలో సంరంభం

జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ నిర్మాణం బలహీనంగా వున్న ప్రాంతాల్లో ఒకటయిన బద్వేలు తాలూకాలో - జరిగిన రెండుసభలకు - బద్వేలులో సుమారు 7 వేలు, పోరుమామిళ్ళలో 5000 హాజరైనారు. శ్రీయుతులు పి. ఎన్. నరసింహారెడ్డి, రామిరెడ్డి, ఏటూరు సుబ్బారావు, ఈశ్వరరెడ్డి, మల్లారెడ్డిగార్లు ఉపన్యసించారు.

పార్టీనిర్మాణలోపంవల్ల గ్రామాల్లో ప్రచారం సరిగా జరగకపోయినా, కరపత్రాలద్వారాను, కర్ణాకర్ణికగా విని ప్రజలు ఉత్సాహంగా సభలకు వచ్చారు. 1952, 55 రెండు ఎన్నికల్లోను ఈ తాలూకా ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓట్లు యిచ్చారు. కాని, గెల్చిన స్వతంత్రులు తిరిగి వెంటనే కాంగ్రెసుతీర్థం పుచ్చుకుంటూవుండటం మామూలయింది. ఇది ప్రజల్లో అసంతృప్తిని, తమ శాసన సభ్యులపట్ల ఏహ్యభావాన్ని పెంచుతున్నది. కాంగ్రెస్‌కు నిజమైన ప్రతిపక్షం కమ్యూనిస్టుపార్టీయేననేగుర్తింపు క్రమంగా పెరుగుతున్నది.

మొత్తంమీద జిల్లా కమ్యూనిస్టు సమితి నిర్దేశించిన వేసవి ప్రచారం యాత్ర అనుకున్నదానికంటె అన్ని విధాలా జయప్రదమైందని చెప్పవచ్చు.

ఆరురోజుల్లోను 50వేలకు పైగా ప్రజల్లో రాజకీయప్రచారం జరిగింది. ప్రతి సభలోను సుమారు 3 గంటలకాలం ఎంతో నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉపన్యాసాలను విన్నారు.

పాలకొల్లు బాలికల బుర్రకథలను ప్రజలు ఎంతో ప్రశంసించారు.

విలేఖరులకు సూచనలు

విలేఖరులు, వార్తలు పంపేవారు ఈ క్రింది సూచనలను గమనించాలి.

1. కాగితానికి ఒకే వైపున సిరాతో విడివిడిగా తెలిసేటట్లు వ్రాయాలి. గొలుసుకట్టుతో వ్రాయరాదు. కనపడీ - కనపడకుండా వుండే కార్బన్ కాపీలను పంపరాదు.
2. వార్తలు క్లుప్తంగా ఉండాలి. విషయం స్పష్టంగానూ, సుబోధకంగానూ వుండేటట్లు వ్రాయాలి.
3. గ్రామాల నుండి వార్తలు పంపేవారు ఆయా తాలూకా, జిల్లాల పేర్లను కూడా ఉదహరించాలి. —సంపాదకులు.

శ్రీ మవలాంకర్ చేసిన కృషి

లోక్‌సభ స్పీకర్ జేజేలు

అహమ్మదాబాద్, మే 9

భారత దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అభివృద్ధికి కీర్తిశేషులైన శ్రీ జి. వి. మవలాంకార్ చేసిన కృషికి నేడిక్కడ లోక్‌సభ స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగార్, గుజరాత్ గవర్నర్ నవాబ్ మెహిదీన్ నవాజంగ్ జేజేలను తెలియజేశారు.

శ్రీ మవలాంకర్ స్వతంత్ర భారతావని మొట్టమొదటి లోక్‌సభ స్పీకర్. ఆయన చిత్రపటాన్ని నేడు గుజరాత్ విద్యాసభ హాలులో ఆవిష్కరించుతూ శ్రీ అనంతశయనం అయ్యంగార్ ప్రసంగించారు.

గుజరాత్ విద్యాసభ ఏర్పడి యిప్పటికి 112 సంవత్సరాలైంది. ఈ సభకు 1942 నుండి 1956 ఫిబ్రవరి వరకూ, శ్రీ మవలాంకర్ అధ్యక్షుడుగా పని చేశారు.

శ్రీ మవలాంకర్ సంరక్షించిన పార్లమెంటరీ సంప్రదాయాలను కాపాడుకోటా, వాటికి మరింతవన్నె తేవడం నేటి యువకుల కర్తవ్యమని శ్రీ అనంతశయనంగారు ఉద్బోధించారు.

ఈనాడు భారత పార్లమెంటు వ్యవహారాలను మనం ఒక క్రమపద్ధతిలో నిర్వహించగలుగుతున్నామంటే శ్రీ మవలాంకర్ అందుకు వేసిన పునాదులే కారణమని ఆయనన్నారు.

యు. పి. ఉప ఎన్నికలో కాంగ్రెసుగెలుపు

ప్ర. సో. పార్టీ ఓటమి

కాన్పూర్, మే 9

కాన్పూరు జిల్లాలోని అక్బర్‌పూర్ నియోజకవర్గం నుండి ఉత్తర ప్రదేశ్ శాసనసభకు జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెసు అభ్యర్థి శ్రీరామ దులారే మిశ్రా ఎన్నుకోబడ్డారు.

సోషలిస్టు సభ్యుడు శ్రీ బాల్విన్ సింగ్ ఎన్నికను ట్రిబ్యునల్ రద్దుచేసినందున ఈ ఉపఎన్నిక జరిగింది.

కాంగ్రెసు అభ్యర్థి శ్రీ మిశ్రాకు 12,259 ఓట్లురాగా, పి.యస్.పి. అభ్యర్థికి 6448 వోట్లు వచ్చాయి ఉపఎన్నికలో ఎనిమిదిమంది అభ్యర్థులు పోటీ చేయగా అందులో అయిదుగురు ధరావతును కోల్పోయారు.

దుర్గాపూర్ ఉక్కు ఫ్యాక్టరీ

9,12అంగుళాల ఇనుపదిమ్మల తయారీ ప్రారంభం

కలకత్తా, మే 9

దుర్గాపూర్ ఉక్కు ఫ్యాక్టరీలో లోహపు దిమ్మలు తయారుచేసే బ్లూమింగుమిల్లు ఉత్పత్తిని ప్రారంభించింది. ఇది ప్రస్తుతం తొమ్మిది, పండ్రెండు అంగుళాల ఇనుపదిమ్మలు తయారు చేస్తున్నది.

దుర్గాపూరు ఉక్కు ఫ్యాక్టరీ జనరల్ మేనేజరు శ్రీ కె. సేన్ ఈ మిల్లుకు నేడు ప్రారంభోత్సవం జరిపారు. ఫ్యాక్టరీ దుక్క ఇనుము తయారుచేయడం ప్రారంభించిన 17 వారాల్లో ఈ దిమ్మలు తయారుచేసే స్థితికి వచ్చినందుకు శ్రీ సేన్ ఫ్యాక్టరీ నిర్మాతలను అభినందించారు.

ఈ ఫ్యాక్టరీ నిర్మించినది ఒక బ్రిటిష్ కంపెనీ.

శ్రీమతి నందితా కృపలానీ

మాస్కోకు ఆహ్వానం

న్యూఢిల్లీ, మే 9

రవీంద్రకవి "చిత్రాంగద" నాటకాన్ని ప్రదర్శించే సందర్భంలో తమకు తోడ్పడేందుకు సోవియట్ ప్రభుత్వం శ్రీమతి నందితా కృపలానీని మాస్కో రావలసిందిగా ఆహ్వానించింది.

ఆమె మే 19 వ తేదీన మాస్కోకు బయలుదేరి వెడతారు. అక్కడామె ఒక నెలరోజులపాటు వుంటారు.

శ్రీమతి కృపలానీ విశ్వకవి రవీంద్రుని మనుమరాలు. ఆయన సజీవంగా వున్నప్పుడు ఆయన నాటకాల్లో శ్రీమతి నందితా చాలపాత్రలను నటించారు. రవీంద్రుని సంగీతాన్ని కూడా ఆమె టేప్‌రికార్డింగ్ చేశారు.

వ్యభిచార గృహాలపై పోలీసులదాడి

నిడదవోలు, మే 7

నిడదవోలులో మొన్న రాత్రి రైల్వేస్టేషన్ సమీపములోని 9 మంది వ్యభిచారిణులను రాత్రి 2 గంటలకు స్థానిక పోలీసువారు అరెస్టుచేసి కొవ్వూరు కోర్టుకు తీసుకెళ్ళారు.

'యువకుల్లోని నైరాశ్యతకు నిరుద్యోగమే మూలకారణం'

నిరుద్యోగ నిర్మూలనమే ప్రణాళికల లక్ష్యం కావాలని యలమర్రు సభలో ప్రసంగాలు

యలమర్రు, మే 8

"నేటి పరిస్థితులలో విద్యార్థి-యువజనులు దేశం ఎడల, సంఘం ఎడల యింకా ఇలా నైరాశ్యం వహిస్తే దేశ భవిష్యత్తే చాలా ప్రమాదకరంగా మారుతుంది." అని శ్రీగోపరాజు లవణంగారు కృష్ణాజిల్లా విద్యార్థి యువజన వేసవి రాజకీయపాఠశాల (యలమర్రు) ముగింపు సందర్భంలో జరిగిన బహిరంగసభలో ఉపన్యసించారు.

బహిరంగసభకు గుడివాడ తాలూకా యువజనసంఘ తాత్కాలిక కార్యదర్శి శ్రీ కొల్లి లక్ష్మణస్వామిగారు అధ్యక్షత వహించారు.

తరువాత శ్రీ దాసరి నాగభూషణరావు గారుపన్యసిస్తూ, నేటి యువజన, విద్యార్థుల నిస్తబ్ధతకు కారణం ముఖ్యంగా నిరుద్యోగ సమస్య కాబట్టి యీ నిరుద్యోగ సమస్యను పరిష్కరించుకోగలిగినరోజునే మన పరిస్థితులు, మనదేశపరిస్థితులు చక్కబడతాయన్నారు. అలాగాక దేశ పరిస్థితులు చక్కబడవలెనన్న కర్మపై భారముంచి నిర్వీర్యులయ్యే దానికన్నా మానవశక్తిని ఐక్యపరచి వినియోగిస్తే తప్పక ఆ సమస్యను పరిష్కరించుకోగలమన్నారు.

ఇందుకు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను పోల్చి మనకు పన్నులు పెరుగుతుంటే రష్యాలో తగ్గుతున్నవనీ, మనకు పనిగంటలు భారమవుతుంటే రష్యాలో దినదినంతగ్గిపోతున్నవనీ, మనకు జనాభా హెచ్చవుతుంటే చైనాలో జనాభా చాలటంలేదనీ, ఈ పరిస్థితులను ప్రజలు పరిశీలించినప్పుడు తప్పక మనం కూడా మన దేశాన్ని పునర్నిర్మించుకోగలమని వివరించారు. అలానే సంఘంలో మరల కులమత భేదాలు, వరకట్నాలు లాంటి మరికొన్ని సాంఘిక దురాచారాలు నేడుకూడా వెల్లువెత్తుతున్నవంటే నేటివిద్యార్థి యువజనులు సంఘాన్ని సరిచేయవలసిన, దేశాన్ని పునర్నిర్మించవలసిన అవసరం ఎంతగా వున్నదీ వివరించారు.

తరువాత శ్రీ జి. వి. నారాయణరావు గారుపన్యసిస్తూ జాతీయ ప్రణాళికా కార్యక్రమాలకువిద్యావిధానానికి ఏమాత్రం సంబంధం వుండటంలేదన్నీ, ప్రణాళికలలో ఆస్పత్రులు పెంచితే అందుకు తగు డాక్టర్లను తయారుచేయుటకుగాని, దేశంలో ప్రాజెక్టులు నిర్మిస్తూంటే అందుకు తగిన సాంకేతిక నిపుణులను తయారుచేయుటకుగాని మన విద్యావిధానం ఏమాత్రం ఉపయోగపడటం లేదన్నారు. అందువల్ల అలాంటి విద్యావిధానాన్ని ప్రవేశపెట్టించుటకు అందరం కృషిచేయాల్సివుందన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేవిగా మన ప్రణాళికలు వుండాలన్నారు.

బహిరంగసభ అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగినవి. ఈప్రదర్శనంలో యలమర్రు ఎలిమెంటరీ పాఠశాల బాలికల దళంవారు స్వాగతం, ఆంధ్రమాత, సంవాదం, అను నృత్య గేయములు, ప్రార్థనాగేయములు ప్రదర్శించారు. యలమర్రు హైస్కూలు బాలికలదళంవారు, విశాలాంధ్ర, భారతమాత, ఆహ్వానం, అను నృత్య గేయాలు యితరపాటలు ప్రదర్శించారు. తరువాత కృష్ణాజిల్లా విద్యార్థి దళంవారిచే, మానవుడు, రిహార్సలు నాటికలు, ఆకలి, పిట్టలదొర, గారడీ విచిత్రవేషాలు ప్రదర్శించి, యింకా వివిధరకాలజాతీయగీతాలు పాడారు.

పాఠశాలల్లో ప్రతిరోజూ వివిధ పాఠ్యాంశాలపై ఉపన్యాసాలు ఇవ్వబడ్డాయి.

శ్రీ కవులూరి వెంకటేశ్వరరావు తత్వశాస్త్రాన్ని, శ్రీ పరకాల పట్టాభిరామారావుగారు భారతీయ అర్థశాస్త్రాన్ని, యువజనోద్యమ చరిత్రను శ్రీ పి. శ్రీరామమూర్తిగారు నేటి విద్యావిధానంపైనా ఉపన్యసించారు. శ్రీ మాణిక్కొండ సుబ్బారావుగారు స్వాతంత్ర్యోద్యమ చరిత్రగూర్చి మాట్లాడారు. తరువాతశ్రీ కొడాలిఆదిశేషయ్యగారు నాట్యశాస్త్రంపై ఉపన్యసించి, అభినయ పూర్వకంగా వివరించారు.

శ్రీ జి. వి. నారాయణరావుగారు విద్యార్థుల గత త్యాగాలను, పవిత్రాశయాలను చరిత్రను జ్ఞాపకంచేశారు. విశ్వశాంతి సుస్థిరత సోషలిస్టుభావాల ప్రచారం, జాతీయ పునర్నిర్మాణం, స్వయం సహాయ కార్యక్రమాలు, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకోద్యమం, సరైన విద్యావిధానం కోసం కృషియే నేటి యువజనుల, విద్యార్థుల తక్షణ కర్తవ్యాలని బోధించారు.

శ్రమదాన కార్యక్రమాలు

ఈ పాఠశాల సందర్భంలో ఒక్క తరగతులు నిర్వహించుటే కాకుండా విద్యార్థులు వివిధ యితర కార్యక్రమాలనుకూడా నిర్వహించారు. ఉదయం 4 గంటలనుండి 6 గంటల వరకు ప్రభాత్ ఫేరీలు; జాతీయగీతాలు ఆలాపనచేస్తూ గ్రామం తిరిగేవారు. 6 గంటలనుండి 7 గంటలవరకు వ్యాయామం; మధ్యాహ్నం ఒకగంట అభిప్రాయ వేదిక; సాయంత్రం మరల 5 గంటల నుండి 7 గంటలవరకు నిర్మాణ కార్యక్రమం వుండేవి.

ఈ నిర్మాణకార్యక్రమంలో విద్యార్థులు యెంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలురు రోడ్లు ఊడ్చేవారు బాలికలు హరిజనవాడలకు వెళ్ళి ప్రతి రోజూ చిన్నపిల్లలందరికి స్నానాలు చేయించి తలలుదువ్వేవారు.

ఈ కార్యక్రమం విద్యార్థులకు - ప్రజలకు, విద్యార్థులకు - శ్రమకుమధ్య విఘాతాన్ని కొంత రూపుమాపుటకు కూడా సహకరించింది.

అమెరికాలోని ఐడిల్ వైల్డు విమానాశ్రయంలో నిప్పంటుకొన్న బోయింగ్ 707 జెట్ విమానంలోని 109 మంది ప్రయాణీకులూ, బ్రతికి బయటపడ్డారు.

గ్రంథాలయ సంఘ అధికారుల పర్యటన

విజయవాడ, మే 9

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘాధ్యక్షులు శ్రీ కోదాటి నారాయణరావు, కార్యదర్శి శ్రీ పాతూరి నాగభూషణం, పాలకవర్గ సభ్యులు శ్రీ కొమ్మ సీతారామయ్యగార్లు దిగువ కార్యక్రమము ననుసరించి ఆయా జిల్లాలలో సంచారము చేస్తారు. ఈసంచారములో హైద్రాబాదులో ప్రధాన కార్యాలయానికి స్థిరవసతిని సంపాదించుటకు, సంఘమునకు యావజ్జీవ సభ్యులను చేర్చుటకు, జిల్లా గ్రంథాలయ సంఘముల ఎన్నికలను జరిపించుటకు, స్థానిక కార్యకర్తలను కలసి ఉద్యమాభివృద్ధినిగూర్చి చర్చించుటకు సంఘ ప్రచురణల ప్రచారానికి కృషిసల్పుటకు వీరు పూనుకుంటారు.

మేనెల 10, 11, 12 హైద్రాబాదులో సంఘసమావేశాలు; 13, 14 సూర్యాపేట తాలూకా; 15, 16, 17 ఖమ్మంమెట్టు; (15 న ఖమ్మంమెట్టు జిల్లా గ్రంథాలయ సంఘపు ఎన్నికలు); 18, 19 హుజూర్‌నగర్ తాలూకా; 19 రాత్రికి పటమటలంక; 20, 21 వేటపాలెం, పరిసరాలు (20న గుంటూరుజిల్లా మహాసభ, సంఘపు ఎన్నికలు); 22 పటమటలంక: కృష్ణాజిల్లా గ్రంథాలయ సంఘపు ఎన్నికలు; 23 ఖమ్మంమెట్టు; 24, 25 ఒరంగల్లు; (24 న ఒరంగల్లు జిల్లా గ్రంథాలయ సంఘపు ఎన్నికలు) 26, 27 కరీంనగరు; (26 న కరీంనగరు గ్రంథాలయ సంఘ ఎన్నికలు) 28 సిద్దిపేట; మెదకుజిల్లా గ్రంథాలయ సంఘపు ఎన్నికలు; 29, 30, 31 నిజామాబాదు; (29 న నిజామాబాదు జిల్లా గ్రంథాలయ సంఘపు ఎన్నికలు) జూన్ 1, 2 హైదరాబాదు 2 న హైదరాబాదు జిల్లా గ్రంథాలయ సంఘపు ఎన్నికలు).

ప్రతి సెక్షన్‌కు ఒక టీచరు

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ సూచన

విజయవాడ, మే 6

హైస్కూళ్లలో ప్రతిసెక్షన్‌కు ఒక టీచరును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ ప్రభుత్వానికి సూచించింది.

యూనియన్ సమావేశం ఈనెల 1 వ తేదీ విజయవాడ ఎస్. కె. పి. వి. వి. హెచ్. స్కూలులో శ్రీ ఎం. రామచంద్రరావుగారి అధ్యక్షతను జరిగింది.

ఈ సమావేశంలో ఉపాధ్యాయుల సర్వీసు స్థితిగతులను గురించి, విద్యాస్థాయిని అభివృద్ధి పరచడం గురించి కొన్ని తీర్మానాలు చేశారు.

రెండేళ్ళు పనిచేసిన ఉపాధ్యాయుని ఉద్యోగం ఖాయపరచాలని, అందరికీ ఒకేవిధమైన సెలవు నిబంధనలు పెట్టాలని, హయ్యర్ సెకండరీ దశవరకు ఉచిత విద్యా సౌకర్యం కలిగించాలని, ఉపాధ్యాయులు ఉద్యోగం విరమించే వయస్సు 55 నుండి 60 సంవత్సరాలకు పెంచాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

విద్యాస్థాయిని అభివృద్ధి పరచడానికై చేసిన సూచనలు ఇవి: శనివారంనాడు స్కూళ్లు పెట్టకూడదు. ప్రతి సెక్షన్‌కు ఒక టీచరును ఏర్పాటు చేయాలి. ప్రతి హైస్కూలులోనూ పీరియడ్‌ల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఒక సీనియర్ పండితుని నియమించాలి. విద్యార్థులసంఖ్య క్రింది క్లాసులలో సంఖ్య 35 కు, పై క్లాసులలో 40 కి పరిమితం చేయాలి.

ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షలో సమాధాన పత్రాలు దిద్దడానికి లోగడ యిస్తున్నట్లు పరిహారం ఇవ్వాలని, దీనిని తెలంగాణా ప్రాంతానికి కూడ విస్తరింపజేయాలని వేరొక తీర్మానం చేశారు.

టీ ఎగుమతులు ప్రోత్సహించాలని

డా. రాధాకృష్ణ సలహా

బొంబాయి, మే 9

విదేశ ద్రవ్యమారకాన్ని సంపాదించుకొనేందుకు విదేశాలకు తేయాకు ఎగుమతులను బాగా ప్రోత్సహించవలసిన ఆవశ్యకతను గురించి నేడిక్కడ ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ చెప్పారు.

బొంబాయిలోని భారత ప్రభుత్వం టీ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంలో డాక్టర్ రాధాకృష్ణ నేడిక్కడ మాట్లాడారు.

సోవియట్ యూనియన్, అమెరికాలాంటి విదేశాలనుండి సహాయం మనకు వస్తున్నప్పటికీ, మనం దానిపై ఎల్లకాలం ఆధారపడరాదని ఆయనన్నారు.

కమ్యూనిస్టుపార్టీ నిధి వసూళ్ళు

అవనిగడ్డ ప్రాంతంలో రు 1308 లు సమర్పణ

అవనిగడ్డ, మే 7

దివితాలూకా అవనిగడ్డలో డాక్టరు శ్రీ గద్దె వేంకటకృష్ణయ్యగారి అధ్యక్షతను మొన్న గొప్ప బహిరంగ సభ జరిగింది. అవనిగడ్డ ప్రాంతములో కమ్యూనిస్టుపార్టీకి వసూలైన నిధి రు 1308 లు గ్రామపార్టీ కార్యదర్శి శ్రీ గద్దె వెంకట కృష్ణయ్యగారు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణగారికి సభలో సమర్పించారు. సభకు సుమారు 3 వేల మంది స్త్రీ పురుషులు వచ్చారు.

శ్రీ సనకా బుచ్చికోటయ్యగారు ఉత్సాహముగా విరాళములు ఇచ్చిన దాతలకు, పట్టుదలగా పనిచేసిన కార్యకర్తలకు తాలూకా పార్టీ తరఫున కృతజ్ఞతను తెలిపారు.

తర్వాత వేములపల్లి శ్రీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పన్నుల విధానాన్ని విమర్శించారు.

ఈ క్రింది గ్రామాల్లో 390 కుటుంబాల్లో రు 2452-8-0 ల వాగ్దానాలకు గాను రు 1308-0-0 లు వసూలైంది. గ్రామాలు- అవనిగడ్డ, బందలాయి చెరువు, రామచంద్రపురం, మసరరం, వాలందపాలెం, మోదుమూడి, ఎడ్లంక, ఆశ్రేపాలెం, పులిగడ్డ, గుడెకారిపాలెం

పుత్తూరు బస్సు కార్మిక సంఘం ఎన్నికలు

పుత్తూరు, మే 8

పుత్తూరు శ్రీ శ్రీనివాస బస్సుకంపెనీ కార్మికులు ఏప్రిల్ 29 న పుత్తూరులో సమావేశమై ఈ క్రిందివారిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు:

అధ్యక్షులు: శ్రీ సత్యనారాయణయ్య, ఉపాధ్యక్షులు, శ్రీ దొరస్వామినాయుడు, కార్యదర్శి: శ్రీ సుందరాచారి (అడ్వకేటు), సహాయ కార్యదర్శి: శ్రీ వేణుగోపాల్.

'ఎగువకాల్వను తృతీయ ప్రణాళికలో ముగించాలి'

తరిమెల, మే 8

తుంగభద్ర ఎగువకాల్వను తృతీయ ప్రణాళికాంత్యమునకు ముగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈనెల 5 న యిక్కడ శాసనమండలి సభ్యుడు శ్రీ ఐ. సదాశివన్ అధ్యక్షతను జరిగిన బహిరంగ సభలో తీర్మానించారు. ఈ సభను తరిమెల గ్రామ కమ్యూనిస్టుశాఖ ఏర్పరచింది.

సభలో శ్రీ సదాశివన్ మాట్లాడుతూ, ఎగువకాల్వ ప్రస్తుతం నిర్మిస్తున్న గోరతిలో సాగితే 15 సంవత్సరాలకుగాని పూర్తికాదని విమర్శించారు.

శ్రీ చంద్ర పుల్లారెడ్డి, శ్రీ ఎన్. శివరామిరెడ్డి, శ్రీ బి గోపాలకృష్ణగార్లు కూడా సభలో ప్రసంగించారు.

అనంతరం కోడుమూరు బాలికలు అల్లూరి సీతారామరాజు బుర్రకథ చెప్పారు.

గోరేగాం ఆంధ్ర యువజనసంఘ సమావేశం

బొంబాయి, మే 6

బొంబాయి, జైప్రకాశనగరి లక్ష్మి కటేజ్ వద్ద గోరేగాం ఆంధ్రయువజన సంఘ విస్తృత సమావేశం శ్రీ నల్లి జగన్నాధంగారి అధ్యక్షతను జరిగింది. సభ్యత్వం ఎక్కువగా చేర్పించవలసిన అవసరంగురించి కార్యదర్శి శ్రీ సి. హెచ్. కృష్ణమూర్తిగారు వివరించారు. సంఘం ఇంతవరకు చేసిన పనినిగురించి ఉపాధ్యక్షుడు శ్రీ జి. ఎల్. వి. రత్నంగారు మాట్లాడారు. సంఘం నిర్మాణంగురించి శ్రీ ఎన్. జగన్నాధ, శ్రీ వి. వెంకట్రావుగార్లు ప్రసంగించారు.

దక్షిణాఫ్రికాలో జరిగిన కాల్పులను నిరసించుతూ తీర్మానించారు. మహారాష్ట్రావతరణకు తమ సంతోషాన్ని వెల్లడించారు

ప. గో. జిల్లాలో బస్సుల జాతీయం

పరిశీలనా కమిటీ నివేదిక వచ్చేవరకు ఆపివేయాలట

విజయవాడ, మే 10

జాతీయం చేయబడిన బస్సు సర్వీసుల నిర్వహణా పరిశీలనకు ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించనున్నామని ప్రదేశ్ రవాణాశాఖా మంత్రి ప్రకటించినందున ఆ నివేదిక వచ్చేవరకు పశ్చిమ గోదావరి జిల్లాలో బస్సుల జాతీయకరణాన్ని వాయిదా వేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ మోటారు యూనియన్స్ కాంగ్రెసు సాధారణ కార్యదర్శి శ్రీ. వై. రామబ్రహ్మంగారు ఒక ప్రకటన చేశారు

మంత్రి ప్రకటనను హర్షం ప్రకటిస్తూ బస్సుసర్వీసు నిర్వహణలో చిరకాలానుభవం కల్గియున్న ఒకరిద్దరు ఈ కమిటీలో సభ్యులుగా తీసుకోబడితే ఆ కమిటీ రిపోర్టు అనుభవాలతో కూడిన రిపోర్టుగా వుండగలదని ప్రభుత్వానికి సూచించారు.

అందువల్ల వారి రిపోర్టువచ్చేవరకు పశ్చిమ గోదావరి జిల్లాలో బస్సుల జాతీయకరణనువాయిదా వేయగోరారు

విజయనగరం ప్రజలకు ఆస్పత్రి సౌకర్యం

విజయనగరం, మే 5

స్థానిక మహారాజా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోకి మహారాజా ప్రభుత్వ ఘోషా ఆస్పత్రిని తరలించవలసిన ఆవశ్యకతను వివరిస్తూ మండల కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి శ్రీ ఎం వి. ఎస్. ఆచారి ఇటీవల ముఖ్య మంత్రికి ఒక వినతిపత్రం సమర్పించారు.

హరిజన దినోత్సవం

హనుమాన్ జంక్షన్, మే 8

ముసునూరు పంచాయతీ సమితి బలివే గ్రామం రంగంపాడు హరిజనవాడలో ఏప్రిల్ 30 న హరిజన దినోత్సవం జరుపబడింది. ముసునూరు ప్రైమరీ హెల్త్ సెంటరు డాక్టరు శ్రీ ఐ. కోటేశ్వరరావుగారు, బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీ జి సూర్యారావుగారు హెల్త్ విజిటరు హరిజన వాడలోని గృహములన్నియు పరిశీలించి పరిశుభ్రముగా నున్న యిండ్లను, ఆరోగ్యముగా నున్న పిల్లలను ఎన్నికచేశారు. తరువాత పాటలు పాడుటలో పోటీలు జరుపబడినవి. గెల్చినవారికి సమితి అధ్యక్షులు శ్రీ దాసరి వెంకటసుబ్బయ్యగారు బహుమతులు పంచారు.

దూసనపూడి యువజన సంఘ కార్యాలయ ప్రారంభోత్సవం

దూసనపూడి, మే 8

భీమవరం తాలూకా దూసనపూడి యువజన సంఘంవారు హరిజనవాడలో ఒక ఆఫీసు నిర్మించుకుని, ఏప్రిల్ 26 న ప్రారంభోత్సవం జరుపుకున్నారు రాత్రి 9 గంటలకు బహిరంగ సభ జరిపారు. భీమవరం తాలూకా సంఘ నాయకులు శ్రీయుతులు మైలవరం రామారావు, కొల్లా వెంకటరత్నం, పాలపర్తి నాగేశ్వరరావు, కొటికలపూడి నూరన్నగార్లు మాట్లాడారు.

అనంతరము భీమవరం బాలికాదళం వారిచే "అమరజీవి" బుర్రకథ చెప్పబడినది.

ఇదే సందర్భంలో కమ్యూనిస్టుపార్టీ నిధికి రు 75లు వాగ్దానాలు వచ్చాయి. రు 25 లు వసూలు అయింది.

తెలంగాణాలో మద్యనిషేధం

పెట్టాలని తెలంగాణా భూదాన కార్యకర్తల తీర్మానం

హైద్రాబాద్, మే 8

తెలంగాణాలో మద్యనిషేధాన్ని ప్రవేశపెట్టాలనీ, ప్రాంతీయ శాసన సభ్యుల్లో అధికులు యిందు కనుకూలమనీ, రాజధాని మద్యపానకేంద్రంగా వుండటంవల్ల నిషేధచట్టం నైతికవిలువలు నశించాయనీ మొన్న యిక్కడ గాంధీ భవనంలో జరిగిన తెలంగాణా భూదాన కార్యకర్తల సమావేశంలో తీర్మానించారు.

ఇందుకై గ్రామ పంచాయతీలు, గ్రామ సభలు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చ వలసివుందని తీర్మానంలో పేర్కొన్నారు.

రాయలసీమ రాజకీయ పాఠశాల ముగింపు

ఇల్లూరు, మే 8

పదిరోజులుపాటు ఇక్కడ జరిగిన రాయలసీమ కమ్యూనిస్టు సీనియర్ ఆర్గనైజర్ల రాజకీయపాఠశాల 5వ తేదీన ముగిసింది. స్కూలును నడపడానికి అనంతపురం జిల్లా కమ్యూనిస్టు కమిటీ వారి చక్కని ఏర్పాట్లను విద్యార్థులు ప్రశంసించారు. ఆఖరురోజు రాత్రి శ్రీ తరిమెల కృష్ణారెడ్డిగారు విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ విందు యిచ్చారు (వి వి)

సభలు - సమావేశాలు

కృష్ణాజిల్లా కమ్యూనిస్టుసమితి కార్యవర్గ సమావేశం యీ నెల 16, 17, 18 తారీఖులలో విజయవాడ (సీతారాం పురం)లో జరుగుతుంది. 16 న సాయంకాలం 4 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుంది.

* * *

బాపట్ల తాలూకా వ్యవసాయ కార్మిక మహాసభ యీ నెల 15, 16 తారీఖులలో సంతరావూరు గ్రామంలో జరుగుతుంది.

డాక్టర్ డిగ్రీ పొందండి!

ఇంటిలో తీరికగా కూర్చొని వుండేప్పుడు పోస్టల్ ట్యూషన్ పొంది, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ పొందిన కాలేజిద్వారా మీరు డిప్లొమా పొందవచ్చును.

ఉచితప్రాస్‌పెక్టస్‌కువ్రాయండి.

Indian Homeopathic College
(VAV) JULLUNDUR CITY.

సైకిలు పోయినది

నా సైకిలుషాపులోని రాబిన్‌హుడ్ (ఫ్రే॥నెం॥95546 B) నెపోలియన్ సీటుతో ఒరిజినల్ పార్ట్సుతో 7 వ తేదీ రాత్రి తమ్మినేనినరసింహారావుల పెడిఎలహజ్ఞా వాస్తవ్యుడు సైకిలను అద్దెకు తీసుకొని తిరిగి ఇవ్వలేదు. నల్లగా, బొద్దుగా 20 సం॥ వయస్సుగల పై అతని జాడ తెల్పిన తగిన బహుమతి యివ్వబడును.

వంగా కృష్ణారెడ్డి,
పెదఓగిరాల (పోస్టు) కృష్ణాజిల్లా.

NOTICE

"In the matter of voluntary winding up of Vijaya Film Distributors Ltd, Vijayawada-2 under Sec. 497 (2) of the Companies Act, 1956.

Know Ye all, the contributories, creditor and all those that are otherwise or in any way connected with the Company that the final general meeting of dissolution of the above Company which went into liquidation on 21-11-58 will be held on 25-6-60 at 4 P. M. at Suryaraopet, Vijayawada 2, in the Registered Office of the Company in the house of Sree D E. Venkateswarlu to conclude all the winding up proceedings in the matter of voluntary winding up of Company. All the share-holders are requested to attend.

P. V. RAGHAVAIAH,
Liquidator. 9-5-60.

అధిక పోషకమైన పదార్థములతో తయారు చేయబడినట్టి—

సారె బిస్కట్ అండ్ చాక్లెట్ కో. లి. పూనా-2.



అత్తరు నసీమ్

శుభసమయములలో మీ స్నేహితుల, ఆహ్వానితుల హృదయములను చూరగొనుటకు 'అత్తరు - నసీమ్' కొద్ది చుక్కలు వారి జేబుగుడ్డలు, బట్టలమీద చిలకరించండి. దానితో ఆ వేడుక ఎంతో ఆనందకరంగాను, శోభాయమానంగాను, వుండును.

హమి & కో.,
పెర్‌ఫ్యూమర్స్
జుమ్మామసీదు - బొంబాయి - 2

వివిధ రైతాంగ సమస్యలపై ఆంధ్ర ప్రదేశ్ రైతు మహాసభ తీర్మానాలు

పన్నులభారం తొలగించాలనీ, నీటి వనరుల నభివృద్ధిచేయాలనీ, ప్రణాళికా ప్రమాణాలను హెచ్చించాలనీ అభ్యర్థన

సత్తెనపల్లి, మే 9

ఈ నెల 1వ తేదీతో ముగిసిన ఆంధ్రప్రదేశ్ ద్వితీయ రైతు మహాసభలో, రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన 300 మంది ప్రతినిధులు ఈ నాడు రైతాంగాన్నెదుర్కొంటున్న వివిధ సమస్యలను చర్చించి ఈ క్రింది తీర్మానములను ఆమోదించారు.

1. రైతాంగంపై అదనపు పన్నులభారం

రైతాంగంపై రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో రాష్ట్రప్రభుత్వం అనేక క్రొత్త పన్నులను విధించింది. ఈ పన్నులను విధించే సందర్భంలో సోషలిస్టు సమాజ లక్ష్యాన్నిగాని పన్ను చెల్లించే తాహతు గాని గమనించకుండా ప్రతి ఎకరము, కుంట, సెంటు పైనకూడ పన్ను విధించుతోంది. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి మరొకపర్యాయం తీసుకువస్తూ ప్రస్తుత భూమి శిస్తు విధానాన్ని పూర్తిగా మార్చివేసి ఒక పరిమితికి మించిన వ్యవసాయాదాయాలపై వృద్ధిక్రమానుగతమైన పన్ను విధించాలని మహాసభ ప్రభుత్వాన్ని కోరుతూంది.

అనంతరామన్ కమిటీ, భూమి శిస్తు విధానంపై నివేదికనుపరిశీలించిన మీదట మహాసభ ప్రభుత్వానికి ఈ క్రింది సూచనలు చేసినది:

1. వాణిజ్య పంటలపై ఎకరాల వారీగా విధించబడుతున్న పన్నులు రద్దుచేయాలి.

2 అనంతరామన్ కమిటీ సూచించిన హెచ్చు నీటితీరువా రేట్లను ప్రభుత్వం అంగీకరించరాదు.

3 భూమిశిస్తు నీటితీరువా కలిసిన మొత్తము శిస్తుపై రు 50కి పైబడిన సందర్భంలో సర్‌ఛార్జి విధించాలని అనంతరామన్ కమిటీ సూచించింది. ఈ మినహాయింపు రు 100 ల వరకూ పెంచాలని మహాసభ అభిప్రాయపడింది.

4 క్రొత్తగా నిర్మించిన జలాధారాలక్రింద అభివృద్ధి పన్ను విధించే సందర్భంలో ఏడున్నర ఎకరాలకు లోపు భూమికలిగిన రైతాంగంపై అభివృద్ధిపన్ను విధించరాదు అంతకుపైబడి భూవసతిగలవారిపై క్రమానుగతంగా అభివృద్ధిపన్ను విధించాలి.

5 లోకల్‌సెస్సు, విద్యాసెస్సు ఒక రూపాయి ఎనిమిదణాలకు పెంచాలనే మంత్రివర్గం నిర్ణయాన్ని అమలు జరుపరాదు

ఈ పై సూచనలను ఆధారము చేసికొని రాష్ట్రవ్యాపితంగా ఆందోళనకు పూనుకోవాలని మహాసభ రైతాంగానికి విజ్ఞప్తి చేస్తోంది.

2. ఆంధ్ర భూకమతాల గరిష్ఠ పరిమితి బిల్లు

ప్రస్తుతం జాయింటు సెలెక్టు కమిటీ పరిశీలనలో ఉన్న గరిష్ఠ కమతాల బిల్లులోని అంశాలు ఎక్కువ అసంతృప్తికరంగాను, లోపభూయిష్టంగాను, భూస్వాములకు అనుకూలంగాను ఉన్నట్లు మహాసభ అభిప్రాయపడింది. ప్రకటించబడిన బిల్లులోని అంశాలే ఎక్కువ అభివృద్ధి నిరోధకంగా ఉండగా, వీటిని మరింత అభివృద్ధి నిరోధకంగామార్చి గరిష్ఠ పరిమితిని పెంచి అనేకరకాల మినహాయింపులను యివ్వడానికై కాంగ్రెసు శాసనసభ పార్టీ చేస్తున్న ప్రయత్నాల యెడ మహాసభ తన తీవ్ర ఆందోళనను వ్యక్తపరచింది. రు. 3,600 నికరాదాయం వచ్చే భూమి 5 గురు సభ్యులు గల కుటుంబానికి గరిష్ఠపరిమితిగా నిర్ణయించాలని కుటుంబములోని సభ్యుల పేరిట విడివిడిగా పట్టాలో వున్న లేక ఆస్తి విభాగాలు జరిగినట్లుగా చూపెట్టబడినా వీటితో నిమిత్తము లేకుండా అందరిపేరా ఉన్న భూమిని కుటుంబ మొత్తము భూమిగా పరిగణించి దానిపై గరిష్ఠ పరిమితిని విధించాలని మహాసభ కోరింది. అనేకరకాల మినహాయింపులతో బిల్లును బూటకంగా తయారు చేయచూస్తున్న ప్రయత్నాలను విరమించాలని మహాసభ కోరింది

3. నీటివనరుల అభివృద్ధి

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలవల్ల రాష్ట్రంలో అధికాహారోత్పత్తికి ఉన్న అపార అవకాశాలను, అధిక ఎరువులూ, మేలు విత్తనాలూ వేసి ఎక్కువ పంటలు పండించాలని తహతహలాడుతున్న రైతాంగంయొక్క ఉత్సాహాన్ని, ఉపయోగించుకోలేక పోతున్నారని మహాసభ అభిప్రాయపడింది. మొదటి రెండవ ప్రణాళికా కాలంలో నీటి వనరుల అభివృద్ధి విషయంలోనూ, వరద నివారణ, మురుగునీటి సమస్యల విషయంలోనూ జరిగిన అశ్రద్ధ, లోపాలను మూడవ ప్రణాళికా కాలంలో జరుగకుండా ఈ క్రింది చర్యలు తీసుకోవాలని రైతుమహాసభ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.

1. 'నాగార్జున సాగర్'ను బహుళార్థ సాధక ప్రాజెక్టుగా గుర్తించి మొత్తం ఒకే దశగా పరిగణించి నిర్మాణం సాగించాలి. దీనిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి కేంద్రమే నిర్వహణ బాధ్యతను తీసికొని మూడవ ప్రణాళిక చివరకైనా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

2. 'వంశధార' ప్రాజెక్టు స్థల నిర్ణయాన్ని సాంకేతిక నిపుణుల సలహా ప్రకారం వెంటనే చేసి పని ప్రారంభించి మూడవ ప్రణాళికలోగల నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

3 'తుంగభద్ర' ఎగువ కాల్వ మొత్తం పథకాన్ని, పులివెందుల కాల్వతో సహా పూర్తి చేయాలి.

4 పోచంపాడు ప్రాజెక్టు మొత్తం పథకాన్ని ఆమోదించి వెంటనే పని ప్రారంభించాలి.

5. శ్రీశైలం విద్యుచ్ఛక్తి పథకం క్రింద ఇరిగేషన్ అభివృద్ధికి వున్న అవకాశాలను పరిశీలించి, అభివృద్ధికై డాము నిర్మాణంతో పాటు సత్వర చర్యలు తీసుకోవాలి

6 రాష్ట్ర ప్రభుత్వంచే అంగీకరించబడిన కనుపూరు కాలువను ప్లానింగు కమిటీ అంగీకరించాలి దీనిని, కావలి కాలువను, నెల్లూరుజిల్లా ప్రయోజనాల దృష్ట్యా 'సోమశిల'ను వెంటనే నిర్మించాలి.

7 విశాఖ, శ్రీకాకుళం జిల్లాలోని మధ్యరకం ప్రాజెక్టులను - వరాహ, తాండవ, శారద, మొదలగువాటిని మూడవ ప్రణాళికలో చేర్చి పని ప్రారంభించాలి.

8 కృష్ణా, గోదావరి డెల్టాలలోని వరద నివారణకు, మురుగు సమస్య పరిష్కారానికిగాను 'బుడమేరు' 'తమ్మిలేరు' 'ఎఱ్ఱకాలువ', 'ఏలేరు'. రిజర్వాయరులను, గోదావరిపై ఇప్పావు రిజర్వాయరును మూడవ ప్రణాళికా కాలంలో నిర్మించాలి.

9 మూడవ ప్రణాళిక చివరకైనా, పాడైపోయిన చెరువుల మరమ్మతు చేయాలి.

10. మెయిన్ వర్క్సుతోపాటే బ్రాంచి కాలువల, పిల్ల కాలువల నిర్మాణం జరగాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో లోపాలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలి.

11 మధ్యరకం, మేజర్ ప్రాజెక్టుల విషయంలో ఆయకట్టు ప్రాముఖ్యమైన ప్రజాప్రతినిధులతో కూడిన కమిటీలను నిర్మించాలి ప్రతి ప్రాజెక్టు ఏరియాలోను ఆయకట్టు అభివృద్ధికి వస్తున్న ఆటంకాలను తొలగిస్తూ రైతాంగానికి అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహాయం అందజేయాలి.

12. రాష్ట్రంలోని మెట్టప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ సౌకర్యాల అభివృద్ధికి, విద్యుచ్ఛక్తిని విరివిగా సక్రమమైన రేట్లకు అందించడానికి ప్రథమస్థానం యిచ్చి వెంటనే పని చేయాలి.

4. ప్రభుత్వవిధానాలు - ప్రజలనిరసన

అధిక పన్నులు విధించడంలోనూ, ఎరువుల పంపకం, బంజరు బంచరాయి భూముల పంపకంలోనూ, సక్రమమైన భూసంస్కరణలు తీసుకొని రావడంలోనూ రాష్ట్రప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా త్రోసివేస్తోంది. భూస్వామ్య అనుకూల వైఖరిని అవలంబిస్తూ తన ముఠాస్వార్థ సంకుచిత ప్రయోజనాలకోసం పాటుపడటం జరుగుతోందని ఈ మహాసభ అభిప్రాయపడుతుంది.

ఈవిధానాలను ప్రభుత్వంమార్చుకొని ప్రజానుకూలమైన విధానాలను చేపట్టుతుందని ఈ మహాసభ ఆశిస్తోంది. అలా మార్చుకొననిపాడు, ఏర్పడే పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని ఈమహాసభ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తోంది

ప్రభుత్వ ప్రస్తుత పోకడలను, విధానాలను నిర్విరోధంగా పోనిచ్చిన రాష్ట్ర ప్రజానీకానికి, ముఖ్యంగా రైతుకూలీలకు తీవ్రనష్టం వాటిల్లుతుందని, అందువల్ల ఈ విధానాలను మార్పించడానికి రాష్ట్ర ప్రజానీకం, రైతాంగం పూనుకోవాలని, తమ తీవ్ర నిరసనను తెలియజేయాలని ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

5. పారిశ్రామికాభివృద్ధి - ఆంధ్రప్రదేశ్ మూడవ ప్రణాళికా ప్రమాణం

మూడవ ప్రణాళికా కాలంలో రాష్ట్రప్రభుత్వం 505 కోట్లు ఖర్చు కాగల చిత్తు ప్రణాళికను యిటీవలనే కేంద్ర ప్రణాళికాసంఘం ఆమోదమునకు పంపినట్లుగా వార్తలు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళికా వ్యయం ఏపక్షంలోనూ 330 కోట్లకు మించకపోవచ్చునని ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యగారు పత్రికాప్రకటనలో చెప్పారు. మూడవ ప్రణాళికా ప్రమాణాన్ని గురించి ఆంధ్రప్రదేశ్ రైతు మహాసభ వివిధ విషయాలను పరిశీలించిన మీదట ఈ క్రింది అభిప్రాయానికి వచ్చింది

1 మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలోనూ, రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలోనూ రాష్ట్ర ప్రణాళికా వ్యయం చాల తక్కువగా నిర్ణయించబడింది. రాష్ట్ర జనాభా నిష్పత్తినిబట్టి చూచిన యెడల మొదటి ప్రణాళికా వ్యయంలోని 3300 కోట్లలోనూ మన రాష్ట్రవాటా 300కోట్లు రావాల్సివుంది అలాగే రెండవ పంచవర్ష ప్రణాళికా వ్యయం (ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లు కలుపుకుని) 7200 కోట్లలోనూ ఆంధ్ర రాష్ట్ర వాటా దాదాపు650కోట్లుగా ఉండాల్సి ఉంది. కాని వాస్తవంలో రాష్ట్రంలో రెండవ ప్రణాళికా కాలంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యాన ఖర్చుచేసినది 20 కోట్లకు మించదు. రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యాన జరిగిన వ్యయం 175కోట్లు. ఈ విధంగా మొత్తముమీద జరుగుతున్న ప్రణాళికా వ్యయంలో ఆంధ్రకు రావాల్సినవాటా రావడంలేదు.

2. మూడవ ప్రణాళికా వ్యయం ప్రభుత్వ, ప్రయివేటురంగాల్లోదాదాపు 10,000 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. దానినిబట్టి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో దాదాపు1,000కోట్ల వ్యయం జరగాల్సివుంది. అందుచే 1000 కోట్ల వ్యయంతో ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసి, దాని ఆమోదంకోసం కేంద్రంపై గట్టిగా వత్తిడి తీసుకురావాలని ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

మొదటి, రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రణాళికా కేటాయింపులలోనూ, పరిశ్రమల స్థాపన విషయాలలోనూ కేంద్రం ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఈ మహాసభ అభిప్రాయపడుతోంది రెండవ ప్రణాళికా కాలంలో ఆంధ్రలో స్థాపించడానికి చేసిన పెద్ద పరిశ్రమలలో ఏ ఒక్కదానిని కూడ కేంద్రం ఇక్కడ స్థాపించలేదు అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలన్న లక్ష్యాన్ని ఆంధ్ర విషయంలో బుట్టదాఖలు చేశారనే విషయాన్ని కేంద్రప్రభుత్వదృష్టికి ఈ మహాసభ తీసుకు వస్తోంది. మూడవ ప్రణాళికా కాలంలోనైనా ఈ అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసికోవాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని దృష్టిలో పెట్టుకొని, పరిశ్రమల కేటాయింపు, స్థాపన జరిగేటట్లు గట్టి చర్యలు తీసుకోవలసినదిగా ఈ మహాసభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది

ఆంధ్ర ప్రజానీకం, రైతాంగము ఈ విషయమై ఆందోళన చేయాలని ఈ మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

6. లోకలైజేషన్ స్కీము

లోగడ దాళ్వా భూముల నిర్ణయములో అనేకలోపాలు జరిగినవి ప్రతి సంవత్సరము అదనపుదాళ్వా నిర్ణయము చేయుటలో కూడ అన్యాయములు జరుగుతున్నాయి.

ఈ పరిస్థితులవల్ల దాళ్వా భూములను శ్రద్ధగా పరిశీలించి పునర్నిర్ణయం చేయాలి అని పశ్చిమ గోదావరి జిల్లాల రైతు సంఘములు, రాష్ట్ర రైతు సంఘము, యిరిగేషన్ సభలు, అనుభవముగల రైతు పెద్దలు ఆందోళన చేశారు.

రైతుల ఆందోళనను మన్నించి ప్రభుత్వం లోకలైజేషన్ స్కీము తయారు చేయుటకు ప్రారంభించింది. ఒక ప్రత్యేక యింజనీరు, ఇతర సిబ్బందిని ఏర్పరచిన పని జరుగుతుంది. ఇది సంతోషదాయకము

అయితే, పలుకుబడిగల స్వార్థపరులయిన భూస్వాములు పెద్ద ఎత్తున తీవ్ర ప్రయత్నములు చేస్తూ పర్మనెంటు జోన్, బైనియల్, ట్రైనియల్ జోన్లలో అర్హతగల భూములు వదలివేసి అనర్హమయిన భూములను చేర్పించుచున్నారు.

తక్కువ కాంటూర్‌లో ఉన్న భూములువదిలివేసి, ఎక్కువ కాంటూరులో ఉన్న భూములను చేర్చిన ఉదాహరణలున్నాయి.

ప్రతి సంవత్సరం తిరుమ మొదటి పంట నష్టపడుతూన్న భూములు పర్మనెంటు జోనులో నుండి తొలగిస్తున్న ఉదాహరణలున్నాయి.

రెవెన్యూ అధికారుల రికార్డులలో ఉన్న అవకతవకలు కూడా యిందుకు కారణము.

ప్రథమంలో చెప్పబడిన సూత్రములు సక్రమంగా ఆచరణలో లేకుండా పోతున్నాయి. అంతేగాదు. కొందరు పలుకుబడి గలవారి ప్రయత్నములవల్ల మొత్తము స్కీమునే వాయిదా వేయు ప్రయత్నములు కూడా బలంగా సాగుతున్నట్లు తెలుస్తోంది

ఇంతకాలం రైతాంగం ఆందోళన చేసి ప్రభుత్వం కూడాపనికుపక్రమించి మరల వాయిదా వేస్తే అంతకంటె అన్యాయం మరేమీ ఉండదు. కనుక ఈ స్కీము త్వరగా పూర్తిచేసి అమలు పర్చాలనీ, స్వార్థపర వర్గాలు సూత్రములను బలహీన పరచవద్దనీ, రెవిన్యూ రికార్డుల అవకతవకలను రైతు ప్రతినిధుల, శాసనసభ్యుల సహకారంతో పరిశీలించి, రైతులకు న్యాయం, కల్గిస్తూ స్కీము పూర్తి చేయించాలనీ, ఈ మహాసభ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతుంది.

7. తుంగభద్ర దిగువకాల్వ

తుంగభద్ర దిగువకాల్వ పూర్తయి 5 సంవత్సరములైనా భూమంతా సాగుక్రిందకి రాలేదు దీనికి ప్రధాన కారణం ఆ కాల్వక్రింది రైతులు అతి పేదలు కావడంవల్ల భూమిని సాగులోనికి తెచ్చుట ఎక్కువ ఖర్చుతో కూడినదై యుండటమే. పైగా నీటి తీరువా రేటు రెండు పంటలకు రు 22-8-0, ఒక పంటకు రు 15-0-0 మెట్టపంటలకు ఎకరానికి రు 10/- వంతున విధిస్తున్నారు దీనికితోడు భూమిశిస్తు సర్‌ఛార్జి మొ॥ పన్నులున్నాయి. ఈ పన్నుల భారమువల్ల అప్పులతోను పతనమవుతున్న రైతులు భూమినంతను సాగులోనికి తీసికొనివచ్చుట చాల కష్టమైనపని కనుక ప్రభుత్వము వెంటనే ఈ క్రింది చర్యలు తీసికోవాలని కోరుచున్నాము.

1 నీటి తీరువా రేటు తగ్గించాలి.

2 ఇంకా 5 సంవత్సరాలవరకు నీరుపయోగించుకున్న భూమికే నీటి తీరువా విధించాలి.

3 ప్రభుత్వం ఎకరానికి రు 300/- కొన్ని ఎరువులుపనిముట్లరూపములోను, కొంత నగదుగాను, దీర్ఘకాలవాయిదాలపై అప్పులు ఇవ్వాలి.

4 అభివృద్ధి పన్ను 5 ఏళ్ళు ఆపి ఉంచాలి.

8. దగ్గుబాడు హైలెవెల్ ఛానల్ వెంటనే నిర్మించాలి

గత పదిహేను సంవత్సరముల నుండి రైతు సంఘం, వివిధ రాజకీయ పార్టీల ఆందోళన ఫలితంగా దగ్గుబాడు హైలెవెల్ ఛానల్ ఆవశ్యకత గుర్తించుట జరిగింది. పైగా సంవత్సర కాలంలో 4 - 5 మాసములు మంచి నీళ్ళు దొరకవు. 4 - 5 మైళ్ళ దూరమునుండి మండు టెండలలో పిల్లలతో, కావిళ్ళతో, నెత్తి బుంగలతోపోయి నీళ్ళు తెచ్చుకొను సుమారు 50 గ్రామాల ప్రజలకు యీ ప్రాజెక్టు నిర్మించిన యెడల మంచినీళ్ళ కరువు నివారణతో బాటు, ఈ ప్రాంతపు భూములకు వ్యవసాయమునకు అన్నివిధాల ఉపయోగపడుట జరుగుతుంది. కాని ప్రభుత్వం డబ్బు లేదనే సాకుతో మూడుదశలగా ఆలోచిస్తూ, మొదటి దశను మూడవ ప్రణాళికలో ప్రారంభిస్తామని చెప్పుచున్నది. ఈ స్కీము మొత్తమునకు 3 కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. ఈ ప్రాజెక్టు ఏరియా లెవెల్ చాల అనుకూలముగాను, తక్కువ ఖర్చుతోను యెక్కువ లాభసాటి అయి ఉన్నది. ప్రధానంగా గుంటూరు, బాపట్ల తాలూకాలలో సుమారు 75 గ్రామాలకు చెందియున్న దాదాపు 1 లక్ష యెకరాలు సాగులోకివచ్చును. కాని ప్రజల కన్నీళ్ళు తుడవడానికన్నట్లు గుంటూరు కాలువ పేరుతో 3వ పంచవర్ష ప్రణాళికలో 80 లక్షలు రూపాయలు మాత్రము మంజూరుచేస్తూ చిత్తు ముసాయిదాలో చేర్చినట్లు తెలియుచున్నది. అందువలన ప్రాజెక్టుకొరకు యెన్నో సంవత్సరములనుండి యెదురు చూస్తున్న ప్రజలకు తీరని అపచారము జరుగుచున్నది. కనుక ప్రభుత్వము వెంటనే ఋణపత్రాలు జారీ చేసి సత్వరమే దగ్గుబాడువరకు యీ ఛానల్ త్రవ్వకము ప్రారంభించ వలసినదిగా ఈ సభవారు కోరుచున్నారు.

9. సర్వే, సెటిల్మెంటు

ఎస్టేట్లరద్దు జరిగినతర్వాత ప్రభుత్వం సర్వే సెటిల్మెంటులు జరుపుచున్నది. ఈ సందర్భములో వూహించలేనంత ఎక్కువగా అవకతవకలు జరిగి పోతున్నవి. ఉద్యోగుల లంచగొండితనం లేక నిర్లక్ష్యం మూలకంగా దాదాపు ప్రతి గ్రామంలోనూ రైతుల భూములు ఒకరిది మరొకరి పేరట యివ్వడం అన్నిరకాల పెద్దఎత్తున సాగినది. దీని మూలకంగా అనేక తగవులు తలయెత్తుచున్నవి. ముఖ్యంగా బంజర్ల విషయంలో అనుభవదార్ల పేర్లు తీసివేసి భూస్వాముల పేర్లు కలిపిన ఘటనలు అనేకములు ఉన్నవి. రైతులవద్ద రికార్డులులేని సందర్భములలో సెక్షన్ 11 (ఎ) క్రింద ఓరల్ విచారణ జరిపి రైతుల వద్ద సాక్ష్యం తీసికోవలసి ఉన్నప్పటికిని, అది ఆచరణలో అమలు జరుగుటలేదు.

ఇంతేగాక ఎవరిపేరట చిత్తు పట్టా నిస్తున్నదీగూడ రైతాంగమునకు అధికారులు తెలియజేయుటములేదు. దీని మూలకంగా సకాలంలో రివిజన్‌గాని, ట్రిబ్యునల్ వద్ద అపీలుగాని పెట్టుట అసంభవమగుచున్నది.

కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వం ఈ దిగువ చర్యలను తీసికోవాలని మహాసభ కోరుతున్నది.

1. సర్వే, సెటిల్మెంటులలో జరిగిన అవకతవకలను తొలగించుటకు 2, 3 సంవత్సరాలపాటు కేవలం జమాబందీలతోనే గాక రైతాంగం పిటీషను పెట్టుకోగానే విచారించి సరిచేయాలి

2 సెక్షన్ 11 (ఎ) క్రింద సెటిల్మెంటుఅధికారులు సక్రమంగావిచారణ జరిపించక హడావుడిగా ఒకే రోజున అనేక గ్రామాలకు ఆక్షేపణలు తెలియ చేయమని తక్కువ నోటీసులతో రైతులకు నోటీసు చేస్తున్న కారణంగా విచారణ అంతా హాస్యాస్పదంగా క్రింద తయారయి వుపయోగం లేకపోతున్నది. అందుచే తగినంత వ్యవధి నిచ్చి కేవలము రికార్డులమీద ఆధారపడుటయేగాక ఓరల్ ఎంక్వయిరీ జరిపి రైతులవద్ద సాక్ష్యం తీసికొనే పద్ధతి సక్రమంగా అమలు జరిపించాలి.

సెటిల్మెంటు ఆఫీసర్లు అవసరమైనపుడు భూమిమీదకు వచ్చే పద్ధతి అనుసరించాలి.

3. సెక్షన్ 11 ఎంక్వయిరీల తర్వాత చేసిన ఆర్డర్లు రైతులకు తప్పని సరిగా తెలియచేయాలి.

4 రైతాంగం కూడ సర్వే, సెటిల్మెంట్లు జరిగేటప్పుడు చొరవతీసికొని ఆఫీసర్లతో పాటు వెళ్ళి ముందుగానే జాగ్రత్తలు తీసికోవాలి.

5 పట్టా లిచ్చేటప్పుడు వివిధ వ్యక్తుల మధ్య సబ్-డివిజన్ చేయాలి

ఇతర తీర్మానాలు

వర్జీనియా పొగాకు, నాటు పొగాకులకు స్థిరమైన మార్కెట్లు సంపాదించడానికి కేంద్ర ప్రభుత్వం కృషిచేయాలని గ్రామాల జనాభా పెరిగిన కారణంగానూ, క్రొత్తగ్రామాలు కట్టవలసి వచ్చినందున పట్టాభూములలో ఇండ్లను నిర్మించటం జరిగిందనీ, వీటిని గ్రామకంఠాలలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేయబడ్డాయి. అలాగే ఈఏడాది రాయలసీమలో కొన్ని ప్రాంతాలలో ఏర్పడిన కరువు నివారణకు ప్రభుత్వం ఇంకా ఎక్కువ ఏర్పాట్లు చేయాలని, భద్రాచలం డివిజనలో కొండజాతి రైతులచేత ఫారెస్టు డిపార్టుమెంటువారు చేయించుకొంటున్న వెట్టిచాకిరీ నిషేధించాలని, వెంకటాపురం మొదలగు జమీందారీ గ్రామాలనూ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, కౌలు సబ్సిడీని గురించి, కవులుదారీ సమస్యను గురించి, పసుపుపై విధిస్తున్న వాణిజ్య పంటల ప్రత్యేక పన్నును రద్దుచేయాలని, పనికిరాని అటవీ భూములు పేదలకు సాగు కివ్వాలని, తెలంగాణాలోని బిల్హక్తా, సీవాయి ఈనాములను రద్దుచేసి ఈనాముదార్లకు పట్టాలుయివ్వాలని, పట్టాదారీ పాస్‌బుక్కులు 1960 డిశంబరులోగా సప్లయి చేయాలని తీర్మానాలు గావించబడ్డాయి.

ప్రదేశ్ రైతుసంఘానికి శ్రీ రావి నారాయణరెడ్డి యం. యల్. ఎ అధ్యక్షులుగాను, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య యం. యల్. ఎ టి. లక్ష్మినారాయణరెడ్డి, చలసాని వాసుదేవరావుగార్లు ఉపాధ్యక్షులుగాను, శ్రీ వై. వి. కృష్ణారావు ప్రధాన కార్యదర్శిగాను, శ్రీ కె. యల్. నరసింహారావు యం. యల్. ఎ, శ్రీ కొల్లా వెంకయ్య యం యల్. సి సహాయ కార్యదర్శులుగాను నూతన కార్యవర్గం ఎన్నుకోబడింది.

చైనాలో అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు

పెకింగ్‌లో 10 లక్షలమంది ఊరేగింపు

పెకింగ్, మే 9

పెకింగ్‌లో నేడు దాదాపు 10 లక్షలమంది అమెరికాకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిపారు. అమెరికా-జపాను పరస్పర రక్షణసంధిని పునరుద్ధరించుతున్నందుకు నిరసనగా ఈ ప్రదర్శనాన్ని జరిపారు.

"మూర్ఖపు చర్య"

కార్మిక నాయకుని వ్యాఖ్య

వాషింగ్టన్, మే 10

సోవియట్ భూభాగంలో అమెరికా గూఢచారి విమానం పట్టుబడిన ఉదంతం "అమెరికా చరిత్రలో కనీవినీ ఎరుగని మూర్ఖత్వం" అని అమెరికా ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాల్టర్ రూథర్ నేడు వ్యాఖ్యానించారు.

ఆయన యింకా యిలా అన్నారు: "ముఖ్యంగా పారిస్‌లో శిఖరాగ్ర సమావేశం జరుగనున్న సందర్భంలో ఇదిజరగడం కన్నా ఘోరమైన విషయం మరొకటి వుండదు. మనం ఇటువంటి తప్పులకే అలవాటు పడితే, తీవ్రమైన చిక్కుల్లో పడటం ఖాయం."

నేలకూలిన అమెరికా విమాన లక్ష్యం ఏమిటి?

— నార్వేవిదేశాంగ మంత్రి

ఓస్లో, మే 9

నార్వే విదేశాంగ మంత్రి హాల్వార్డ్ లాంగే నేడు తమ పార్లమెంటులో రష్యాలో కూల్చివేయబడిన విమానం గురించి మాట్లాడుతూ సోవియట్ ప్రధాని చెప్పినట్లు ఆ విమానం నార్వేలోని బొడో విమానాశ్రయానికి వెళుతున్న విషయమై పూర్తి సమాచారాన్ని సేకరించమని అమెరికాలోని నార్వే రాయబారిని కోరామని తెలిపారు.

"రష్యాలో కూలిపోయిన అమెరికా విమాన చోదకుడు తాను నార్వేలోని బొడో విమానాశ్రయానికి పయనమై పోతున్నట్టు చెప్పాడని రష్యావారంటున్నారు.

"కాని నార్వేలోని అధికారుల కెవరికీ ఆవిషయం తెలియదు

"నార్వేకు సంబంధించినంతవరకు దీనికి సంబంధించిన అన్ని వివరాలు సేకరిస్తాం; అమెరికా అధికారులతో దీన్ని గురించి సంప్రదించమని మన రాయబారిని కోరాం.

"విదేశాల భూభాగాలను అతిక్రమించే విమానాలకు ఆశ్రయ మివ్వడానికి నార్వే ఎన్నడు అనుమతించలేదు పరస్పరానుమతితో మాత్రమే మిత్రదేశాలకుచెందిన విమానాలుకొన్ని సార్లు నార్వే విమానాశ్రయాలను ఉపయోగించుకొని, ఆర్కిటిక్ సముద్రంమీద గస్తీ తిరిగివచ్చాయి.

"అయితే అలాంటి సమయాల్లో గూడ విదేశాల ఆకాశ సరిహద్దును గాని, భూభాగాలనుగాని అతిక్రమిస్తూ యీవిమానాలు ఎగరకూడదని నార్వే ఎప్పుడూ షరతు పెడుతూంది" అని అన్నారు.

నోటీసు

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియచేయునది ఏమనగా ఖమ్మం తాలూకా, నాగులవంచ గ్రామంలో నా క్లయింటు శ్రీమతి పణిహారం రంగనాయకమ్మగారి స్వాధీనానుభవములో వున్న, అనగా సర్వే నెం. 5, 8, 13, 30 లను నా క్లయింటుయొక్క మరిది కుమార్తె పణిహారం రంగాచారి మరియూ గ్రామపట్వారీ కలసి అన్యాయంగా విక్రయించే ప్రయత్నం చేయుచున్నారని తెలిసినది. కనుక ఎవరయినను సదరు భూములను కొన్నయెడల దానియొక్క నష్టకష్టములకు వారే బాధ్యులు గాగలరు.

యస్. విశ్వనాథం,
అడ్వకేటు, ఖమ్మంమెట్టు.

తప్పిపోయినాడు

నా కుమార్తు దుర్గారావు వయస్సు 4 సం॥లు, చామనచాయ, గడ్డంక్రింద దెబ్బతగిలిన మచ్చ, పొట్ట ఎడమ భాగమున పెద్ద పుట్టుమచ్చ కలదు. గుంటూరు కొత్తపేటలో వద్ద తప్పిపోయినాడు. జాడ తెలిపినా, అప్పగించినా తగిన బహుమతి యివ్వగలను.

కనకా అన్నపూర్ణమ్మ,
ఆనంద్ మహల్ వద్ద,
పొట్టి శ్రీరాములు నగర్, గుంటూరు.

"ఛాంపియన్"

కలమును లక్షలాదిఉపయోగిస్తున్నారు. ఎందుకు?



ఛాంపియన్
(రిజిస్టర్డు)
అందరు కోరుకునేది
గుజరాత్ ఇండస్ట్రీస్ (ప్రై) లిమిటెడ్.
బొంబాయి-2.

కావలెను
శ్రీ వి. ఎతిరాజులుచెట్టి ప్రెపరేటరీస్కూలు
వెపరి, మద్రాసు - 7
ఒక హెడ్‌మిస్ట్రెస్
(తెలుగు ఇంటర్‌మీడియట్ ట్రైయినింగ్ పూర్తిచేసి కనీసం 10 సం॥ల టీచింగ్ మరియు ఎడ్మినిస్ట్రేషన్ అనుభవము యుండవలయును)
మరియు
లేడీ టీచర్సు 5 గురు
(తెలుగు యస్. యస్. యల్. సి. ట్రయినింగ్ పూర్తిచేసి టీచింగ్ అనుభవము)
అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత
జీతము, డి. ఎ. మొదలగునవి గవర్నమెంటు స్కేలుప్రకారము
జూన్ 1960 నుండి స్కూలు ప్రారంభం
ఈ క్రింది వారికి అప్లయిచేయండి
పోస్టుబాక్సు నెం. 82. C/o విశాలాంధ్ర, విజయవాడ - 2

PEKING REVIEW

PEKING REVIEW, the English weekly newspaper of Chinese news and views brings to you:
- Authoritative and timely information on economic and political developments in China
- Theoretical articles
- China's views on international affairs
- News of China's foreign trade
- Cultural trends
- Cartoons, illustrations, maps, graphs and statistics
- Texts of major policy statements and documents

Subscription rates:
6 months: Rs. 6.00
One year: Rs. 12.00

Send your subscriptions to:
Visalaandhra Publishing House,
'Vijayawada.
Peoples Book House, Hyderabad.

ADCRAFTS



పాపాయి అందముగా ఉన్నాడు
కారణము నిప్ గ్రైప్ వాటర్

నిప్ గ్రైప్ వాటర్ కడుపులోని అస్వస్థతలను, నొప్పులను మరియు అజీర్ణమును వెంటనే నయముచేయును. పిల్లలకు నిప్ వాడుతే పళ్లు వచ్చే సమయములో కలిగే చికాకులు ఉండవు.

Nip Gripe Water is manufactured in India by Atul Drug House under agreement with Nip Chemicals, Milano, Italy.

ఉత్తమమైన నిప్ గ్రైప్ వాటర్
బాటిల్ పేరు చెప్పి అడగండి

అతుల్ డ్రగ్ హౌస్
బొంబాయి 13

డిస్ట్రిబ్యూటర్లు
గణేశ్ మెడికల్ హాల్ (ఏజెన్సీస్)
సుల్తాన్ బజార్, హైద్రాబాదు
గ్రామ్: CHEMISTS ఫోన్: 5440

సంపాదకవర్గం: కాటూరు హనుమంతరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ-2